తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 06.08.2026 | సంపుటి : 13 సంచిక : 17 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698








## తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు

# అనుమతులివ్వండి

### కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

**తెలంగాణ-మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయండి**

**పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌కు వినతి**

- పీఎంకు రాసిన లేఖ... పీఎంవో స్పందనపై చర్చ
- చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపిన కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

**ఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్ శక్తికి పంపిన లేఖ విషయాన్ని ముఖ్యమంత్రి జల్‌శక్తి మంత్రితో ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (CWPRS) అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. CWPRS అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. ముంపులోనూ 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు సీఎం వివరించారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని, కాబట్టి 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను సీఎం కోరారు.

తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని సీఎం వివరించారు.

ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ అంశంపై మొదట

మిగతా 2లో..

**తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి చిరునామా ప్రొఫెసర్ జయశంకర్ సార్**
**ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

2లో..

## పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, డిండిలకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి

**భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి**



పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టు లకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్లమెంట్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ఫలితంగా ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు సానుకూలత నేపథ్యంలో ప్రాజెక్టులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

**అరెస్టైన ఐదుగురు నిందితులు వీరే...**
అర్జున్ కుమార్
హార్దిక్ సింగ్
సుఖదీప్ సింగ్
అన్మోల్ సింగ్
సుఖమన్ సింగ్




## ఢిల్లీలో జంతర్‌మంతర్‌పై

# ఐఎస్ఐ కుట్ర..!

### సీజేపీ నిరసనల్లో ఉగ్ర కుట్ర..

**పంజాబ్ పోలీసుల విచారణలో 9 మంది పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్లకు స్థానిక సహచరుల పాత్ర?**

**ఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలను ఆసరాగా చేసుకొని భారత్‌లో దాడులు చేయాలని పాకిస్తాన్ కుట్ర పన్నినట్లు భద్రతాదళాలు అనుమానిస్తున్నాయి. దీనికి సంబంధించి కీలక ముందడుగు

మిగతా 2లో..

# వడ్డీ రేట్లు యథాతథం

### రెపో రేటులో ఎలాంటి మార్పు లేదు

- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా
- కీలక వడ్డీరేట్లను సవరించకపోవడం వరుసగా నాలుగోసారి



**ముంబై (జనంసాక్షి) :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరోసారి కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి సమీక్షలో రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదని, ప్రస్తుతం ఉన్న 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది నాలుగోసారి కావడం విశేషం. ఈ సంవత్సరం ప్రారంభం నుండి జరిగిన ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ ద్వైమాసిక సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగానే కొనసాగించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్‌లో

మిగతా 2లో..

# హరీష్... కట్టుకథలు ఆపు!

### కవిత ఆరోపణలకు సమాధానం చెప్పు : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్, (జనంసాక్షి) :** మాజీ మంత్రి హరీష్‌రావు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించా రు. తాజాగా జరిగిన గోదావరి నదీ యాజమా న్య బోర్డు సమావేశంపై కట్టుకథలు అల్లుతూ ప్రభుత్వంపై బట్ట కాల్చి మీద వేసే యత్నాలను మానుకోవాలని ఆయన హితవు పలికారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని, రైతుల నీటి హక్కులను చివరివరకు కాపాడుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, తీసుకు న్న ముడుపుల లెక్కలను ప్రజలకు సమాధానం గా చెప్పాలని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ డిమాండ్ చేశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు అజెండాలో కొత్త అంశాలేమీ లేవని, గత 12 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ అవే పాత అభ్యంతరా లను లేవనెత్తుతోందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే పోలవరం, పట్టిసీమ, రాయలసీ మ ఎత్తిపోతల పథకాల పనులు జరిగాయని, నాటి పాలకులు నోరు మెదపకుండా ఏపీకి సహకరించారని ఆయన ఆరోపించారు. ఒకవైపు గతంలో ఏపీ అక్రమ ప్రాజెక్టులకు సహకరిస్తూ, ఇప్పుడు ప్రభుత్వంపై నిందలు వేస్తున్న బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు స్పష్టంగా గమని స్తున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## విద్యార్థులపై బలప్రయోగం

# సరైంది కాదు

### పోలీసులకు సుప్రీంకోర్టు హితవు



- యువతను శాంతింపజేయడం అధికారుల తొలి బాధ్యత
- బలప్రయోగం కాదు.. యువతతో సంభాషణే పరిష్కారం
- 'చలో పార్లమెంట్' సంఘటనలపై ధర్మాసనం విచారణ

**న్యూఢిల్లీ ఆగస్టు 5 (జనంసాక్షి):** నిరసన ప్రదర్శనల సమయంలో భద్రతా బలగా లు, పోలీసులు అత్యంత సంయమనంతో వ్యవ హరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల ఎస్‌జేపీ నిర్వహించిన 'చలో పార్లమెంట్' మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసకు బాధ్యులైన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలం టూ దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. సీజే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మాట్లాడుతూ, కొంతమంది వ్యక్తులు రాళ్లు రువ్వ డం లేదా ఉద్రిక్తతకు పాల్పడినా, యువతను శాంతింపజేయడం అధికారుల తొలి బాధ్యత కావాలని పేర్కొంది. బలప్రయోగంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం కంటే, వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం, అవసర మైతే కౌన్సెలింగ్ ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించడం మరింత సమర్థవంతమైన విధానమ ని అభిప్రాయపడింది. బలప్రయోగం కాదు.. యువతతో సంభాషణే పరిష్కారం.

ప్రభుత్వం తరపున కూడా అతిగా కఠిన వైఖరి ప్రదర్శిస్తే పరిస్థితులు మరింత

మిగతా 2లో..

## అట్టుడుకుతున్న పార్లమెంట్

- విద్యార్థులపై లాఠీచార్జి, అయోధ్య చోరీ ఘటనపై చర్చకు విపక్షాల పట్టుదల
- మళ్లీ వాయిదాలతో ముగిసిన పార్లమెంట్ సమావేశాలు
- ప్రభుత్వం, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన

2లో..



## ఎట్టకేలకు క్షమాపణ చెప్పిన

# జుకర్‌బర్గ్

### వివాదాస్పద వ్యాఖ్యలపై వెనక్కి తగ్గిన మెటా అధినేత

కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం

**న్యూఢిల్లీ,ఆగస్ట్5 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతేకాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై

మిగతా 2లో..


## మౌనం వీడండి... తెలంగాణకు

# ద్రోహం జరుగుతోంది!

### తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర


**18న భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు : మాజీమంత్రి హరీష్ రావు**

**హైదరాబాద్,ఆగస్ట్ 5 (జనంసాక్షి) :** ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం



చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు.

- కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ
- నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ
- దర్యాప్తు వేగవంతం




## హైడ్రా సంతకాల

# ఫోర్జరీ కలకలం

**హైదరాబాద్, ఆగస్ట్ 5 (జనంసాక్షి) :** హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియో గం చేస్తూ నకిలీ ఫైర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు

మిగతా 2లో..

# గుడ్డి చికిత్స పేరిట మహిళ బలి

- మత విశ్వాసం పేరుతో పది రోజులపాటు స్తంభానికి కట్టేసి దారుణం
- ఉత్తరప్రదేశ్‌లోని బరాబంకి జిల్లాలో ఘటన

2లో..


జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
6 ఆగస్టు 2026



## తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు అనుమతులివ్వండి

కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తొలుత తెలంగాణ, మహారాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియ జేశారు. ఆ తర్వాత తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తాన ని జల్‌శక్తి మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు.
సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ.శ్రీధర్ పాల్గొన్నారు.

## ఎట్టకేలకు క్షమాపణ చెప్పిన జుకర్‌బర్గ్




లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

## జాతీయ రహదారులపై తగ్గిన ప్రమాదాలు

### దాదాపు 4 శాతం తగ్గిందన్న కేంద్రమంత్రి గడ్కరీ



**న్యూఢిల్లీ, (జనంసాక్షి) :** జాతీయ రహదారులపై ప్రమాదాల తగ్గినట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత నేషనల్ హైవేలపై మరణాల సంఖ్య దాదాపు 4 శాతం తగ్గిందని బుధవారం పార్లమెంటులో వెల్లడించారు. హైవేలపై యాక్సిడెంట్స్ లలో చనిపోయే వారి సంఖ్య 2025లో 62 వేల 122 కు తగ్గినట్లు చెప్పారు. 2024లో 64 వేల 772 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే.. 2023లో 63 వేల 112 మంది చనిపోయినట్లు తెలిపారు. ప్రతి ఏటా మరణాల సంఖ్య పెరుగుతూ వస్తుండేదని.. కానీ కరోనా తర్వాత తొలిసారి 2025లో మృతుల సంఖ్య తగ్గినట్లు చెప్పారు. అదే సమయంలో 2025లో రోడ్డు యాక్సిడెంట్ల సంఖ్య 5.30 శాతం పెరిగినట్లు చెప్పారు. అంటే 5.13 లక్షల యాక్సిడెంట్స్ జరిగినట్లు చెప్పారు. సరాసరిగా గంటకు 21 మంది చనిపోయినట్లు వెల్లడించారు. నేషనల్ హైవేస్ పై 2025లో లక్షా 43 వేల 526 ప్రమాదాలు జపగగా.. ఈ ఏడాది జులై 27 వరకు 77 వేల 234 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తమిళనాడులో ఎక్కువగా జరుగుతున్నట్లు గడ్కరీ చెప్పారు. 71 వేల 387 యాక్సిడెంట్స్ తో తమిళనాడులో ముందంజలో ఉన్నట్లు చెప్పారు. అదేసమయంలో రోడ్డు ప్రమాద మృతులలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 2025లో ఆ రాష్ట్రంలో 27 వేల 550 మంది చనిపోయినట్లు గణాంకాలు పార్లమెంటుకు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి చిరునామా ప్రొఫెసర్ జయశంకర్ సార్

### ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు, తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గౌరవంగా స్మరించుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఆగస్టు 6న ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆ మహనీయులు తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు ఆయన అందించి న విశిష్ట సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకు న్నారు. తెలంగాణ స్వప్నాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాస లుగా మార్చుకుని చివరి శ్వాస వరకు ఉద్యమించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని సీఎం అన్నారు. తెలంగాణే ధ్యేయం గా, తెలంగాణే లక్ష్యంగా ఆ మహనీయుడు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను, ప్రజలు ఎదుర్కొన్న వివక్షను గణాంకాలతో సహా దేశానికి వివరించి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాల పాటు సజీవంగా నిలిపిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కే దక్కుతుందని ముఖ్య మంత్రి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం, దిశానిర్దేశం చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు.

## ఢిల్లీలో జంతర్‌మంతర్‌పై ఐఎస్ఐ కుట్ర..!

పడింది. ఐఎస్ఐ మాడ్యుల్స్‌కు చెందిన సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు మైనర్‌లు. వీరి వద్ద భారీ సంఖ్యలో కుట్రకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు వివరించారు.

**పంజాబ్ పోలీసుల విచారణలో 9 మంది**

అమృత్‌సర్ పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉగ్ర నెట్‌వర్క్ కార్యకలాపాలు జంతర్ మంతర్ వరకు విస్తరించినట్లు గుర్తించారు. పోలీసుల అదుపులో ఉన్న పలువురు తమ సహచరులతో కలిసి జంతర్ మంతర్‌కు వెళ్లినట్లు తేలింది. కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని లక్ష్యంగా ఉగ్ర దాడికి కుట్ర పన్నినట్లు వెల్లడైంది. యూపీకి చెందిన ఓ వ్యక్తి ద్వారా ఆయుధాలు, పేలుడు పదార్థాలు సమకూర్చేందుకు ఐఎస్ఐ హ్యాండ్లర్లు ప్రయత్నించారట. అయితే భద్రతా సంస్థలు అప్రమత్తం కావడంతో ఆ ప్రణాళిక భగ్నమైంది.

**విచారణలో షాకింగ్ విషయాలు వెల్లడి**

ఫలితం లేదని భావించిన సదరు వ్యక్తులు.. చివరకు పంజాబ్‌కు చేరుకున్నట్లు తేలింది. తొలుత ఉగ్ర ముఠాకు సంబంధించి రాజస్థాన్‌కు చెందిన సుఖ్‌మన్ సింగ్‌తోపాటు ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు బాటిల్ బాంబులు, రెండు పిస్టళ్లు, తొమ్మిది కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. సుఖ్‌మన్ సింగ్ ఐఎస్ఐ హ్యాండ్లర్లతో నిరంతరం సంబంధాలు కొనసాగించినట్లు విచారణలో తేలింది. పంజాబ్‌లోని పోలీస్ భవనాలు, కీలక అధికారుల కదలికలపై రెక్కీ నిర్వహించి సమాచారాన్ని సేకరించారట. పేటీఎం సహా డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలను గుర్తించారు.

పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్లకు స్థానిక సహచరుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. రైల్వే ట్రాక్‌ల సమీపంలో నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి వాటిలోని ఫుటేజీని విదేశాలలో ఉన్న ఐఎస్ఐ హ్యాండ్లర్లతో పంచుకుంటున్నట్లు దర్యాప్తులో గుర్తించారు అధికారులు. ప్రభుత్వం హామీతో నిరసనకారులు తమ ఆందోళనను విరమించారు. అది కంటిన్యూ అయితే ఊహించని నష్టం జరిగేదని అంటున్నారు.

## గుడ్డి చికిత్స పేరిట మహిళ బలి



**లక్నో ఆగస్టు 5 (జనంసాక్షి):** మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న మహిళను పది రోజుల పాటు స్తంభానికి కట్టేశారు. దేవుడి ప్రతినిధిగా చెప్పుకునే ఒక స్వామి ద్వారా మూఢనమ్మకం పేరుతో చికిత్స అందించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ మహిళ ఆరోగ్యం క్షీణించడంతో ఆమె మరణించింది. ఉత్తరప్రదేశ్‌లోని బరాబంకి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. లక్నోలోని గోమతీనగర్‌లో నివసించే 33 ఏళ్ల రూబీ యాదవ్ మానసిక అనారోగ్యంతో బాధపడుతు న్నది. ఆమె భర్త అంకిత్ యాదవ్ మూఢనమ్మకాల ద్వారా చికిత్స అందించేందుకు ప్రయత్నించాడు. దేవుడి ప్రతినిధిగా చెప్పుకునే 71 ఏళ్ల స్వామి మున్నాను ఆశ్రయించాడు. కాగా, దేవా ప్రాంతంలోని ఒక ప్రదేశంలో సుమారు పది రోజుల పాటు రూబీని ఒక స్తంభానికి వారు కట్టేశారు. ఆమె మానసిక అనారోగ్యానికి చికిత్స పేరుతో కొన్ని ఆచారాలు, పూజలు నిర్వహించారు. ఆగస్ట్ 3న ఆ మహిళ ఆరోగ్యం క్షీణించడంతో ఆ సాయంత్రం దేవాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఆ రాత్రి ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మరోవైపు రూబీ తండ్రి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె భర్త అంకిత్, స్వామి మున్నా, అతడి సహాయకుడైన 55 ఏళ్ల ఖాదిర్ అహ్మద్‌ను అరెస్టు చేశారు. పోస్ట్‌మార్టం నివేదిక అందిన తర్వాత నిందితులపై తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారి వెల్లడించారు.

## హైడ్రా సంతకాల ఫోర్జరీ...

గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## విద్యార్థులపై బలప్రయోగం సరైంది కాదు

ఉద్రిక్తంగా మారే ప్రమాదం ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందువల్ల ఇలాంటి సందర్భాల్లో శాంతియుత దృక్పథంతో వ్యవహరించడం అవసరమని సూచించింది. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నప్పుడు పోలీసులు సహనం కోల్పోకుండా పరిస్థితిని అదుపులో ఉంచేలా వ్యవహరించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. యువత ఎందుకు నిరసన వ్యక్తం చేస్తున్నారో,వారి సమస్యలు ఏమిటో ముందుగా వినడం ఎంతో అవసరమని తెలిపింది. వారి ఆందోళనలకు కారణమైన అంశాలను అర్థం చేసుకోవడమే సమస్యపరిష్కారానికి అత్యంత ప్రభావవంతమైన మార్గమని స్పష్టం చేసింది. అదేవిధంగా,ఇలాంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో చట్టాన్ని అమలు చేసే సంస్థలకు తగిన అవగాహన,అనుభవం ఉన్నాయని,ఆయా పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ వారికి ఉండాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

## వడ్డీ రేట్లు యథాతథం

జరిగిన సమీక్షల్లోనూ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ప్రధాన వడ్డీ రేటును మార్చకుండా యథాతథంగా ఉంచడంతో పాటు, ఆర్‌బీఐ స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 5% వద్దే కొనసాగించింది. అలాగే మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటును, బ్యాంక్ రేటును మార్చకుండా 5.5% వద్ద స్థిరంగా ఉంచింది. హెడ్‌లైన్ సీపీఐ ద్రవ్యోల్బణం తాము ఊహించిన విధంగానే నిర్దేశిత లక్ష్యం కంటే స్వల్పంగా పెరిగిందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తమ విధాన ప్రసంగంలో వెల్లడించారు. ఈ ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధానంగా ఆహారం, ఇంధనం ధరలే కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక (కోర్) ద్రవ్యోల్బణం మాత్రం ఆశాజనకంగా అదుపులోనే కొనసాగుతోందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో హెడ్‌లైన్ ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరి, ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## అవసరమైతే వందసార్లయినా అరెస్ట్ అవుతా

### ఎవరి బెదిరింపులకు లొంగేది లేదు: ఉదయనిధి



**చెన్నై, ఆగస్టు 5 (జనంసాక్షి):** సినీ నటి త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యల వివాదంలో అరెస్టయి, విడుదలైన.. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విడుదల అనంతరం తన తండ్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో ఉన్న ఫొటోను సోషల్ మీడియా 'ఎక్స్'లో షేర్ చేసిన ఆయన.. రాజకీయ ఒత్తిళ్లకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. 'నేను కలైంజర్ మనవడిని.. ఎంకే స్టాలిన్ కుమారుడిని.. డీఎంకే కార్యకర్తను. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదు. రైతుల కోసం పోరాడే క్రమంలో ఒక్కసారి కాదు.. అవసరమైతే వందసార్లు అరెస్ట్ అయ్యేందుకైనా సిద్ధమే. ప్రజాసేవను ఎలాంటి అణచివేత ఆపలేదు' అని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అంతకుముందు.. త్రిషా కృష్ణన్‌పై ఉధయనిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. దీంతో మంగళవారం(ఈనెల 4న) పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఆ తర్వాత అధికార పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారాయన. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తనను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. తంజావూరులో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి అసత్య ప్రచారం చేశారని, తప్పుడు కేసులు బనాయించి రాజకీయంగా వేధించేందుకు యత్నించారన్నారు. అరెస్ట్ చేసిన సమయంలో తానేమాత్రం భయపడలేదని, మీడియా ఎదుట ఈ చర్యను హాస్యాస్పదంగా భావిస్తున్నానని చెప్పి మరీ పోలీసులతో వెళ్లానని తెలిపారు. తానెప్పుడూ పారిపోలేదని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోనని చెప్పుకొచ్చారు ఉదయనిధి. లాగే గతంలో కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ.. అధికార పక్షంపై ఉధయనిధి విమర్శలకు దిగారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించ కుండా రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తన అరెస్ట్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన డీఎంకే కార్యకర్తలు, మిత్రపక్ష, ఇతర రాజకీయ పార్టీల నేతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## అట్టుడుకుతున్న పార్లమెంట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** విద్యార్థులపై జరిగిన లాఠీచార్జి ఘటన, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఆరోపణలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని విపక్షాలు మరోసారి గట్టిగా డిమాండ్ చేశాయి. ఈ రెండు అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సమావేశాలు సజావుగా సాగలేదు.
రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, పరీక్షల అక్రమాలపై నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, దీనిపై సభలో సమగ్ర చర్చ జరగాల్సిందేనని ఆయన పట్టుబట్టారు. అలాగే అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాల చోరీ ఆరోపణలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ వ్యవహారంపై పారదర్శక దర్యాప్తు జరిపి వాస్తవాలను దేశ ప్రజల ముందు ఉంచాలని కోరాయి. విపక్ష సభ్యులు సభ మధ్యలోకి వచ్చి నినాదాలు చేయడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. సభను సజావుగా నిర్వహించేందుకు ఛైర్మన్, స్పీకర్ చేసిన విజ్ఞప్తులను విపక్ష సభ్యులు పట్టించుకోకపోవడంతో రెండు సభలను పలుమార్లు వాయిదా వేశారు. ప్రభుత్వం మాత్రం సభలో ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన శాసన కార్యక్రమాలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని అధికార పక్షం పేర్కొంది. చర్చకు తగిన నిబంధనలు ఉన్నాయని, సభా నియమావళిని అనుసరించాలని సూచించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై లాఠీచార్జి, అయోధ్య విరాళాల చోరీ ఆరోపణలపై చర్చ జరిపే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని విపక్షాలు స్పష్టం చేశాయి. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం-విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

## తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

- పోలీస్, ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
- సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్



**హైదరాబాద్, ఆగస్టు 5 (జనంసాక్షి):** తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్ట్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.




## యాద్గిర్ జిల్లా రసాయన పరిశ్రమలో ప్రమాదం

### ముగ్గురు యువకుల దుర్మరణం..ఒకరు నారాయణపేట జిల్లా వ్యక్తిగా గుర్తింపు

**రాయచూర్,(జనంసాక్షి):** కర్ణాటక యాద్గిర్ జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తెలంగాణ యువకుడు సహ ముగ్గురు యువకులు మరణించారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. విషవాయువులు విడుదల కావడంతో బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 2 గంటల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని విషవాయువులు లీకవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషవాయువులు లీకవ్వడంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవ్వడంతో వారిని రాయచూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే అప్పటికే ముగ్గురు మృతిచెందినట్లుగా వైద్యులు గుర్తించారు. మృతులను తెలంగాణలోని నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆలంపల్లికి చెందిన గణేశ్, మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన విక్రమ్, సంజయ్‌లుగా గుర్తించారు. వీరంతా 20 నుంచి 25 ఏళ్లలోపు వారేనని అధికారులు తెలిపారు. ఇక ఈ ఘటనలో ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన హేమంత్, శివకుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న యాద్గిర్ జిల్లా ఎస్పీ పృథ్వీక్ శంకర్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై దర్యాప్తు చేపట్టారు.



## గోదావరి వరదలకు చెక్ పెట్టేందకు నిర్ణయం

### వరదల నుంచి రక్షణకు కరకట్ట నిర్మాణం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 5 (జనంసాక్షి):** ప్రతి ఏడాది గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల ప్రజలకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి వరదల నుంచి మండలంలోని పలు గ్రామాలను రక్షించేందుకు కరకట్ట నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తొలి దశలో సుమారు 270 నుంచి 300 ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. సంజీవరెడ్డిపాలెం నుంచి బూర్గంపహాడ్ మీదుగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వరకు 17 మీటర్ల ఎత్తుతో, 12 కిలోమీటర్ల పొడవున కరకట్ట నిర్మించనున్నారు. భూమి అడుగు భాగంలో సుమారు 180 మీటర్ల వెడల్పుతో, పైభాగంలో ఐదు మీటర్ల వెడల్పుతో ఈ రక్షణ గోడను నిర్మించనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కరకట్ట నిర్మాణంతో పాటు మండలంలో వర్షపు నీరు గోదావరిలోకి వెళ్లేలా రెండు పంప్‌హౌస్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలోని పెదవాగు నుంచి ప్రారంభమయ్యే కరకట్ట, సంజీవరెడ్డిపాలెం సమీపంలోని దోమల వాగు వరకు నిర్మించనున్నారు. కరకట్ట నిర్మాణంతో సంజీవరెడ్డిపాలెం, బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాలతో పాటు మండల కేంద్రానికి గోదావరి, కిన్నెరసాని వరదల ముప్పు నుంచి రక్షణ లభించనుంది. ప్రతి ఏడాది వరదల కారణంగా పంటలు, ఇళ్లు ముంపునకు గురవడం, ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిపోవాల్సిన పరిస్థితికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. కరకట్ట నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం ఇప్పటికే భద్రాచలం సబ్‌కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారంలోపు భూసేకరణ సర్వే పనులు ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. తొలి దశలో 270 నుంచి 300 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో భూసేకరణకు పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

# ఎల్ఐసిలో డిజిన్విస్టిమెంట్ తగదు



- నల్లగొండ బ్రాంచ్ వద్ద ఉద్యోగుల నిరసన

**నల్లగొండ, ఆగస్ట్5 (జనంసాక్షి) :** భారత జీవిత బీమా సంస్థలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మరింత వాటాల ఉపసంహరణ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నల్లగొండ బ్రాంచ్ 1, 2 కార్యాలయాల వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ 1, 2 అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు వెంకన్న, ఏ.కరుణాకర్ రావు, ఐ.లక్ష్మీనారాయణ, సి.హెచ్.రమేష్, ఏజెంట్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 3న ప్రకటించిన ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఎల్ఐసిలో మరో 2.5 శాతం నుండి 6.5 శాతం వరకు వాటాలను విక్రయించాలని ప్రభుత్వం చూడడం దారుణమన్నారు. మే 2022లో ఐపీవో ద్వారా ఉపసంహరించిన 3.5 శాతానికి అదనంగా మళ్లీ ప్రజల ఆస్తిని మార్కెట్‌కు కట్టబెట్టడం దేశ ప్రయోజనాలకు విఘాతమని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది మంది పాలసీదారుల నమ్మకంతో నిర్మితమైన ఎల్ఐసి కేవలం లాభాలు తెచ్చే సంస్థ మాత్రమే కాదని, దేశ ఆర్థిక రక్షణకు, అభివృద్ధికి వెన్నుముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని, ఎల్ఐసి ప్రభుత్వ రంగ స్వభావాన్ని కాపాడుకునేందుకు కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు, పాలసీదారులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏజెంట్ల యూనియన్ నాయకులు బి.రామలింగం, నలపరాజు సైదులు, దారం వెంకన్న, ఇటికాల ఉపేందర్, దేశగాని కృష్ణ, విజయ్ కుమార్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆయా బ్రాంచ్‌ల ఐసిఈయు నాయకులుపాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల మేలు



- వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వి. రమ్య, డాక్టర్ గోన్యా నాయక్

**పాలకుర్తి, ఆగస్టు 05 (జనంసాక్షి) :** ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం శ్రేయస్కరమని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వి. రమ్య, డాక్టర్ గోన్యా నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని విస్నూరులో గ్రామం లో బాలగాని రాములు సాగు చేసిన పెసర పంట, లాకావాత్ హేమా సాగు చేసిన పత్తి పం టలను శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాదాయక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. చిరు ధాన్యాలు పెసర, నువ్వులు, కందులు, మినుములు సాగు చేయాలని సూచించారు. రైతులు మితిమీరిన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సంవత్సరాల తరబడి మూస పద్ధతిలో పంటను సాగు చేయకుండా కాలానికి అనుగునంగా ఇతర రకాల పంటనుఉ పండించి రైతులు అధిర లాబాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో విద్యాకర్రెడ్డి, ఏఈవో వెంకటేష్, చీమలబాయి తండా సర్పంచు జుమ్మిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి



- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

**హనుమకొండ, ఆగస్ట్5 (జనంసాక్షి) :** రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. సైబర్ నేరస్థులు ప్రధానంగా భయం, ఆశ, అత్యవసరత అనే మూడు భావోద్వేగాలను ఉపయోగించి మోసాలకు పాల్పడతారని, అలాంటి సందేశాలు వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా ధృవీకరించి నిర్ణయం తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. జాతీయస్థాయి సైబర్ జాగ్రూకత దివస్ కార్యక్రమం, సురక్షా కా తిరంగా -మంత్ ఎండ్ ఛాంపియన్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో, వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా బుధవారం బోస్ హాల్‌లో సైబర్ జాగ్రూకత దివస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, నిట్‌లో జరుగుతున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సైబర్ భద్రత పరిశోధనలను ఆమె అభినందించారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ సైబర్ భద్రతపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని, సైబర్ నేరాల నివారణకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో నిట్

త్వరలో సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ నిర్వహించన్నట్లు చెప్పారు. కృత్రిమ మేధస్సు ఆధారిత సైబర్ భద్రత, డీప్ ఫేక్ గుర్తింపు వంటి రంగాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో కలిసి పనిచేస్తామన్నారు. రిజిస్ట్రార్ సునీల్ మెహతా, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దారా కవిత, నిట్ పూర్వ విద్యార్థిని, సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 1930 జాతీయ సైబర్ హెల్ప్ లైన్, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ వంటి సేవల గురించి వివరించారు.

# విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు 'స్ఫూర్తి'




- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 5 (జనం సాక్షి):** జిల్లాలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణను మరింత పటిష్ఠం చేసి విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 74 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లకు జిల్లా, మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన విద్యాసంస్థలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులకు అందుతున్న భోజనం, తాగునీరు, పారిశు ధ్యం, వసతి, భద్రత, విద్యా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ,కేజీబీవీ ,మోడల్ స్కూల్ లలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్స్ నిర్వహణ మరియు కంప్లైంట్ ను పరిశీలించడం ద్వారా పిల్లల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన ప్రజాపాలన దిశగా ప్రభుత్వం చర్యలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 5 (జనంసాక్షి) :** రాష్ట్రంలో సమర్థవంతమైన ప్రజాపాలన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార , గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొమురంభీమ్ విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ వనజా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజల కోసం, ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీమ్ చేసిన వీరోచిత పోరాటం చిరస్మరణీయమని, భావితరాలకు చరిత్ర అందించేలా కొమురం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు కొరకు 20 లక్షల రూపాయల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందని, జైపూర్ మండలంలో కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు కొరకు స్థల కేటాయింపుపై పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల రూపాయల వరకు వైద్య సేవలు, అర్హులకు రేషన్ కార్డులు అందించే చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ వంటి అనేక పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తింప చేయడం జరుగుతుందని, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమ పరిధిలో గల పెంకుటిళ్లను పరిశీలించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని తెలిపారు. చెన్నూర్ మండలంలో దాదాపు 1 వేయి ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని, నిబంధనల ప్రకారం నిర్మించిన ఇండ్లకు బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో సి.సి. రోడ్లు, మురుగు కాలువ వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆదివాసీ పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని, విద్యకు ఉన్న శక్తి అనిర్వచనీయమైనదని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్య కోర్సులను అందించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని, జర్మన్ భాష నేర్పించి విదేశాలలో గల ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...... జైపూర్ మండల కేంద్రంలో కొమురం భీమ్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఆదివాసి గిరిజనులు అడవి పై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ క్రమంలో వారికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో అటవీ శాతాన్ని పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధం

- ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ నితికా పంత్
- సైబర్ జాగృత దివాస్, సురక్షకా తిరంగా కార్యక్రమంలో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన
- సులభంగా డబ్బులు సంపాదిస్తామనే ఆశే మోసాలకు కారణం
- అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచనలు




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ జాగ్రత్త దివాస్, సురక్షకా తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని హెచ్‌ఆర్‌డీ భవనంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా నేరాలు, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ స్టాకింగ్ వంటి అంశాలపై వీడియో ప్రదర్శన ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కరోజులోనే సైబర్ నేరాల వల్ల సుమారు రూ.5 కోట్ల మేర ప్రజలు నష్టపోతుండగా, దేశవ్యాప్తంగా రోజుకు సుమారు రూ.70 కోట్ల వరకు సైబర్ మోసాల కారణంగా నష్టం జరుగుతోందని తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశను ఆసరాగా చేసుకుని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదని సూచించారు. బ్యాంకింగ్, సోషల్ మీడియా తదితర డిజిటల్ సేవలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను బలమైనవి, క్లిష్టమైనవిగా రూపొందించుకోవాలని తెలిపారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ఆర్థిక నష్టానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీసు స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా గతంలో సైబర్ నేరాలకు గురైన పలువురు బాధితులు తమ అనుభవాలను పంచుకున్నారు. మొబైల్ ఫోన్‌ను ఉపయోగించే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు పంపే లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. కార్యక్రమం ముగింపులో సైబర్ నేరాల అవగాహన గురించిన పోస్టర్లను విడుదల చేసి, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రవీందర్, సైబర్ క్రైమ్ ఎస్ఐలు దివ్య, కిరణ్, ఇతర ఎస్.ఐ లు రాజు, లక్ష్మణ్, నరేష్ తదితర పోలీసు అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిని కూల్చి రోడ్డున పడేశారు

- రామగుండం కార్పోరేషన్ ముందు కుటుంబం ఆందోళన



**రామగుండం, ఆగస్ట్5 (జనంసాక్షి) :** 20 ఏండ్ల నాటి ఇంటిని ఎందుకు కూల్చారని రెండు రోజులుగా అన్నపానీయాలు లేకుండా న్యాయం కోసం బల్దియా మెట్లు ఎక్కితే ఒక్కరూ పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక మాకు దిక్కెవరని, మాకు న్యాయం జరగదా..? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి నుంచి వచ్చేసరికి ఇంటిని కూల్చివేశారని బాధిత కుటుంబం బుధవారం గోడు వెల్లబోసుకుంది. ఈ మేరకు రెండో రోజు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం ఎదుట సుమారు నాలుగు గంటల పాటు నిరసన తెలిపారు. గర పాలక సంస్థ 21వ డివిజన్ పరిధిలోని ఎల్కలపల్లి గేట్‌లో మీనుగు లిఖిత అనే మహిళ నివాసం ఉంటుంది. తన ఇంటిని నెల రోజుల క్రితం మున్సిపల్ అధికారులు వచ్చి కూల్చివేశారని ఆరోపిస్తూ తన అత్తమామలు, ఆడబిడ్డ, చంటి పిల్లలతో కలిసి మున్సిపల్ ఆఫీసు ఎదుట మంగళవారం రోజంతా బైఠాయించిన సంగతి విషయం తెలిసిందే. రెండో రోజు బుధవారం కూడా కుటుంబ సభ్యులతో కార్యాలయానికి చేరుకొని టౌన్ ప్లానింగ్ విభాగం చాంబర్ ఎదుట న్యాయం కోసం అధికారులను ప్రాధేయపడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తాము ఇంట్లో లేని సమయంలో మున్సిపల్ సిబ్బంది వచ్చి ఇంటిని కూల్చివేశారని, ఆ సమయంలో ఇంటిలో విలువైన బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు ఉన్నాయని వాపోయారు. 20 ఏండ్ల నుంచి ఉంటున్న ఇంటిని కూల్చివేయడానికి గల కారణాలు అడిగితే.. పై అధికారుల నుంచి ఆర్డర్ అని అంటున్నారని పేర్కొన్నారు. తమకు ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని వాపోయారు. కూల్చిన ఇంటికి నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

## బెదిరింపులు, రౌడీయిజం, మోసాలు, దాడులకు పాల్పడుతున్న

# నిందితుడిపై పీడీ యాక్ట్

- జవాడే గోపాల్ జాదవ్ గోపాల్‌ను చర్లపల్లి జైలుకు తరలింపు



**ఉట్నూర్ ఆగస్టు 05 (జనం సాక్షి) :** ప్రజలను బెదిరించడం, రౌడీయిజానికి పాల్పడడం, మోసాలు చేయడం, దాడులు నిర్వహించడం వంటి పలు నేరాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్న జవాడే గోపాల్ జాదవ్ గోపాల్ (37), తండ్రి శేషారావు, పిట్టలవాడ, ఆదిలాబాద్‌కు చెందిన నిందితుడిపై పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) నమోదు చేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు ఉట్నూర్ సీఐ మడవి ప్రసాద్ తెలిపారు. నిందితుడిపై ఇప్పటివరకు బెదిరింపులు, రౌడీయిజం, మోసాలు, దోపిడీలు, దాడులు తదితర నేరాలకు సంబంధించి మొత్తం 16 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. పలుమార్లు కేసులు నమోదైనా తన నేరపూరిత కార్యకలాపాలను కొనసాగిస్తూ ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న నేపథ్యంలో, ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రతను పరిరక్షించేందుకు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఎఎస్ నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు వెల్లడించారు. పీడీ యాక్ట్ అమలు అనంతరం నిందితుడిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే, పునరావృతంగా నేరాలకు పాల్పడే వ్యక్తులపై ఇలాంటి కఠిన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సీఐ మడవి ప్రసాద్ మాట్లాడుతూ, నేరాలకు పాల్పడే వ్యక్తుల విషయంలో ఎలాంటి ఉపేక్ష ఉండదని, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా బెదిరింపులు, మోసాలు, దాడులు, రౌడీయిజం వంటి ఘటనలకు సంబంధించిన సమాచారం లేదా అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.



## పరిమితికి మించి ప్రయాణం

**గుడిహత్నూర్, ఆగస్టు 5 (జనంసాక్షి) :** గుడిహత్నూర్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు మన్నూరు-శాంతాపూర్ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా దాసరి మధుకర్ అనే వ్యక్తి తన ఆటోలో అనుమతించిన సామర్థ్యాన్ని మించి 22 మంది ప్రయాణికులను ఎక్కించుకుని నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు ఆటోను స్వాధీనం (సీజ్) చేసుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.ఎల్.శ్రీకాంత్ తెలిపారు.

## ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో, అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వెంకటరత్నం బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యసేవలు, సిబ్బంది సమయపాలన, పారిశుధ్య కార్యక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను పకడ్బందీగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది కచ్చితమైన సమయపాలన పాటించేలా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్య సేవలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

## మాగ్నస్ అసోసియేట్స్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం



**హనుమకొండ, ప్రతినిధి ఆగస్టు 5 (జనం సాక్షి) :**మాగ్నస్ అసోసియేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మన ఇల్లు డెవలపర్స్ మరియు ఏకర్స్ ఎన్ యార్డ్స్ కంపెనీల హంటర్ రోడ్ లోని నీలిమ జంక్షన్ లో నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసనమండలి ఉపసభాపతి డా. బండా ప్రకాశ్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మయ్య లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కంపెనీ వ్యవస్థాపకుడు అండ్ సి.ఇ.ఓ రాచర్ల రాజేష్ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్. సుధాకర్ రెడ్డి, రాజగోపాల్ , పాపయ్య,నరహరి మేనేజర్ ఎన్. శివకుమార్, అసిస్టెంట్ మేనేజర్ జి. రవికుమార్ టి. వీణ, కాసు శ్రీకాంత్, శర్మ, అనుష, అఖిల తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
06 ఆగస్ట్ 2026

సంపాదకీయం

# ఆధునికత సంతరించుకోని దేశం

## గుడ్డి నమ్మకాలతో ప్రాణాలు పోతున్న వైనం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాలో జరిగిన విషాద ఘటన మన సమాజం ఇంకా ఎంత మేరకు మూఢనమ్మకాల బంధనంలో ఉందో మరోసారి గుర్తు చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఒక మహిళను ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన కుటుంబ సభ్యులు, దుష్టశక్తులు ఆవహించాయనే నమ్మకంతో ఓ బాబా వద్దకు తీసుకెళ్లారు. పది రోజుల పాటు ఆమెను స్తంభానికి కట్టేసి, తగిన ఆహారం, వైద్య చికిత్స అందించకుండా పూజల పేరుతో ఉంచడం చివరికి ఆమె ప్రాణాలను బలిగొంది. ఇది ఒక కుటుంబం చేసిన పొరపాటు మాత్రమే కాదు; శాస్త్రీయ దృక్పథం లోపించడం, ప్రశ్నించే తత్వం బలహీనపడటం వంటి సామాజిక సమస్యలకు అద్దం పట్టే ఘటన.

ఒక దేశం ఎంత అభివృద్ధి చెందిందో కేవలం ఎత్తైన భవనాలు, విశాల రహదారులు, ఆర్థిక వృద్ధి గణాంకాలతో మాత్రమే కొలవలేం. ప్రజల ఆలోచనా విధానం ఎంత హేతుబద్ధంగా ఉందన్నదే నిజమైన ఆధునికతకు కొలమానం. సాంకేతికంగా ప్రపంచంతో పోటీ పడుతున్న మన దేశంలోనే అనారోగ్యానికి వైద్యులను కాకుండా మంత్రాలు, బాబాలను ఆశ్రయించడం, ప్రాణాలను పణంగా పెట్టడం తీవ్రమైన ఆందోళన కలిగించే విషయం.

ఈ పరిస్థితికి కేవలం నిరక్షరాస్యతనే కారణంగా చెప్పలేం. ఉన్నత విద్య చదివిన వారిలో కూడా మూఢనమ్మకాల ప్రభావం కనిపిస్తూనే ఉంది. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం డిగ్రీలు సంపాదించడం కాదు; ప్రశ్నించడం, పరిశీలించడం, ఆధారాలతో ఆలోచించడం నేర్పించాలి. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో మన విద్యా వ్యవస్థ ఇంకా ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల కొరత, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఒత్తిళ్లు కూడా ప్రజలను అశాస్త్రీయ మార్గాల వైపు నెట్టేస్తున్నాయి.

ఇలాంటి ఘటనలు కొత్తవి కావు. మహారాష్ట్రలో హేతువాది డా. నరేంద్ర దభోల్కర్ హత్య, జార్ఖండ్, అస్సాం, ఒడిశా రాష్ట్రాల్లో మంత్రగత్తెల పేరుతో మహిళలపై జరిగిన దాడులు, కేరళలో వెలుగుచూసిన మానవబలి కేసు, స్వయంఘోషిత బాబాల చుట్టూ నమోదైన నేరాలు, విషసర్ప కాటుకు మంత్రాలతో చికిత్స చేయించి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అన్నీ ఒకే విషయాన్ని చెబుతున్నాయి. శాస్త్రీయ ఆలోచన లోపిస్తే మూఢనమ్మకాలు ప్రాణాంతకంగా మారతాయి.

ఈ పరిస్థితిని మార్చేందుకు చట్టాలు మాత్రమే సరిపోవు. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ ఆలోచన, ప్రశ్నించే సంస్కృతిని పెంపొందించే విద్య అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలి. మీడియా, సాహిత్యం, సినిమా వంటి మాధ్యమాలు కూడా సమాజంలో హేతువాదాన్ని ప్రోత్సహించే బాధ్యతను నిర్వర్తించాలి. మత విశ్వాసం వ్యక్తిగత హక్కే అయినప్పటికీ, అది ప్రాణాలను బలిగొనే స్థాయికి చేరకుండా సమాజం అప్రమత్తంగా ఉండాలి.

బారాబంకిలో ప్రాణాలు కోల్పోయిన ఆ మహిళ మరణాన్ని ఒక వార్తగా మాత్రమే చూడకూడదు. అది మన ఆలోచనా విధానాన్ని పునఃపరిశీలించాల్సిన హెచ్చరిక. దేశం ఆధునికతను సంతరించుకున్నా, గుడ్డి నమ్మకాల కారణంగా అమాయకుల ప్రాణాలు బలవుతూనే ఉంటే ఆ అభివృద్ధి అసంపూర్ణమే. శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధత, ప్రశ్నించే సంస్కృతి ప్రతి ఇంటికి చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సార్థకమవుతుంది.

# తెలంగాణ సిద్ధాంతకర్త.. చిరస్మరణీయులు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా, ఆ ఉద్యమాన్ని నిర్మించిన ఆలోచనలను తరచుగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యమాలు నాయకులతో ముందుకు సాగుతాయి. కానీ వాటికి దిశానిర్దేశం చేసేవారు మేధావులు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో అలాంటి అసామాన్య మేధావిగా నిలిచిన వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్. ఆయన రాజకీయ నాయకుడు కాదు. ఎన్నికల్లో పోటీ చేయలేదు. అధికార పదవుల కోసం ప్రయాణించలేదు. అయినప్పటికీ తెలంగాణ ఉద్యమ చరిత్రను ఆయన పేరును ప్రస్తావించకుండా రాయడం అసాధ్యం. ఆచార్య జయశంకర్ ప్రత్యేకత ఏమిటంటే, తెలంగాణ భావజాలాన్ని కేవలం భావోద్వేగాల స్థాయిలో కాకుండా చారిత్రక, ఆర్థిక, సామాజిక, పరిపాలనా ఆధారాలతో దేశం ముందుంచారు. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం ప్రాంతీయ అసంతృప్తి కాదని, అవి వనరుల పంపిణీ, ఉద్యోగ అవకాశాలు, సాగునీరు, బడ్జెట్ కేటాయింపులు, విద్య, పరిపాలన వంటి అంశాలకు సంబంధించిన నిర్మాణాత్మక ప్రశ్నలని ఆయన విశ్లేషించారు. గణాంకాలు, అధ్యయనాలు, చరిత్ర ఆధారంగా ఆయన చేసిన వాదనలు తెలంగాణ ఉద్యమానికి మేధోపరమైన బలాన్ని ఇచ్చాయి.

ఆచార్య జయశంకర్ 1952 నుంచి ముల్కీ ఉద్యమంలో విద్యార్థిగా పాల్గొన్నప్పటి నుంచి ఆంధ్ర,తెలంగాణ కల్సి ఒక రాష్ట్రంగా ఏర్పడలనే ప్రతిపాదనను వ్యతిరేకించే ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. పెద్దమనుషుల ఒప్పందం, ముల్కీ నిబంధనలు, ప్రాంతీయ హామీలు ఎందుకు అమలు కాలేదనే ప్రశ్నలను ఆయన నిరంతరం లేవనెత్తారు. 1956లో భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచే తెలంగాణలో వ్యక్తమైన ఆందోళనలను ఆయన సీరియస్‌గా అధ్యయనం చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు వీధుల్లో పోరాడుతుంటే, ఆ పోరాటానికి శాస్త్రీయమైన వివరణను అందించిన మేధావిగా ఆయన ఎదిగారు. ఉద్యమం ఒక దశలో బలహీనపడినా, ఆయన తన విశ్వాసాన్ని కోల్పోలేదు. కాలం మారినా, రాజకీయ పరిస్థితులు మారినా, తెలంగాణ రాష్ట్రం అవసరమనే తన అభిప్రాయాన్ని ఎప్పుడూ మార్చుకోలేదు.తెలంగాణ ఉద్యమాన్ని ఆయన ఎప్పుడూ ద్వేష రాజకీయాల వైపు మళ్లించలేదు. ఒక ప్రాంతం అభివృద్ధి మరొక ప్రాంతానికి వ్యతిరేకం కాదని, సమాఖ్య స్ఫూర్తిలో ప్రతి ప్రాంతానికి న్యాయం జరగాలని ఆయన నమ్మారు. అందుకే ఆయన ప్రసంగాల్లో ఆవేశం కంటే ఆలోచన ఎక్కువగా కనిపించేది. నినాదాల కంటే వాస్తవాలు, ఆరోపణల కంటే ఆధారాలు, భావోద్వేగాల కంటే ప్రజాస్వామ్య విలువలే ఆయన బలం.

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వరంగల్ జిల్లాలోని 1934 ఆగస్టు 6న జన్మించారు. విద్యార్థి దశ నుండే తెలంగాణ రాష్ట్ర ఎజెండాను చేపట్టి ఆయన అధ్యాపకుడిగా,పరిశోధకుడిగా పరిపాలన వేత్తగా తెలంగాణ వాదాన్ని కొనసాగించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆయన విద్యా రంగంలోనూ విశిష్ట సేవలందించారు. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రాలు కాకుండా, సమాజ సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించే మేధో వేదికలుగా ఉండాలని ఆయన విశ్వసించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో ఆలోచించాలనే విలువలను పెంపొందించారు. అందుకే ఆయన ప్రభావం రాజకీయాలకే పరిమితం కాలేదు; విద్య, పరిశోధన, ప్రజా చర్చలపై కూడా కనిపించింది. 2001 తర్వాత తెలంగాణ ఉద్యమం కొత్త దశలోకి ప్రవేశించినప్పుడు కూడా ఆచార్య జయశంకర్ ఒక మార్గదర్శిగా కొనసాగారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంస్థలు ఉద్యమంలో భాగమైనప్పటికీ, ఉద్యమ లక్ష్యం ఏమిటి? దాని నైతిక బలం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పిన వ్యక్తి ఆయనే. తెలంగాణ సాధన అనేది ఒక రాజకీయ పార్టీ విజయంగా కాకుండా, ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షగా ఆయన వివరించారు.

ఈ తరం యువతకు కూడా జయశంకర్ జీవితం ఒక పాఠం. సామాజిక మార్పు కోసం కేవలం ఆవేశం సరిపోదు, అధ్యయనం, వాస్తవాలపై పట్టు, ప్రజాస్వామ్య పద్ధతులపై నమ్మకం అవసరమని ఆయన నిరూపించారు. ఉద్యమానికి మేధస్సు జతకలిసినప్పుడే అది చరిత్రను సృష్టిస్తుందని ఆయన జీవితం చెబుతోంది.ఆచార్య కొత్తపల్లి జయశంకర్‌ను స్మరించుకోవడం అంటే కేవలం ఆయన చిత్రపటానికి పూలమాల వేయడం కాదు. ఆయన ప్రతిపాదించిన సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ పరిపాలన, ప్రజా సంక్షేమం, ప్రాంతీయ సమతుల అభివృద్ధి వంటి విలువలను ఆచరణలో పెట్టడం. తెలంగాణ సాధనకు ఆయన అందించిన సిద్ధాంత బలం, నైతిక దృఢత్వం, మేధో నాయకత్వం భవిష్యత్ తరాలకు కూడా మార్గదర్శకంగా నిలవాలి.తెలంగాణ ఉద్యమ చరిత్రలో అనేక మంది నాయకులు ఉన్నారు. కానీ ఉద్యమానికి ఆత్మగా నిలిచిన వ్యక్తుల జాబితా చాలా చిన్నది. ఆ జాబితాలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పేరు ఎప్పటికీ అగ్రస్థానంలో ఉంటుంది. ఉద్యమాలు గెలవడానికి నాయకత్వం అవసరం. ఆ నాయకత్వం నిలవడానికి సిద్ధాంతం అవసరం. ఆ సిద్ధాంతానికి శాశ్వత చిరునామా -- ఆచార్య కొత్తపల్లి జయశంకర్.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆచార్య జయశంకర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనలు ఉద్యమ విజయానికి పునాది అని అనేక మంది గుర్తించారు. అయితే రాష్ట్ర ఏర్పాటు అంతిమ లక్ష్యం కాదని, తెలంగాణ ప్రజలు కలలు కన్న సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రైతు సంక్షేమం, విద్యా పురోగతి, పారదర్శక పరిపాలన వంటి లక్ష్యాలు సాధించినప్పుడే ఉద్యమం పూర్తి అర్థాన్ని సంతరించుకుంటుందని ఆయన పదేపదే చెప్పేవారు.నేడు తెలంగాణ రాజకీయాల్లో విభిన్న అభిప్రాయాలు, పార్టీల మధ్య తీవ్రమైన పోటీ కనిపిస్తున్నా, ఆచార్య జయశంకర్ చూపిన విలువలు ఇప్పటికీ ప్రాసంగికంగానే ఉన్నాయి. అధికారంలో ఎవరు ఉన్నా, ప్రతిపక్షంలో ఎవరు ఉన్నా, తెలంగాణ ప్రయోజనాలే కేంద్రబిందువుగా ఉండాలనే ఆయన ఆలోచన నేటికీ మార్గదర్శకమే. ఉద్యమాన్ని వ్యక్తి పూజకు పరిమితం చేయకుండా, ప్రజా ప్రయోజనాల దిశగా నడిపించాలనే సందేశం ఆయన జీవితమంతా ప్రతిధ్వనించింది.

(ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ జయంతి సందర్భంగా)



ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం,
వరంగల్,
సెల్-9866255355

## చేనేత చిత్రమాలిక

దారి పొడుగునా ఆరుబయలు
కారాగారాలు
అవిశ్రాంత శ్రమ, దృశ్యమాలికలు
రంగు రంగు అల్లికల పరిమళాలు

అక్కడ ఊరు
మగ్గపు చప్పుళ్ళతో ఉదయిస్తుంది
నూలు పోగులను
వేళ్ళతో నాట్యం చేయించి
కిన్నెరసానికి వన్నెల పైట లేస్తారు

ప్రకృతి కాంతలకు
పట్టు పావడాలిస్తారు
మువ్వన్నెల జెండాతో
జాతిని మురిపిస్తారు
ఇంద్రధనస్సుకు ఇంకొన్ని రంగులద్ది
కొత్తదనాన్ని ఆవిష్కరిస్తారు

వాళ్ళు కదురు కళా రూపాలు
నైలు నది నాగరికతలో
నార చీరలు.. నేసినా,
పట్టుచీరకు..ఖండాంతర ఖ్యాతిని
తెచ్చిపెట్టినా.!
నేడు గిన్నిస్ బుక్ రికార్డు
అద్భుతాన్ని ఆవిష్కరించినా!!
వాళ్లే..సిరిసిల్ల
సంప్రదాయవృత్తి సృష్టి కర్తలు

నైపుణ్యపు నగిషీలు చెక్కి
అగ్గిపెట్టెలో అబ్బురపరుస్తారు
సరికొత్త చీరకు
చిత్రకారులు అవుతారు
కొమ్మలకు రెమ్మలిచ్చి
లతలు అల్లుకుంటారు .
కుచ్చిళ్లకు హంసలతో
నడకలు నేర్పుతారు

ఇప్పుడు మగ్గపు చప్పుళ్ళు
ఆగిపోకుండా,
జరీ రంగులు వెలసిపోకుండా
పట్టు నేసిన చేతులు
కూలీ పనులకు పట్టుచిక్కకుండా
రెక్కలు తప్ప ఆస్తులు లేని
జీవనాల ఎజెండా మారాలి

చేనేత చిత్ర పటంలో
ఇప్పుడు కొత్త జెండా కావాలి
అక్కడక్కడ విరుగుతున్న
మగ్గం సాక్షిగా
చేనేతకు.. చేయూత నిద్దాం
రాట్నాలను రక్షించు కుందాం
చిరుగుల బతుకులకు
భరోసా ఇద్దాం..
అదే అసలైన అరుణోదయం.

(మూడున్నర గంటల్లో చీర తయారు చేసి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకున్న వెల్ది హరిప్రసాద్ గారికి అభినందనలు)

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

# గద్దర్ మరణించలేదు...ఈ రోజే పుట్టాడు!

(గద్దర్ వర్ధంతి ఆగస్టు 6 సందర్భంగా)



భారతదేశ సాంస్కృతిక ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప వ్యక్తి గద్దర్. ప్రజల బానిసత్వం, అణిచివేతకు వ్యతిరేకంగా విప్లవ గీతాలతో చైతన్యాన్ని నింపాడు. తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రాంతీయ అస్తిత్వానికి బాటలు వేశాడు. సినిమాలకు కూడా గొప్ప చైతన్య గీతాలు అందించాడు. తన జీవితమంతా ప్రజల కోసం, జానపద పాటల కోసం అంకితం చేసిన అరుదైన వ్యక్తి గద్దర్. ఆయన మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామంలో 1949లో జనవరి 31న పేద దళిత కుటుంబంలో జన్మించాడు. అసలు పేరు విఠల్ రావు అయినా...గద్దర్ గానే విస్తృత ప్రాచుర్యం పొందాడు. 1990 దశకం భారత బహుజన రాజకీయాల్లో ఒక చారిత్రక మలుపు. ఒకవైపు సాంప్రదాయ అగ్రకుల రాజకీయాలకు అభిముఖంగా కాన్షీరాం బహుజన రాజ్యాధికార ఉద్యమాన్ని నిర్మిస్తున్న కాలం. మరోవైపు గద్దర్ తన పాటతో, కళతో, ప్రజా చైతన్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బానిసత్వం, అణచివేతను ప్రశ్నిస్తున్నాడు. పీపుల్స్ వార్ గ్రూప్ కు అనుబంధంగా ఉన్న జననాట్య మండలి ద్వారా విప్లవ సాంస్కృతిక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. గద్దర్‌పై కాల్పులు జరిగినప్పుడు ఆయనను ఆసుపత్రిలో పరామర్శించిన తొలి జాతీయ నాయకుల్లో కాన్షీరాం ఒకరు. ఇద్దరి మధ్య పరస్పర గౌరవం ఉండేది.

**కాన్షీరాంకు గద్దర్ తోడైతే...**

ఒక సందర్భంలో అనుకోకుండా విమాన ప్రయాణంలో కాన్షీరాం గద్దర్‌ను కలిసాడు. "బహుజన రాజ్యాధికార పోరాటంలో నాతో కలిసి నడవండి" అని ఆహ్వానించాడు. అప్పుడు గద్దర్, "నీ బలం ఎంత?" అని ప్రశ్నించాడట. దానికి కాన్షీరాం, "నా బలం వెంట్రుకంత" అని సమాధానమిచ్చాడట. అప్పుడు గద్దర్, "వెంట్రుకంత బలంతో సమాజాన్ని ఎలా మార్చగలవు?" అని ప్రశ్నించగా, కాన్షీరాం చెప్పిన సమాధానం ఆయన రాజకీయ దూరదృష్టికి నిదర్శనం."ఈ దేశంలో అగ్రకుల పార్టీల మధ్య పోటీ సమబలంగా ఉంది. నా వెంట్రుక ఏ వైపు పడితే ఆ వైపే తూకం వంగుతుందన్నాడు. ఈ మాటల్లో సంఖ్యా బలంతో రాజ్యాధికారం సాధించే రాజకీయ సూత్రం దాగి ఉంది. ఆ తాత్వికతను పూర్తిగా అర్థం చేసుకోలేక గద్దర్ కాన్షీరాంకు దగ్గర కాలేకపోయాడు. చరిత్రను వెనక్కి తిరిగి చూసినప్పుడు ఒక ప్రశ్న వేధిస్తుంది. గద్దర్ వంటి ప్రజాదరణ కలిగిన ఉద్యమకారుడు కాన్షీరాం రాజకీయ ప్రయాణంలో భాగమై ఉంటే, ఉత్తరప్రదేశ్ తర్వాత బహుజన రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్ కూడా బలమైన కేంద్రంగా మారేదని రాజకీయ విశ్లేషకుల భావన. అంతేకాకుండా అగ్రవర్ణాల చేతుల్లో గద్దర్ సమానత్వ సిద్ధాంతం ఓడిపోయేది కాదు. ఒక వేళ గెలిస్తే అణిచివేయడిన పెద బడుగు బలహీన వర్గాల కన్నీళ్ళకు కష్టాలకు సమాధానం లభించేది. ఈ చారిత్రక తప్పిదాలే నేటికి బహుజనుల ఐక్యతను దెబ్బతీస్తున్నాయి.

**గద్దర్ పోరాటం మనకు గుణపాఠం**

గద్దర్ గోసి, గొంగడితో తెలంగాణ స్వరాష్ట్ర సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ చరిత్రను మలుపు తిప్పాడు. అతని చైతన్యాన్ని అగ్రకుల పార్టీలు వాడుకున్నవి, కానీ తన అస్తిత్వాన్ని నిలబెట్టడంలో విఫలమైనవి. గత ప్రభుత్వ హాయంలో ఇదే జరిగింది. ఓ పార్టీ గద్దర్ ను నక్సలైట్ గా, వేర్పాటు వాదిగా ముద్ర వేసింది. పద్మశ్రీ తిరస్కరించడానికి కారణం ఇదే అనడం బాధాకరం. మరి ఇప్పటికి కొందరు దళిత మేధావులు అంబేద్కర్ ను పుట్టించాల్సింది బదులు హిడ్మాలను పుట్టిస్తున్నారు. భాష, యాస, సంస్కృతి వంటి ఉపరితల అంశాలకే పరిమితమై దళిత ఉద్యమాలను దారితప్పిస్తున్నారు. గద్దర్ తన చివరి అంకంలో సంఘర్షణకు గురయ్యాడు. సత్యాన్ని తెలుసుకోనీ అంబేద్కర్ మార్గంలో ప్రయాణించాడు. "హాశీశ్రీఱఅఖిశ్రీ ౯ాశీషవతీ అం్‌ష్టవ మీుర్‌వతీ ఖవఎ" అనే నినాదంతో రాజకీయ పార్టీని పెట్టాడు. ఆ పార్టీతో రాజకీయ పోరాటం మొదలుపెట్టే దశలోగా 2023 ఆగస్టు 6న తుది శ్వాస విడిచాడు. ఆయన సంస్మరణ సభలో బీసీ ఎస్సీ ఎస్టీ విముక్తి ఉద్యమ సారథి డాక్టర్ విశారదన్ మహారాజ్ "గద్దర్ మరణించలేదు... ఈ రోజే పుట్టాడు" అనే మాటలు అక్షర సత్యం. ఎందుకంటే జీవిత చరమాంకంలో ఆయన అంబేద్కర్ మార్గాన్ని స్వీకరించి, బౌద్ధనౌకగా మారి కోట్లాది బహుజనుల ఆత్మకు దగ్గరయ్యాడు. గద్దర్నీ ప్రేరణగా తీసుకున్న ఎంతో మంది బహుజనులకు గద్దర్ జీవితం ఒక పాఠం కావాలి. అగ్రకుల నాయకత్వంలోని ఉద్యమాలు, సంస్థలు బహుజన విముక్తికి మార్గం చూపవు. స్వతంత్ర రాజకీయ శక్తిని నిర్మించి, స్వశక్తి--స్వధర్మంతో ముందుకు సాగినప్పుడే అట్టడుగు వర్గాలకు నిజమైన విముక్తి లభిస్తుంది.



సంపతి రమేష్
సామాజిక విశ్లేషకులు
7989579428

# 'భావోద్వేగభరితమైన పునరాగమనానికి ప్రతీక' తస్లీమా నస్రీన్



తాను నమ్మిన విశ్వాసాల కోసం, విలువల కోసం ఎన్నో వివాదాలు తలెత్తినను, ఎన్నో బెదిరింపులు వచ్చినను, దేశ బహిష్కరణలు, ఫత్వాలు మొదలైన వాటన్నింటిని ఎదుర్కొని ముందుకు సాగిన ధీశాలి తస్లీమా నస్రీన్. ఆమె వృత్తిరీత్యా పిజీషియన్ గానూ కొనసాగిననూ, ప్రవృత్తిరీత్యా రచయిత్రి గాను గొప్ప పేరు ప్రఖ్యాతులు పొంది తన రచనలతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. తస్లీమా నస్రీన్ బంగ్లాదేశ్లోని మిమెన్సింగ్లో 1962 లో జన్మించి మత ఛాందసవాదాన్ని ప్రతిఘటిస్తూ మహిళా హక్కులు, భావ స్వేచ్ఛ, సమానత్వం, సెక్యూలరిజం కోసం పిడికిలి బిగించి ఆ దిశగా ఉద్యమిస్తూనే ఉన్నారు.

తస్లీమా నస్రీన్ 1993 లో రాసిన 'లజ్జ' అనే నవల అంతర్జాతీయ గుర్తింపు పొందింది. కాని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆ నవలని నిషేధించింది. 'మత గ్రంథాలు సమకాలీన సమాజానికి అప్రస్తుతంగా ఉన్నాయి' అని పేర్కొన్న కారణంగా తస్లీమా నస్రీన్ దేశ బహిష్కరణకు గురయ్యారు. దేశంలోని మత పెద్దల నుండి అనేకంగా బెదిరింపులు ఆమె ఎదుర్కొన్నారు. ఫలితంగా ఆమె 1994 నుండి అనేక దేశాల్లో తలదాచుకున్నారు. ఆ క్రమంలోనే 2004 నుండి 2007 మధ్య తస్లీమా నస్రీన్ కోల్కతాలో నివసించారు. కోల్కతా తనకు గొప్ప మానవులను ఎందరినో అందించడమే కాకుండా ఆ నగరం నాకు 'రెండో ఇల్లు'గా నిలిచింది అని ఆమె సగర్వంగా పేర్కొన్నారు.


తస్లీమా నస్రీన్ ఆత్మకథ 'ద్విఖండితో' లోని కొన్ని భాగాలపై హింసాత్మక నిరసనలు చెలరేగడంతో ముస్లిం సమాజంలోని కొన్ని వర్గాల మనోభావాలను దెబ్బతీస్తోందనే ఆరోపణలతో 2003 లో అప్పటి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం నిషేధించింది. ముఖ్యంగా 'మత ఛాందసవాదులు ప్రేరేపించే అశాంతికి ఆమె ఉనికి కారణం కావచ్చు' అనే కారణంతో ప్రభుత్వం తస్లీమా నస్రీన్ ని కోల్కతా నగరం విడిచివెళ్ళండి అని విజ్ఞప్తి చేసిన క్రమంలోనే క్రమక్రమంగా ఆమె యూరోప్ వెళ్లిపోయారు. తస్లీమా నస్రీన్ మహిళల హక్కుల కోసం పనిచేస్తూనే అన్ని రకాల మత ఛాందసవాదాన్ని, అలాగే పితృస్వామ్య సంప్రదాయాలు, సంస్కృతులు మరియు ఆచారాలపై సునిశిత విమర్శలు చేశారు. 'ఏ దేశమూ మతంతో ముడిపడి ఉన్న మూఢనమ్మకాల పద్ధతులను, మతాల ధార్మిక పద్ధతులను విమర్శించకుండా నాగరికతను సాధించలేదు. రాజ్యాన్ని, మతాన్ని వేరు చేయకుండా ఏ రాజ్యం గాని, సమాజం గాని ఆధునికంగా మారలేదు. మతాన్ని ప్రభుత్వం నుండి వేరుగా ఉంచాలి. భావ ప్రకటనా స్వేచ్ఛ లేకుండా ప్రజాస్వామ్యం పనిచేయదు. అణచివేతకు గురైనవారు ఎవరైనా సరే, నేను ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడ్డాను. ముస్లింలు హింసకు గురైనప్పుడల్లా నేను వారిని సమర్థించాను, అలాగే బంగ్లాదేశ్లో అణచివేతకు గురైన హిందువులను లేదా పాకిస్తాన్లో అణచివేతకు గురైన క్రైస్తవులను కూడా సమర్థించాను. నాకు మత గుర్తింపు అప్రస్తుతం' అని పేర్కొన్న తస్లీమా నస్రీన్ వ్యాఖ్యలు సమతా భావనలకు అద్దం పడుతాయి.

తస్లీమా నస్రీన్ దాదాపు రెండు దశాబ్దాల తర్వాత గత శుక్రవారం నాడు తిరిగి కోల్కతాకు చేరుకోవడం విశిష్ట ప్రాముఖ్యతను సంతరించుకుంది. 'తనను లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం కోల్కతా నుండి బయటకు పంపించిననూ మళ్ళీ తిరిగి వస్తాననే ఆశను తాను ఎన్నడూ వదులుకోలేదు' అని ఆమె భావోద్వేగానికి గురికావడం గమనార్హం. ఈ క్రమంలో ఆమె రాకని 'భావోద్వేగభరితమైన పునరాగమనానికి ప్రతీక'గా పేర్కొనవచ్చు. 'నేను నా సొంత దేశానికి తిరిగి వస్తున్నట్లుగా భావిస్తున్నాను. బెంగాల్ నా హృదయంలో ఎన్నడూ ఒక సరిహద్దుతో గానీ, ముళ్లకంచెతో గానీ విభజించబడలేదు. నేను ఇక్కడ వదిలిపెట్టిన జీవితంలోని ఒక భాగానికి తిరిగి వచ్చినట్లుగా అనిపించింది. అన్యాయం దీర్ఘకాలం ఉండవచ్చు కాని శాశ్వతం కాదు. భావప్రకటనా స్వేచ్ఛ హక్కును వినియోగించుకున్నందుకు ఏ రచయిత కూడా తమ మాతృభూమిని విడిచి పెట్టకుండా ఉండే విధంగా భవిష్యత్తును ఆశిస్తున్నాను' అని తస్లీమా నస్రీన్ పేర్కొనడం తద్వారా 'భావాస్వేచ్ఛకు బలమైన గొంతుకగా నిలిచారు' అని చెప్పవచ్చు. ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు భావాస్వేచ్ఛ పరిరక్షణ కోసం ఆచరణాత్మకంగా ఉద్యమిస్తూ సాటి రచయితలకు అండగా నిలవాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# చరిత్రను మలిచిన రాజ్యాంగ నిర్ణయం



భారత రాజ్యాంగ చరిత్రలో కొన్ని నిర్ణయాలు వాటి ప్రభావంతోనే చిరస్థాయిగా నిలిచిపోతాయి. 2019 ఆగస్టు 5న అధికరణం 370ను అమలులో లేకుండా చేయడం అలాంటి నిర్ణయమే. ఏడు దశాబ్దాలుగా ప్రత్యేక రాజ్యాంగ హోదాతో కొనసాగిన జమ్మూ కశ్మీర్‌ను దేశ రాజ్యాంగ వ్యవస్థలో పూర్తిస్థాయిలో భాగం చేసిన ఘట్టమది. అనంతరం జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుతో జమ్మూ కశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. 2023 డిసెంబరులో సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని రాజ్యాంగబద్ధమని తేల్చడంతో చట్టపరమైన అనిశ్చితికి తెరపడింది. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే ఈ నిర్ణయం జమ్మూ కశ్మీర్‌ను ఏ మేరకు మార్చింది?

**ఒకే రాజ్యాంగం.. సమాన హక్కులు**

అధికరణం 370 రద్దుతో జమ్మూ కశ్మీర్ కూడా దేశంలోని మిగిలిన ప్రాంతాల మాదిరిగానే భారత రాజ్యాంగ పరిధిలో పూర్తిస్థాయిలోకి వచ్చింది. కేంద్ర చట్టాలు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిబంధనలు సమానంగా అమలులోకి వచ్చాయి. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు మరింత విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. పరిపాలనా వ్యవస్థలో ఏకరూపత పెరగడంతో నిర్ణయాల అమలు వేగవంతమైంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయి. ఒకే దేశం ఒకే రాజ్యాంగం అనే భావనకు ఆచరణాత్మక రూపం లభించింది.

**భద్రతతో పాటు అభివృద్ధి :** గత ఏడేళ్లలో భద్రతా పరిస్థితుల్లో గణనీయమైన మార్పు నమోదైంది. రాళ్లు రువ్వే ఘటనలు దాదాపు అంతరించగా, ఉగ్రవాద ఘటనల ధోరణి కూడా తగ్గుముఖం పట్టింది. భద్రతా బలగాల సమన్వయం, సరిహద్దు పర్యవేక్షణ, ఉగ్రవాద నిరోధక చర్యలు మరింత బలోపేతమయ్యాయి. శాంతియుత వాతావరణం ఏర్పడటంతో సాధారణ జీవనం తిరిగి గాడిలో పడింది. ఈ మార్పు ప్రభావం అభివృద్ధి రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. జాతీయ రహదారులు, సొరంగ మార్గాలు, రైల్వే అనుసంధానం, వైద్య, విద్యా రంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులు ప్రాంత రూపురేఖలను మారుస్తున్నాయి. దేశ ప్రధాన ఆర్థిక ప్రవాహంతో జమ్మూ--కశ్మీర్ అనుసంధానం మరింత బలపడుతోంది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలవుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణకు దోహదపడుతున్నాయి. ఈ మార్పుకు పర్యాటక రంగమే అత్యంత స్పష్టమైన నిదర్శనం. ఇటీవల సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో పర్యాటకులు జమ్మూకశ్మీర్‌ను సందర్శించారు. హోటళ్లు, హోమ్‌స్టేలు, రవాణా, చేతివృత్తులు, చిన్న వ్యాపారాలు కొత్త చైతన్యం పొందాయి. పర్యాటకం స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాదు, జమ్మూకశ్మీర్‌ను దేశప్రజలతో మరింత భావోద్వేగపూర్వ కంగా అనుసంధానిస్తోంది.

**కొత్త దశకు నాంది :** అధికరణం 370 రద్దు ఒక రాజ్యాంగ సవరణ మాత్రమే కాదు; జమ్మూకశ్మీర్ అభివృద్ధి ప్రస్థానానికి కొత్త దిశను చూపిన నిర్ణయం. మౌలిక వసతుల విస్తరణ, పరిపాలనా సంస్కరణలు, కేంద్ర సంక్షేమ పథకాల అమలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, యువతకు విస్తరిస్తున్న అవకాశాలు---ఇవన్నీ కలిసి కొత్త జమ్మూ--కశ్మీర్ నిర్మాణానికి పునాది వేస్తున్నాయి. ఈ మార్పు నిరంతరంగా కొనసాగితే జమ్మూ--కశ్మీర్ కేవలం సరిహద్దు ప్రాంతంగా కాదు, ఉత్తర భారత అభివృద్ధికి కీలక కేంద్రంగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉంది. అధికరణం 370 రద్దు భారత రాజ్యాంగ చరిత్రలో ఒక మైలురాయి. అయితే దాని అసలైన విలువ చట్టపుస్తకాలలో కాదు; శాంతి నెలకొన్న గ్రామాల్లో, అవకాశాలు పెరిగిన యువతలో, అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న ప్రజల జీవితాల్లో కనిపించాలి. అదే ఈ చారిత్రక నిర్ణయానికి శాశ్వత విజయగాథ అవుతుంది.

కింజరాపు అమరావతి
kinjarapuamaravathi588@gmail.com

## పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి



**చేవెళ్ల, ఆగస్టు 5 (జనంసాక్షి) :** పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరిగిద్ద వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్‌పర్సన్ సమతావెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఅగి రెడ్డి, తాళ్ళ పల్లి నర్సింహులు, మద్దెల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ సర్పంచ్‌లు వెంకటేశం గుప్తా, మధుసూదన్ గుప్తా, పడాల ప్రభాకర్, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి



**తాండూరు, అగస్టు 5 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే బుయ్యని హనోహర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శ్రీభావిగి భద్రేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జననేత, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదినం సందర్భంగా తాండూరు పట్టణంలోని భద్రప్ప దేవాలయంలో పట్టణ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు .తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి తాండూరు లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సహకరించాలి



**అల్వాల్, ఆగస్టు 5 (జనంసాక్షి) :** వెంకటాపురం డివిజన్‌లోని భూదేవినగర్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు ఉంటే గడువులోగా సవరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మల్లెల శివ మాట్లాడుతూ, అర్బన్ ప్రాంతాల్లో నివాస మార్పుల కారణంగా అర్హులైన ఓటర్లను గుర్తించడం బీఎల్‌వోలకు సవాల్‌గా మారిందన్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం సకాలంలో పూర్తయ్యేలా కాంగ్రెస్ నాయకులు బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా బీఎల్‌వోలతో సహకరించి అవసరమైన వివరాలు అందించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంద బాలకృష్ణారెడ్డి, కృష్ణ గౌడ్, భాస్కర్, వెంకట్రావు, జ్యోతి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



**కేశంపేట, ఆగస్టు 5 (జనం సాక్షి) :** తండాలలో మౌలిక సదుపాయాలను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఉప సర్పంచ్ ఉత్యావత్ రవి నాయక్ అన్నారు. మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామపంచాయతీ బాల్య తండాలో డీఎంఎఫ్టి నిధులతో మంజూరైన 5 హెచ్ పి బోర్ మోటర్ ను గ్రామ నాయకులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి రవి నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తండాలో నీటి ఎద్దడిని తీర్చాలని సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే శంకర్ బోర్ మోటార్కు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు తండావాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ భారీ, ఏఈ నరేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీస కరుణాకర్ రెడ్డి, వార్డు సభ్యులు లచ్చిరాం నాయక్, చెన్నయ్య, రమేష్ నాయక్, అంజి నాయక్ పాల్గొన్నారు.

# కుల్కచర్ల గురుకులంలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం
- పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- గురుకులం ముందు తల్లిదండ్రుల ఆందోళన
- దొంగతనం నెపంపై టిసి ఇచ్చేసారంట..



**వికారాబాద్ జిల్లా బ్యూరో / కుల్కచర్ల, ఆగస్టు 5 (జనం సాక్షి) :** గురుకులాల్లో దాగివున్న దారుణ పరిస్థితులు ఏదైనా సంఘటన జరుగుతే తప్ప వెలుగులోకి రావు . మిగతా సమయంలో అక్కడ జరుగుతున్న దారుణ పరిస్థితులు వెలుగు చూడవు అందుకు ఉదాహరణ గానే వికారాబాద్ జిల్లా కుల్కచర్ల గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనను చెప్పుకోవచ్చు. వివరాలు లోకి వెళితే కుల్కచర్ల టీజీ టి డబ్ల్యూ యు ఆర్ జె సి గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తారక్ తేజ్ అనే విద్యార్థి మంగళవారం రాత్రి గుర్తుతెలియని క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితమే తిరిగి గురుకులంలోకి వచ్చిన విద్యార్థి తారక్ తేజ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాష్ తారక్ తేజ అనే ఇద్దరు విద్యార్థులు 9వ తరగతి వరకు స్నేహితులు. గురుకులంలో చిల్లర దొంగతనానికి పాల్పడ్డారని నెపంపై పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి ఆకాష్ విద్యార్థికి టీసి ఇచ్చి పంపించి వేశారు. అప్పటినుంచి విద్యార్థి తారక్ తేజ్ తీవ్ర మనస్థాపానికి గురి అయ్యాడు. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న తారక్ తేజ్ పై ఆకాశ పై మోపిన దొంగతనం నెపం ఈ విద్యార్థి పై మోపారు. అంతేకాకుండా చిల్లర దొంగతనాలు చేయడం రాత్రిపూట పక్క తడపడం అరువు తీసుకొని తిరిగి చెల్లించకపోవడం వంటి పనులు చేస్తుండడంతో ప్రిన్సిపాల్ తో పాటు తోటి విద్యార్థులు అవహేళన చేయడం అసహ్యించుకోవడం వంటి పనులు చేశారు. దీంతో ఆందోళన చెందిన విద్యార్థి తారక్ తేజ్ క్యాంపస్ బయట క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయతనికి పాల్పడ్డాడు. గురుకులంలో తారక్ తేజ్ కనిపించకపోవడంతో గురుకులం సిబ్బందితోపాటు తోటి విద్యార్థులు వెతకగా క్యాంపస్ బయట స్పృహ తప్పి పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన ప్రిన్సిపాల్ లక్ష్మి కాంత్ రెడ్డి చికిత్స నిమిత్తం విద్యార్థి తారక్ తేజ్ నీ పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ప్రాణపస్థితి నుంచి విద్యార్థి బయటపడ్డారు. ఈ విషయం తెలియగానే విద్యార్థుల సంఘాలు బాధిత విద్యార్థి తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. తమ కొడుకుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే తన కొడుకు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆరోపించారు.

### కేర్ కమిటీ ఏమైనట్లు..

గురుకుల పాఠశాలలో విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేయడానికి పాఠశాలలో కేర్ కమిటీ ఉంటుంది. చిన్న చిన్న సంఘటనలు జరిగినప్పుడు ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో కేర్ కమిటీ ఆ విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వడము వారిని మానసిక రుగ్మతల నుంచి దూరం చేసి మంచి భవిష్యత్తు అందించడానికి ప్రయత్నిస్తుంది. కానీ గత ఏడాది నుంచి విద్యార్థులు చిల్లర దొంగతనాలు చేయడం తోటి విద్యార్థుల దగ్గర డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వకపోవడం అలాగే రాత్రిపూట పక్క తడపడం వంటివి చేస్తే కేర్ కమిటీ ఎందుకు చర్యలు తీసుకోకుండా ఉంది. పైగా ఒక విద్యార్థికి కౌన్సిలింగ్ ఇవ్వకుండానే పాఠశాల నుంచి టిసి ఇచ్చి పంపివేశారు దీంతో బడి మానిన పిల్లల్లో మరో విద్యార్థి చెరిపోయాడు. కుల్కచర్ల గురుకుల పాఠశాలలో సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇప్పటికైనా పాఠశాల సిబ్బంది విద్యార్థులపై శ్రద్ధ చూపి వారి భవిష్యత్తుకు మంచి బంగారు బాట వేయాలని ఆశిద్దాం...

## సమానత్వం సమ్మిళిత అభివృద్ధి దిశగా సైబరాబాద్

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**శేరిలింగంపల్లి, ఆగస్టు 5 (జనంసాక్షి) :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిధిలో సమానత్వం – సమ్మిళిత అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వివిధ జోన్ల కమిషనర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిపి బుధవారం సిఎంసి కమిషనర్ డాక్టర్ జి సృజన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్ష సమావేశానికి బక్కి వెంకటయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు అవకాశాల కల్పనపై సమీక్షా సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ఈ నేపథ్యంలో సమావేశంలో ప్రత్యేక సబ్‌ప్లాన్‌ల ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి, శ్మశాన వాటికలకు అవసరమైన సదుపాయాలు, అప్రోచ్ రోడ్ల ఏర్పాటు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల అభివృద్ధి, వీధి వ్యాపారులకు సహాయం, పారిశుధ్య కార్మికులకు పిపిఈ కిట్లు, బీమా సదుపాయం, శాశ్వత మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరోగ్య బీమా, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు, అలాగే ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. అదేవిధంగా అభివృద్ధి పనులు, టెండర్లలో రిజర్వేషన్ నిబంధనలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు, రోస్టర్ అమలు, ఆర్థిక కేటాయింపులు తదితర అంశాలను సమీక్షించారు. సంబంధిత నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు శాఖల మధ్య సమన్వయం, పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టిని సారించాలని సంబంధిత అధికారులకు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య సూచించారు. సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో చర్చించిన అంశాలు, సూచనలను సంబంధిత శాఖలు పరిశీలించి, పరస్పర సమన్వయంతో అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**బొంరాస్‌పేట, ఆగస్టు 5 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని విబిజీరాంజీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ అన్నారు.బుధవారం మండల పరిధిలోని పాలబాయి తండాకు రూ.30 లక్షలతో మంజూరైన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థానిక సర్పంచ్ సరోజినీ బాయితో కలిసి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తీక్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మల్లికార్జున్, నాయకులు మహేందర్ సింగ్, మోత్య నాయక్, మాధవ్ సింగ్, కిషన్ నాయక్ తదితరులు ఉన్నారు.

## భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టాలి

- జలమండలి ఎండీ కి కళ్లెం నవజీవన్‌రెడ్డి వినతి



**హయత్‌నగర్, ఆగస్టు 5 (జనం సాక్షి) :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ సౌకర్యం లేని కాలనీల్లో తక్షణమే డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నవజీవన్‌రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరడంతో పాటు దుర్వాసన, దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన నిధులు మంజూరు చేసి, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. వినతి పై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు.

## విద్యజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ జాగ్రుక్తా దివస్



**మొయినాబాద్, ఆగస్టు 5 (జనంసాక్షి) :** విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించి, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ జాగ్రుక్తా దివస్ - 2026 కార్యక్రమాన్ని విద్యా జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించే ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. అనంతరం టీజీసీఎస్బీ సైబర్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే చెవెళ్ల జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) యోగేష్ గౌతమ్, చెవెళ్ల డివిజన్ ఏసీపీ బి.కిషన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త తరహా మోసాల పట్ల విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, ఫోన్ కాల్స్, సందేశాలను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. డీసీపీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ.. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార రక్షణ, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, ద్వి-దశల భద్రత అవసరాన్ని వివరించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారిక వేదికల ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులందరూ సైబర్ భద్రతను ప్రోత్సహిస్తూ "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో ప్రశ్నోత్తరాల సమావేశం నిర్వహించి, వారి సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ పోలీస్ స్టేషన్ సీఐ వై మల్లికార్జున రెడ్డి, వీజేఐటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఆర్.వెంకటాచలం, వీజేఐటీ ఈసీఈ విభాగాధిపతి డా.పి. నాగేశ్వర్ రావు, అధ్యాపకులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# హింసాత్మక రాజకీయాలకు కుట్రలు చేయడం సరికాదు

- ప్రశాంత వాతావరణాన్ని భంగం చేసి ఉద్రిక్తతలు సృష్టించాల్సిన అవసరం మిటి
- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతుల నాగరాజు

**తాండూరు, అగస్టు 5 (జనంసాక్షి) :** పట్టణంలోని ఇందిరమ్మ రాజీవ్ కాలనీలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన అభిమానులు నిర్వహించిన వేడుకలో చోటుచేసుకున్న ఘటనలు విచారకరమని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతుల నాగరాజు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,తమ ఆరోపణల ప్రకారం బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్ జావీద్ అనుచరులు వేడుకల వద్దకు వచ్చి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారని పేర్కొన్నారు.శాంతియుతంగా జరుగుతున్న కార్యక్రమాలను రాజకీయ కుట్రలకు వేదికగా మార్చే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల దాడిలో గాయపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మెహీజ్ ను పమర్శించి వారికి అండగా ఉంటామని దైర్యంగా ఉండాలని భరోసా కల్పించిన మున్సిపల్ చైర్ పర్సన్ నీరజబాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, కౌన్సిలర్స్ పలువురు నాయకులు.బీఆర్‌ఎస్ నాయకులను ఉద్దేశించి టౌన్ అధ్యక్షులు పలు ప్రశ్నలు సంధించారు. కాలనీలో ప్రశాంతంగా జరుగుతున్న జన్మదిన వేడుకల వద్దకు వచ్చి గొడవకు కారణమైన వారు ఎవరు..? జన్మదిన వేడుకల సందర్భంగా సెల్ఫీ వీడియోలు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేశారనే తమ ఆరోపణల నేపథ్యంలో, వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ఉద్రిక్తతలకు కారణం కాలేదా. వేడుకల సందర్భంగా ఎమ్మెల్యేని, రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసిన వారు ఎవరు.ప్రశాంత వాతావరణాన్ని భంగం చేసి ఉద్రిక్తతలు సృష్టించాల్సిన అవసరం ఏమిటన్నారు.దౌర్జన్య రాజకీయాలకు ఉసిగొల్పడం వెనుక ఉద్దేశం ఏమిటి. ఎమ్మెల్యే వారంలో నాలుగు రోజులు తాండూర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అభివృద్ధి అంశాలపై ప్రశ్నించాలనుకుంటే అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదు? జన్మదిన వేడుకల సమయంలోనే ఆ అంశాలు ఎందుకు గుర్తుకు వచ్చాయన్నారు.కాలనీ ప్రజలు ఎమ్మెల్యే పై తమ అభిమానాన్ని చాటుకోవడం మీకు ఎందుకు అభ్యంతరంగా మారిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలపై దాడికి పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.ప్రజల మధ్య శాంతిభద్రతలకు భంగం కలిగించే రాజకీయాలు మానుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.రాజకీయాలు చేయడానికి ప్రతి సందర్భాన్ని వేదికగా మార్చడం సరికాదని, ముఖ్యంగా సామాజిక కార్యక్రమాలు, జన్మదిన వేడుకలను వివాదాస్పదం చేయడం ప్రజలు సమర్థించరని నాగరాజు అన్నారు.రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ హింస, రెచ్చగొట్టే చర్యలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ సమర్థించరని ఆయన పేర్కొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
06 ఆగస్టు 2026

# ఫార్మా కంపెనీలో గ్యాస్ లీకై ముగ్గురి దుర్మరణం

- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి
- కంపెనీ ముందు పార్టీలు,సంఘాల ధర్నా
- ఒక్కొక్కరికి 20 లక్షల పరిహారం జిఎం



**కృష్ణ, ఆగస్టు 5 (జనం సాక్షి) :** రాష్ట్ర సరిహద్దులోని కృష్ణ మండలానికి ఆనుకుని ఉన్న కర్ణాటక రాష్ట్రం కడేచూరు ఇండస్ట్రియల్ ఏరియాలో మంగళవారం అర్ధ రాత్రి ఫార్మా కంపెనీలో గ్యాస్ లీక్ కావడంతో ఘోర ప్రమాదం జరిగింది.లీక్ గ్యాస్ ను పీల్చుకోవడంతో అక్కడ పని చేస్తున్న ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉంది.రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటకలోని కడేచుర్ సీల్ ల్యాబేరేటరీస్ ప్రవైట్ లిమిటెడ్ కంపెనీ అర్ధరాత్రి రియాక్టర్ నుండి గ్యాస్ లీకు అయ్యి, వాసనా రావడంతో ఐదుగురు తీవ్ర అస్వస్థకు గురి అయ్యారు, అందులో ముగ్గురు స్పాట్ లోనే చనిపోయారు, మిగితా ఇద్దరినీ చికిత్స నిమిత్తం రైచూర్ రిమ్స్ అస్పత్రికి తరలించారు, మృతుల్లో తెలంగాణ రాష్ట్ర నారాయణ పేట జిల్లా కృష్ణ మండలం అలంపల్లి గ్రామానికి చెందిన కట్ల గణేష్ (అపరేటర్), తండ్రి దేవప్ప, వయసు21, బీహార్ కు చెందిన మరో ఇద్దరు, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ సంఘటన తెలుసుకోని బాధిత కుటుంబానికి మద్దతుగా గ్రామస్థులు, బిఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, మాజీ సర్పంచ్ రామకృష్ణ, దని, నర్సిములు, డీలర్ శివరా జ్,తిప్పన్న, జై కర్ణాటక రక్షణ సేన జిల్లా అధ్యక్షులు మల్లికార్జున జల్లప్ప,సైదాపూర్ ఓబిలి అధ్యక్షులు వీరేష్ సజ్జన్,కాడేచుర్ గ్రామ అధ్యక్షులు శరణప్ప, కర్ణాటక చాలాకర్ ఒకపుట రాజు మాడీవల్, మాజీ రక్షణ సేన అధ్యక్షులు చంద్రు పార్ల, ఉపాధ్యక్ష హుసేనప్ప,నారాయణ పేట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్య క్షులు వెంకట్ రాములు, సీనియర్ నాయకులు దేవరింటి నర్సింహా రెడ్డి, కృష్ణ మండలం అధ్యక్షులు నల్లే నరసప్ప, యువ నాయకులు సంజు గౌడ బాధితు లకు మద్దతుగా కంపెనీ వద్దకుంచేరుకుని ఆందోళన చేపట్టారు. కర్ణాటక డీఎస్ పి నాగరాజు బాధితులకు న్యాయం చేకూరస్తామని చెబుతున్నప్పటికి తగ్గకుండా ఆందోళన కొనసాగించారు, కంపెనీ ఎండీ వచ్చి చనిపోయిన బాధితులు గణేష్ కు కోటి రూపాయలు పరిహారం ఇచ్చే వరకు కదిలే పరిస్థితి లేదని భీస్మించి కూర్చున్నరు, కంపెనీ గేట్ నుండి లోపలికి దూసుకు పోవడానికి గట్టి ప్రయత్నం చేశారు, వీరిని పోలీస్ లు అడ్డుకొని కంపెనీ ప్రతిని ధులతో మాట్లాడిస్తామని వారిని శాంత పరిచారు.

**జనరల్ మ్యానేజర్‌తో ఎస్పీ పృద్విక్ శంకర్ చర్చలు**

వివిధ సంఘాల ఆందోళన నేపద్యంలో రాయచూరు జిల్లా ఎస్పీ ప్రత్విక్ శంకర్ కంపెనీ జి ఎం మూర్తితో చర్చలు జరిపారు.కడేచుర్ గ్రామ పెద్ద సిద్దన్ గౌడ, అలంపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ దని, అనంపల్లి గ్రామ పెద్దలు , జై కర్ణాటక సంఘము ప్రతినిధులు వీరేష్ సజ్జన్ , బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, బాధితులకి న్యాయం చెయ్యాలని కోరారు,ఒక్కొక్కరికి కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.దీంతో జిఎం మూర్తి కంపెనీ తరపున 20 లక్షల పరిహారం ఇస్తామని ఈ ఎస్ ఐ ఇన్సూరెన్స్ లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సహాయాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.

## బస్సు సౌకర్యం కోసం విద్యార్థుల నిరసన



**మల్దకల్, ఆగస్టు 5 (జనంసాక్షి) :** మండల నీలిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని మా గ్రామానికి కల్పించాలని గ్రామస్థులతో కలిసి గార్లపాడు స్టేజి దగ్గర బుధవారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మా గ్రామంలో దాదాపు ప్రతి రోజు 50 మంది విద్యార్థులు మల్దకల్ ఇతర ప్రాంతాలకు చదువు కోసం వెళ్తుంటారు.ప్రతి రోజు ఇలా వెళ్ళడానికి మాకు చాలాకష్టమవుతుంది.కాబట్టి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విద్యార్థుల కోసం చెర్లగార్లపాడు గ్రామం వరకు వచ్చే బస్సును మా గ్రామం వరకు నడపగలరని ఆర్టీసీ అధికారులని కోరారు.అలాగే పలుమార్లు ఈ విషయం గురించి ఆర్టీసీ అధికారులకు విన్నవించగా రేపు పంపిస్తాం ఎల్లుండి పంపిస్తాం అని నిర్లక్ష్యం చేస్తున్నారు.కావున ఈ సమస్య పైన గ్రామ సర్పంచ్ స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవచూపివిద్యార్థుల కోసం మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించగలరని గ్రామస్థులు కోరుచున్నారు.

## ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయాలి




**తెలకపల్లి, ఆగస్టు 5 (జనం సాక్షి) :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి కార్మికులను ఉద్దేశించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని గంటలను పెంచడం, ఉద్యోగ భద్రతను దెబ్బతీయడం, కార్మిక సంఘాల హక్కులను కుదించడం వంటి చర్యలు కార్మిక వ్యతిరేకమని విమర్శించారు. అలాగే ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని, ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగస్వామి, లక్ష్మయ్య, సుధాకర్, చంద్రకళ, అక్బర్, సుకన్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించాలి

- ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి
- ప్రత్యేక అధికారి వి.పి. గౌతమ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అగస్టు 5 (జనం సాక్షి) :** డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించి నిజమైన అర్హులైన పేద కుటుంబాలకే ప్రాధాన్యం ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ ఎం.డి., కార్యదర్శి,ఎల్ నినో పై ప్రభుత్వం జిల్లా కు నియమించిన ప్రత్యేక అధికారి వి.పి. గౌతం ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఖాళీగా ఉంచకుండా వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని, రెండు పథకాల లబ్ధిదారుల జాబితాలను కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో సరిపోల్చి ఒకే వ్యక్తికి రెండు పథకాల ప్రయోజనం అందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గృహనిర్మాణ, రెవెన్యూ,మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్, రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని, ఇప్పటికీ పంపిణీ చేయకుండా పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను, ఇప్పటికే గుర్తించిన డబుల్ బెడ్రూం అర్హుల జాబితాను 360 డిగ్రీ డాటా తో పరిశీలించి అనర్హులను తొలగించి అర్హులకు కేటాయించాలని గౌతమ్ సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర తక్కువ వేతనాలతో పనిచేసే ప్రభుత్వ సేవల సిబ్బందిని కేవలం ఉద్యోగం ఆధారంగా అనర్హులుగా ప్రకటించరాదని, వారి కుటుంబ పరిస్థితులు, ఆదాయం, ఆస్తులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి తిరస్కరణకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఆధార్ నంబర్ లేకున్నా పేర్ల ఆధారంగా కూడా వివరాలను పోల్చి ఒకే వ్యక్తి రెండు జాబితాల్లో ఉన్నారా అనే విషయాన్ని గుర్తించాలని, సాంకేతికంగా ధృవీకరణ పూర్తైన తర్వాత నిర్భయంగా ఇళ్ల కేటాయింపు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదనపు చెల్లింపులు జరిగి ఉంటే వాటిని రికవరీ చేసే చర్యలు చేపట్టాలని సూచించారు అంతకుముందు గౌతమ్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఏనుగొండలోని మౌలాలి గుట్టలో నిర్మించిన



డబుల్ బెడ్‌రూమ్ గృహాలను సందర్శించి లబ్ధిదారుల నివాసం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. అక్కడ ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గమనించిన ఆయన, వెంటనే లబ్ధిదారులను గుర్తించి వాటిని అర్హులైన వారికి అప్పగించాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని,డి.ఆర్.ఓ ఎ. నిర్మల, ఆర్.డి.ఓ నవీన్, గృహనిర్మాణ శాఖ పి.డి. ఉపేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఆదుకోవాలి

- కార్మికులకు కనీస పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలి
- టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు



**ఆత్మకూర్, ఆగస్టు 5 (జనం సాక్షి) :** 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలు ఇవ్వాలని టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో టియుసిఐ జిల్లా కార్యదర్శి సి. రాజు అధ్యక్షత నా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలలోని సహజ మరణం ప్రమాద మరణం ఇన్సూరెన్సులు ప్రైవేటు ఇన్సూరెన్స్ వాళ్లకు ఇచ్చిన దాన్ని రద్దు చేయాలని అన్నారు, కార్మికులకు సిఎస్సి ఆరోగ్య పరీక్షలు రద్దుచేసి వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు, కార్మికులు సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డెలివరీ మ్యారేజ్ గిఫ్ట్ లకు ఇచ్చే సంక్షేమ పథకాలను లక్ష రూపాయలు పెంచాలని అన్నారు, టి యు సి ఐ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే మోష, సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాజు, తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు చదువు లేక క్రమంగా సకాలంలో రెన్యువల్ చేసుకోలేని కార్మికులకు ప్రభుత్వమే రెన్యువల్ చేయాలని అన్నారు, పెండింగ్ క్లయిమ్స్ ఉన్న వెంటనే పరిష్కరించాలని అదేవిధంగా ఐ టి ఐ లకు మంజూరు చేసిన 667 కోట్లు నిధులను నిలిపి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పోరాటాలను పిలుపునిస్తామని చెప్పారు, ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు జి వెంకటయ్య, బి చింతలన్న, కురుమన్న, జిల్లా ఉపాధ్యక్షులు జి చెన్నయ్య, కురుమన్న, తిరుపతి, మన్యం, బి రాజు, వెంకటేష్, సీనియర్ తాపీ మేస్త్రీలు ఈదన్న, చిన్న బాలస్వామి, మాల వెంకటన్న , శేఖర్, రాజన్న, శ్రీశైలం, కురుమూర్తి, త్వరలో పాల్గొన్నారు, తదితరులు పాల్గొన్నారు,

## మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, ఆగస్టు 5 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నషా ముక్తి భారత్ అభియాన్, బ్రాహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. పాఠశాల, కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..యువత దేశ భవిష్యత్తు అని, వారిని మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, సామాజిక సంస్థలు, ప్రజలందరిపై ఉందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కూడా తీవ్రంగా దెబ్బతింటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం నేరాలు, హింస, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి విద్యాసంస్థ డ్రగ్స్ రహిత ప్రాంతంగా మారాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాయ్ కాడి విజయ్ కుమార్, బాల్ రెడ్డి, నర్రా బిక్షపతి, అశోక్, హనుమంత్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పృథ్వీరాజ్, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు, తదితరులు

# సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహనే ప్రధాన ఆయుధం

- జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక ఎస్పీ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 5 (జనం సాక్షి) :** సైబర్ నేరాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవ డం కంటే, అవి జరగకుండా ముందుగానే ప్రజల్లో విస్తృ త అవగాహన కల్పించ డమే అత్యంత ప్రభావవం తమైన మార్గమని జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు."సురక్ష కా తిరంగా -- సైబర్ జాగృత్ దివస్" సందర్భంగా జిల్లా పోలీసు శాఖ డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అభి నందన్ గార్డెన్స్‌లో నిర్వ హించిన భారీ సైబర్ అవ గాహన సదస్సులో జిల్లా కలెక్టర్, ఎస్పీ లు పాల్గొని ప్రసంగించారు.అంతకుముందు వివిధ రకాలుగా సైబర్ నేరాల బారిన పడిన బాధితులు స్వయంగా మాట్లాడి సైబర్ నేరాల వల లో ఎలా చిక్కుకున్నారో స్వయంగా వారి మాటల్లో వివరించి ఓటీపీలు ఎవరికి చెప్పొద్దని, అనవసర లింక్స్ ఓపెన్ చేయరాదని, తక్కువ సమయంలో ఎక్కు వ డబ్బులు సంపాదించ వచ్చు అనే ఆశకు గురికా వద్దని అలాంటి చిన్న చిన్న తప్పులు చేయొద్దని ఎవరి కైనా డబ్బులు పంపించే ముందు ఒకసారి ఆలోచిం చి పంపాలని స్వయంగా తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం ప్రజాప్రతినిధుల సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొ న్నారు.



ప్రతి గ్రామపం చాయతీ సమావేశంలో సైబర్ నేరాలపై ప్రత్యేక అజెండా చేర్చి ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులకు సూచించారు. అలాగే మహిళా సంఘాలు,వీఓలు,స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో కూడా సైబర్ భద్రత అంశా న్ని తప్పనిసరిగా చర్చించా లని కోరారు.విద్యార్థులు ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా తల్లిదండ్రులకు తెలియజేసి సైబర్ భద్రతపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో తాను చూసిన అనేక సైబర్ మోసాల ఘటనలను ప్రస్తా విస్తూ,డిజిటల్ అరెస్ట్" పేరుతో ఓ రిటైర్డ్ ఉపాధ్యా యుడి నుంచి రూ.75 లక్షలు కాజేసిన ఘటనను ఉదాహరణగా వివరించా రు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీసుల సమన్వయంతో ప్రత్యేక బృందాలు చర్యలు చేపట్టినా,నిందితులు డబ్బును దేశవ్యాప్తంగా వందలాది బ్యాంకు ఖాతా లకు బదిలీ చేయడంతో మొత్తం సొమ్మును తిరిగి రాబట్టడం క్లిష్టంగా మారిం దన్నారు. జిల్లా ఎస్పీ వినీత్ మాట్లాడుతూ సైబర్ నేరాలు కేవలం ఆర్థిక నష్టానికే పరిమితం కావని, కొన్నిసార్లు బాధితుల జీవి తాలను తీవ్రంగా దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతున్నా యని తెలిపారు.సైబర్ నేరగాళ్లు ప్రజలను భయం, ఆశ అనే రెండు ప్రధాన ఆయుధాలతో మోసం చేస్తున్నారని పేర్కొన్నారు.ఉద్యోగాల పేరుతో నకిలీ లింకులు పంపడం, వ్యక్తి గత ఫోటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం,డి జిటల్ కరెన్సీద్వారా డబ్బులు డిమాండ్ చేయ డం వంటి పద్ధతులతో అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, భగవంత్‌రెడ్డి, సైదులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. సుమారు 5 వేల మంది ఈ అవగాహన సదస్సుకు హాజరయ్యారు.

## ఈవీఎం గోదాం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 5 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని ఈవీఎం లు భద్రపరిచిన గోదాం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్దేశించిన మార్గ దర్శకాలకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించ బడుతోందని జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం నెలవారీ తనిఖీల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదామును రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా గోదాం వద్ద అమ లులో ఉన్న భద్రతా చర్య లు, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ,భద్రతా సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎం గోదాము ను నిర్దిష్ట వ్యవధిలో తనిఖీ చేసి,భద్రతా ఏర్పాట్లపై సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి క్రమం తప్పకుం డా సమర్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమి షనర్ శంకర్, డీటీ రామ కృష్ణ, సీ సెక్షన్ అధికారి జయసుధ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిష్పాక్షికంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 05(జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ములుగు నియోజకవర్గంలో ప్రస్తుతం 303 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో రెండు పోలింగ్ కేంద్రాలను స్థల మార్పు చేయనున్నట్లు, నాలుగు పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చనున్నట్లు, మరో ఐదు నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో నియోజకవర్గంలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల సంఖ్య, అందుబాటులో లేని ఓటర్ల వివరాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి సమాచారం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియకు సంబంధించి ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ నుంచి కూడా ఎలాంటి అభ్యంతరాలు అందలేదని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు, సలహాలను ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కె కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ సూచించారు. బుధవారం ఆయన మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఏఏఎం పెడిసిల్ల, మోట్లపల్లి ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో ఫార్మసీ అధికారులు, నర్సింగ్ అధికారులు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో జ్వరాలపై నిరంతర నిఘా ఉంచి, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో సిబ్బంది హాజరు పట్టికలు, వైద్య రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు ఇస్తున్న టీకాల కార్యక్రమం పురోగతిని సమీక్షించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు నాణ్యంగా అందించేలా ప్రతి సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నాగరాణి, వైద్యాధికారులు, ఫార్మసీ అధికారులు, నర్సింగ్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్టేషన్ ఘన్‌పూర్ మెగా లెదర్ పార్క్‌కు కేంద్రం ఆమోదించాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 05 ( జనం సాక్షి ) :** జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రతిపాదించి న మెగా లెదర్ పార్క్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదం తెలపాలని వరంగల్ పార్లమెంట్ సభ్యు రాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. బుధవారం లోక్‌సభలో రూల్–377కింద ఈఅంశాన్ని ప్రస్తావిం చిన ఎంపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండడంతో ఉపాధి కల్పనకు దోహద పడే కీలక ప్రాజెక్టు ఆలస్యమవుతోందని పేర్కొన్నా రు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రభుత్వ గుర్తించిన 120 ఎకరాల్లో తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమో షన్ కార్పొరేషన్ (టీఎస్ఎల్ఐపీసీఓ) ఆధ్వర్యం లో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో లెదర్ పరిశ్రమకు అవసరమైన ముడి పదార్థాల లభ్యతతో పాటు ఎఫ్‌డీడీఐ, నిఫ్ట్, గిల్ట్ వంటి సంస్థల సహకారం కూడా అందుబాటులో ఉందని వివరించారు. ఈ ప్రాజెక్టు అమలైతే ఎస్సీ వర్గాలకుచెందిన యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ కేంద్రంనుంచి ఆమోదం రాకపోవడం తో ప్రాజెక్టు ముందుకు సాగడంలేదన్నారు. ఉపాధి కల్పనకు దోహదపడే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఆమోద ప్రక్రియను వేగ వంతం చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, జౌళి శాఖను కోరారు.

# స్వర్ణ ప్రాజెక్ట్ భూములు కబ్జా

- యదేచ్ఛగా గృహాల షెడ్ల నిర్మాణం
- ప్రాజెక్ట్ భూమి విస్తీర్ణం 2500 ఎకరాలు
- అక్రమానికి గురి 600 ఎకరాలు
- అక్రమ దారులపై చర్యలు శూన్యం



**సారంగాపూర్, ఆగస్టు 5(జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే భూములు అక్రమణకు గురవుతున్నాయి. అధికారుల అలసత్వం వల్ల అక్రమణదారులు ప్రభుత్వ భూములు చెరబట్టి ఇండ్ల నిర్మాణాలు,షెడ్ల నిర్మాణాలు చేస్తున్నారు. 1970 సంవత్సరంలో గ్రామ పరిధిలోని స్వర్ణ నదిపై 2500 ఎకరాల విస్తీర్ణంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిసరాల్లో ప్రభుత్వ భూమి మిగిలింది. స్వర్ణ గ్రామాన్ని ఆనుకొని కొంత, ప్రాజెక్టు దిగువన మరికొంత భూమి దాదాపు వందల ఎకరాలు మిగిలింది. ఈ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. గ్రామాన్ని ఆనుకొని ఉన్న భూమిని ఆక్రమిస్తూవ్యవసాయం ఇండ్ల నిర్మాణం,షెడ్ల నిర్మాణం చేపడుతూ 600 ఎకరాల భూమి కబ్జా చేశారు.అలాగే ప్రాజెక్టు చుట్టూ ప్రక్కల గ్రామాలు స్వర్ణ, జౌళి, కుప్టి, రాంసింగ్‌తాండ, పొట్యా, అప్పారావుపేట్ గ్రామాల్లో విలువైన భూములు చెరబట్టి వ్యవసాయం చేస్తున్నారు. గ్రామాలకు చెందిన వ్యక్తులు ఐదు నుంచి పదెకరాలు కబ్జా చేసి రెండు పంటలు పడిస్తున్నారు. జౌళి గ్రామంలో ప్రాజెక్టు భూములను అమ్ముకోవడమే కాకుండా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఈ తతంగం కండ్ల ముందే జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. చేపట్టిన ఇండ్ల నిర్మాణాలు మీరు తీస్తే మేము తీస్తాం అంటూ ఒకరినొకరు అనుకుంటూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు వత్తాసు పలకడంతోనే కోట్ల రూపాయల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఆరోపణలు వినిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రాజెక్టు భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం దిశగా చర్యలు

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 05 (జనంసాక్షి):** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో ఉన్నత స్థాయిలో నిలవాలని మహిళల ఆర్థిక స్వావలంబన కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు నేడు వ్యాపార రంగంలో రాణిస్తూ ఆర్థికంగా ఎదిగి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కుట్టు మిషన్లు, ఎంబ్రాయిడరీ మిషన్ల ద్వారా తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని, మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా జిల్లాలో సుమారు 80 వేల మంది విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు కుట్టే కార్యక్రమాన్ని అప్పగించడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ నిర్వహణ, రెబ్బెన మండలం నంబాల గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, బస్సుల కొనుగోలు ద్వారా ప్రతినెల ఒక్కొక్క బస్సుకు 70 వేల ఆదాయం, పెట్రోల్ బంకుల ఏర్పాటు పనులు చేపట్టడం ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి చదివించాలని, ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలలో సభ్యులుగా చేరని వారిని గుర్తించి సభ్యులుగా చేర్పించి నూతన సంఘాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా మహిళా సంఘాల సభ్యులు సాధిస్తున్న విజయాలు, ఉత్పత్తులు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళా సంఘాలు అదనపు ఆదాయం పొందేలా వ్యాపార రంగాలలో రాణించాలని, ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా మహిళా

# స్వచ్ఛ భారత్ లక్ష్యాలకు తూట్లు..

- నిరుపయోగంగా మారిన సామూహిక మరుగుదొడ్లు
- లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరే..
- ఎక్కడ చూసినా నిరుపయోగంగా మారి శిథిలాలే అవుతున్న పట్టింపు లేని అధికారులు





**మంగపేట ఆగస్టు 05(జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ భారత్' మిషన్ మంగపేట మండలంలో అధికారుల నిర్లక్ష్యానికి పూర్తిగా బలైపోయింది. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో లక్షలాది రూపాయల కేంద్ర నిధులతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నేడు అనాథలుగా మారాయి. పూర్తి స్థాయిలో పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కరువై, నిర్వహణ గాలికి వదడంతో, ఈ నిర్మాణాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రజలకు ఉపయోగపడకపోగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. మంగపేట మండల పరిధిలోని మంగపేట, కమలాపురం, మల్లూరు, రాజుపేట గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. కానీ ప్రారంభించిన కొద్ది రోజులకే ఇవి నిరుపయోగంగా మారిపోయాయి. నిర్వహించిన ఏ ఒక్క చోట కూడా కనీస నిర్వహణ జాడ లేదు అని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. కనీసం నీటి వసతి కూడా లేకపోవడం, తలుపులు పూర్తిగా ఊడిపోవడం, చుట్టు పిచ్చిమొక్కలు మొలవడం వంటి కారణాలతో ఈ మరుగు దొడ్లు దయ్యాల కొట్లను తలపిస్తున్నాయి. ఈ సామూహిక మరుగుదొడ్లు పేదల సౌకర్యం కోసం, గ్రామాల పరిశుభ్రత కోసం కేంద్రం విడుదల చేసిన లక్షలాది రూపాయల ప్రజాధనం అధికారుల జేబుల్లోకో లేక కాంట్రాక్టర్ల కడుపులోకో చేరిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాలను సందర్శించే ప్రయాణికులు, కూలీలు, మహిళలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, అధికారులలో మాత్రం కనీస స్పందన లేదు అని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. వీటి నిర్వహణ విషయంలో

### ప్రశ్నార్థకంగా మారిన అధికారుల పనితీరు

ప్రభుత్వాలు మారుతున్నా, పథకాలు వస్తున్నా క్షేత్రస్థాయిలో అమల్లో మాత్రం తీవ్ర వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది అని ప్రజలు చర్చించుకుంటున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన ఈ పబ్లిక్ టాయిలెట్స్ ఎందుకు నిరుపయోగంగా మారాయి? వీటిని ఎందుకు పునరుద్ధరించడం లేదు? అని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన ఈ మరుగుదొడ్లపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తక్షణమే వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పాముకాటుతో మహిళ మృతి



**పరకాల, ఆగస్టు 5 (జనం సాక్షి):** పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన పరకాల పట్టణంలో చోటుచేసుకుంది. పరకాల పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన పస్తం వసంత 40 సంవత్సరాల మహిళ పాము కాటుతో మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రోజు రాత్రి ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో ఇంటి సమీపంలోని చెట్ల పొదల్లో నుండి పాము వచ్చి నిద్రిస్తున్న వసంతను కాటు వేసిందని తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం రోజున ఉదయం మరణించినట్లు తెలిపారు. వసంత మృతికి మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని కాలనీవాసులు తెలిపారు.

## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 5 (జనంసాక్షి) :** జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దార్ తో కలిసి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కోటపల్లి శివారులోని సర్వే నంబర్ 389లో 1.12 ఎకరాల విస్తీర్ణం గల భూమిని గుర్తించడం జరిగిందని, కార్యాలయ నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీని నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని పెండింగ్ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కోర్సుల్లో జాయిన్ కావడానికి 'స్పెషల్ ఫేసు' చివరి అవకాశం



**ములుగు,ఆగస్టు05(జనం సాక్షి):** దోస్త్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగులో చేరడానికి స్పెషల్ ఫేస్ ద్వారా చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.మల్లేశం తెలిపారు.రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మరియు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకృష్ణారెడ్డి అదే విధంగా కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఏ. దేవసేన లు డిగ్రీలో చేరడానికి స్పెషల్ ఫేస్ కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. స్పెషల్ ఫేస్ ద్వారా డిగ్రీలో చేరే విద్యార్థులు ఈనెల 6వ తేదీ నుండి 11వ తేదీ మధ్య రూపాయలు 400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని ములుగు కళాశాలలో ఆప్షన్ పెట్టుకోవాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వీరికి ఆగస్టు 14వ తేదీన సీట్లు కేటాయించబడుతుంది. ఇంటర్ పాసైన విద్యార్థులకు ఈ సంవత్సరం డిగ్రీల చేరడానికి ఇదే చివరి అవకాశం గా తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోనట్లయితే విద్యా సంవత్సరాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. తమ కళాశాలలో మూడు ఫేస్ లలో భర్తీ తర్వాత బీఎస్సీ(లైఫ్ సైన్సెస్ మరియు కంప్యూటర్ సైన్స్),బిఎస్సి (ఫిజికల్ సైన్సెస్ మరియు కంప్యూటర్ సైన్స్),బీకాం(కంప్యూటర్ అప్లికేషన్),బిఏ (హెచ్ఈపి) వంటి కోర్సులతోపాటు ఈ సంవత్సరం నుండి నూతనంగా బీకాం (బిఎఫ్ఎస్ఐ) పరిమిత సంఖ్యలో సీట్లు మిగిలి ఉన్నట్లు తెలిపారు. డిగ్రీలో ప్రవేశానికై దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆధార్ కార్డు, ఆధార్ తో లింక్ అయిన మొబైల్ నెంబర్, కలర్ ఫోటో, ఎస్ఎస్సి మెమో, ఇంటర్ మెమో లేదా హాల్ టికెట్,6 నుండి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఇటీవల తీసిన కుల మరియు ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించ వలసి ఉంటుంది.

### నూతనంగా అప్రెంటిషిప్ తో ఉద్యోగ గ్యారెంటీ ఏఈడిపి కోర్సు బి.కాం (బిఎఫ్ఎస్ఐ)కోర్సు

ఈ సంవత్సరం నుండి తమ కళాశాలలో అప్రెంటిషిప్ తో కూడిన బి.కాం (బిఎఫ్ఎస్ఐ) బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్) కోర్సు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరిన వారికి రెండు సంవత్సరాలు కళాశాలలో థియరీతోపాటు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఉపాధికి ఉపయోగపడే నైపుణ్యాలను బోధించడం జరుగుతుంది. ఫైనల్ ఇయర్ లో ఇండస్ట్రీస్, బ్యాంకింగ్,ఇన్సూరెన్స్ మరియు ఇతర ఆర్థిక సంస్థల్లో నెలకు దాదాపు 8,000/– అప్రెంటిషిప్ ఇవ్వబడుతుంది. మూడు సంవత్సరాల ఈ కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు 100% ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఈ కోర్సు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగు రావడం ములుగు ప్రాంత విద్యార్థుల అదృష్టంగా భావిస్తూ వీటిని అందరు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ మరియు కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. ఇంకా ఈ కోర్సులకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ జె శంకర్ ను లేదా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగులో జిల్లా స్థాయి 'దోస్త్'హెల్ప్ లైన్ సెంటర్ ను సందర్శించి (9966153683, 8978825734, 9550965334) లేదా ఫోన్ ద్వారా మీ సందేహాలను నివృత్తి చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోరారు.

# సర్వేపేట గ్రామ పరిధిలోని వాగులో వ్యక్తి గల్లంతు

- సీఐ ఆధ్వర్యంలో వ్యక్తి మృతదేహాన్ని వెలికితీత



**పలిమెల ఆగస్టు 5 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వేపేట గ్రామానికి చెందిన కుమ్మరి అంకయ్య చేపల వేటకు వెళ్లి గల్లంతై మృతి చెందిన సంఘటన బుధవారం రోజున చోటు చేసుకుంది. చేపల వేటకు సర్వేపేట గ్రామం నుండి కుమ్మరి అంకయ్య మంగళవారం రోజున కుమ్మరి బక్కయ్యతో కలిసి గ్రామ సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతు కావడంతో సమాచారం అందుకున్న పలిమెల పోలీస్ స్టేషన్ ఎస్ఐ శశాంక్ ఆదేశాలతో తన పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించగా చీకటి పడటంతో పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఘటన స్థలం లో గాలింపు చర్యలను నిలిపివేసి బుధవారం ఉదయం మహదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంకెన మత్స్యకారులు మరియు గజ ఈతగాళ్లు సమన్వయంతో గాలింపు చర్యలను ముమ్మరం చేయగా ప్రతికూల వాతావరణం, బురదతో నిండిన నీరు, లోతైన ప్రవాహం వంటి క్లిష్ట పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ధైర్య సాహసాలతో శ్రమతో గాలింపు కొనసాగించగా కుమ్మరి అంకయ్య మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. అనంతరం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బురద నీటిలో గంటల తరబడి శ్రమించి గాలింపు చేపట్టిన ప్రతి ఒక్కరికీ మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో మరియు ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో పలిమెల మండలంలోని గోదావరి తీరం వెంబడి నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం పలిమేల ఎస్సై మాట్లాడుతూ గోదావరి తీరం వెంట చేపల వేటకు వెళ్లేవారు, పశువులను మేపడానికి తీసుకెళ్లేవారు, అలాగే ఇతర ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరి తీరం వద్దకు వెళ్లరాదని సూచించారు. వరద ఉద్ధృతి పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు, పలిమెల ఎస్సై శశాంక్, ఆర్.ఎస్.ఐ అజహార్, టిఆర్ఎస్ సిబ్బంది, పలిమల పోలీస్ స్టేషన్ సిబ్బంది, పంకన మత్స్యకారులు మరియు గజ ఈతగాళ్లు పాల్గొన్నారు.

## చోరీ కేసును చేదించిన పోలీసులు

- రూ.లక్ష సొత్తు స్వాధీనం

**ఖానాపూర్ ఆగస్టు 05 (జనం సాక్షి) :** మండలంలోని బావాపూర్ (కె) గ్రామంలో ఈనెల 4వ తేదీన తన ఇంట్లో చోరీ జరిగిందని బి.సుజాత ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపారు. రూ.1,23,400/– ల సొత్తు అపహరణకు గురైనట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. అదే గ్రామానికి చెందిన మారంపెల్లి పెద్దిరాజును అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి పాల్పడ్డది తనేనని ఒప్పుకున్నట్లు వివరించారు. కాగా చోరీకి పాల్పడిన వ్యక్తి వద్ద సుమారు లక్ష రూపాయల విలువ చేసే సొత్తును స్వాధీనపరచుకొని న్యాయస్థానానికి సమర్పిం చామన్నారు. త్వరితగతిన కేసును చేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినం దించారు. మిగిలిన సొత్తుకు సంబంధించి విచారణ కొనసాగుతున్నట్లు ఎస్సై గైక్వాడ్ వివరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
06 ఆగస్టు 2026

# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం

● పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 5 (జనం సాక్షి) :** సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు 'సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ' "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అనే ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని అపూర్వంగా సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్ము, వ్యక్తిగత సమాచారం, గోప్యతపై దాడులు చేయడం ఆందోళనకరంగా మారిందన్నారు. నగదులావాదేవీల స్థానంలో యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్వాలెట్లు, ఆన్లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయని అన్నారు.

సైబర్ నేరాల నివారణలో ప్రతి పౌరుడు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ,



యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదన్నారు. తెలియని లింక్ లను నొక్కకూడదన్నారు. ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన సంకేత పదాలను ఉపయోగించాలన్నారు. రెండు దశల ధృవీకరణ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,అనుమానాస్పద కాల్ వస్తే వెంటనే కాల్ నిలిపివేసి సంబంధిత సంస్థ అధికారిక నంబర్లకు సంప్రదించాలన్నారు. అత్యంత విద్యావంతులు కూడా నేరగాళ్ల మానసిక వ్యూహాలకు మోసపోవడం ఈ నేరాల స్వరూపాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. ఒక్కసారి బ్యాంకు వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ లేదా వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే కొన్ని నిమిషాల్లోనే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని తెలిపారు.

ఇటీవలి కాలంలో ప్రమాదకరంగా మారిన నేరాల్లో 'డిజిటల్ అరెస్టు' మోసాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు అధికారులు పేర్లు చెప్పి వీడియో కాల్ ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గంటల తరబడి ఫోన్లోనే ఉంచి వారి నుంచి లక్షల రూపాయలు బదిలీ చేయించుకునే సంఘటనలు వెలుగు చూశాయని,అలాగే పెట్టుబడి పెడితే రోజుల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మిస్తూ నకిలీ ట్రేడింగ్ యాప్ల ద్వారా లక్షల రూపాయలు కాజేసే సంఘటనలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్లను తెరవడం, అపరిచిత యాప్లను డౌన్లోడ్ చేయడం, ఓటీపీలు చెప్పడం, క్యూఆర్ కోడ్లను విచక్షణారహితంగా స్కాన్ చేయడం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను అధికంగా పంచుకోవడం, ఒకే సంకేత పదాన్ని అన్ని ఖాతాలకు ఉపయోగించడం వంటి అలవాట్లు నేరగాళ్లకు అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఆన్లైన్ మోసాలు లేదా ఆర్థిక సైబర్ నేరాలు జరిగితే బాధితులు వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని,ఇది 24 గంటలూ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరఫ్, రవికుమార్, ఎస్సై లు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 (జనం సాక్షి) :** జిల్లాలో భూరీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా మరియు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూరీసర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే బృందాలు చేపడుతున్న భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ, భూ రికార్డుల పరిశీలన తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ యజమానులు, రైతులు భూరీసర్వే ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వే పనుల్లో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భూరీసర్వే పూర్తికావడం వల్ల భూ సరిహద్దులపై ఉన్న వివాదాలు తగ్గడంతో పాటు రైతులకు తమ భూములపై ఖచ్చితమైన హక్కుల నిర్ధారణ జరుగుతుందని, అందువల్ల ప్రతి రైతు ఈ కార్యక్రమానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ క్షేత్ర పరిశీలనలో ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ), గాంధారి తహసీల్దార్, సర్వే బృంద సభ్యులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి నాటికి మిర్యాలగూడను చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి



**మిర్యాలగూడ, ఆగస్టు 5 (జనంసాక్షి) :** గాంధీ జయంతి (అక్టోబర్ 2) నాటికి మిర్యాలగూడ మున్సిపాలిటీని పూర్తిస్థాయి చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి బయో మైనింగ్కు తరలించాలని సూచించారు. పట్టణంలో గుర్తించిన చెత్త నిల్వ కేంద్రాలను పూర్తిగా తొలగించి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని, మున్సిపల్ ఆటోల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఫాగింగ్ నిర్వహించడంతో పాటు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించి, బయోడిగ్రేడబుల్ కవర్లు లేదా బట్ట సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. అమృత్ పథకం కింద తాగునీటి పనులను డిసెంబర్లోపు పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ ఆదాయానికి కీలకమైన ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా కష్టపడాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 5 (జనంసాక్షి) :** ప్రతి విద్యార్థి జీవితంలో గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు ఇప్పటి నుంచే పునాది వేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేటలో జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. తరగతి గది విద్యతో పాటు డిజిటల్ బోధన, స్పోర్ట్స్, డిసిప్లిన్ విద్యార్థుల వికాసానికి ఎంతో కీలకమని స్పష్టం చేశారు. పాఠశాలలో క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ అభ్యర్థన మేరకు పాఠశాలకు వెంటనే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 10 కంప్యూటర్లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ వసతులను సీఎస్ఆర్ నిధులు లేదా జిల్లా ఫండ్స్ ద్వారా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అద్దె భవనంలో ఉన్నప్పటికీ విద్యార్థులకు నీటి వసతి, లైట్లు, ఫ్యాన్లు, బెడ్స్ వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. పోటీతత్వం పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తమలో ఉన్న సీనియర్ జూనియర్ హౌసెస్ పోటీల ద్వారా కాంపిటీటివ్ స్పిరిట్, స్పోర్ట్స్ మన్ షిప్ పెంచుకోవాలని సూచించారు. పదో తరగతి తర్వాత ఏ సబ్జెక్ట్ ఇచ్చినా దాన్ని చదివి, నైపుణ్యాలు సాధించే పొటెన్షియల్ రావాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి వారి భావి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేకంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలను సందర్శించడంతో పాటు కిచెన్ లో విద్యార్థులకు అందుతున్న భోజన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపల్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గంగాభవాని, జ్ఞానేశ్వరి, రాంబాబు, వైష్ణవి, స్వాతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, ఆగస్టు 5 (జనం సాక్షి) :** మత్తు పదార్థాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని, యువత వీటి బారిన పడి తమ విలువైన భవిష్యత్తును కుటుంబాన్ని కోల్పోతున్నారని, ఎట్టి పరిస్థితిలో నైనా, ఒత్తిడిలో నైనా మత్తు పదార్థాల జోలికివెళ్లొద్దు అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్, చిక్కడపల్లి బ్రహ్మకుమారిస్ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్, మిషన్ స్పందన్ పేరుతో దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో వ్యసనముక్తి ప్రతిజ్ఞ చేయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే ముఠా గోపాల్, చిక్కడపల్లి బ్రహ్మకుమారిస్ ఇంచార్జ్ జయశ్రీ , ముచ్చ కుర్తి ప్రభాకర్,పలువురు నాయకులు కలిసి వ్యసనముక్తి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ సామాజిక న్యాయం సాధికారిక మంత్రిత్వ శాఖ, సహకారంతో సే నో టు అడిక్షన్ అనే నినాదంతో మద్యం, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన కల్పించే



కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. చెడు వ్యసనాలకు ప్రలోభ పెట్టే వారి మాటలు వినవద్దని, మద్యం డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండి, ధైర్యంగా ఇలాంటి వాటిని తిరస్కరించి ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలనీ, ఆరోగ్యకరమైన జీవన శైలిని, క్రమశిక్షణ క్రీడలు,వ్యాయామం యోగ, ధ్యానం సత్సంగం నైతిక విలువలతో కూడిన నడవడికతో మంచి అలవాట్లను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమములో జయశ్రీ,రశ్మిత, లక్ష్మీనారాయణ, రఘు దీర్, శ్యామ్, భూషణ్ రైతులు పాల్గొన్నారు.

## ఈ నెలలోనే భద్రాచలం రెండో బ్రిడ్జిపై రాకపోకలు పునరుద్ధరణ



**భద్రాచలం, ఆగస్టు 5 (జనంసాక్షి) :** భద్రాచలం గోదావరిపై నిర్మించిన రెండో వంతెనపై ఈ నెలలోనే రాకపోకలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం వంతెన అప్రోచ్ రోడ్డు మరమ్మత్తు పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూనే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారని, ముఖ్యంగా గోదావరి పుష్కరాలు, ముక్కోటి, సీతారామ కళ్యాణ మహోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులు తరలివస్తారని అన్నారు. 2015 గోదావరి పుష్కరాల సందర్భంగా ఒకే వంతెన ఉండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురైన నేపథ్యంలో అమరావతి–జగదల్పూర్ జాతీయ రహదారిలో భాగంగా రెండో వంతెన నిర్మాణం చేపట్టినట్లు గుర్తు చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రెండో వంతెనను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎన్ని వరదలు వచ్చినా అప్రోచ్ రోడ్డు దెబ్బతినకుండా పటిష్టమైన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నామని, ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేసి వంతెనపై రాకపోకలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరిశీలనలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసం బోనాల వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 (జనం సాక్షి) :** నిజామాబాద్ పాత కలెక్టరేట్ ప్రాంగణంలో టీఎన్జీఓఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాసం బోనాల మహోత్సవాల్లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ కూడా పాల్గొని భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో సందడి చేశారు. అనంతరం నిర్వాహకులు మహేష్ కుమార్ గౌడ్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, కార్పొరేషన్ చైర్మన్లు కేశ వేణు,శేఖర్ గౌడ్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, టి ఎన్ జి ఓ జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, కార్యదర్శి నేతికుంట శేఖర్, నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, దయాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీఎన్జీఓఎస్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాండూరులో 1.150 కిలోల గంజాయితో బీహార్ వ్యక్తి అరెస్టు

**తాండూరు, అగస్టు 5 (జనంసాక్షి) :** జిల్లా మద్య నిషేధ మరియు ఆబ్కారీ అధికారి డి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఒక గంజాయి కేసు నమోదైంది. వివరాల ప్రకారం. తబ్రేజ్ స్టోన్ పాలిషింగ్ ఫ్యాక్టరీ, గోపన్పల్లి, గౌతాపూర్ గ్రామం వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని అందిన విశ్వసనీయ సమాచారంతో తాండూరు ఎక్సైజ్ ఇంచార్జీ సిఐ ఎన్. రాణి నేతృత్వంలోని బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ దాడిలో బీహార్ రాష్ట్రం, కటిహార్ జిల్లా, బైరియా గ్రామానికి చెందిన మహ్మద్ ముస్తాకిమ్ తండ్రి హమిదుర్ రహమాన్ వద్ద నుండి 1.150 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు జిల్లా మద్య నిషేధ అధికారి శ్రీ డి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ రైడ్స్లో తాండూరు ఎక్సైజ్ సిఐ ఎన్. రాణి, ఎస్సైలు నిజాముద్దీన్, రవికుమార్ తో పాటు సిబ్బంది విక్రమ్, అలీం, పండరి, రాజేష్, రామారావు, రాములు, సతీష్, జార్జ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమంగా గంజాయి అమ్మడం, కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని అన్నారు. ఎవరికైనా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం



ఉంటే 8712658754 నంబర్కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

## ఈవీఎం గోడౌన్ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 5 (జనం సాక్షి) :** సమీకృత జిల్లా కలెక్టరేట్ లోనీ ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసి గోడౌన్ రూం సీల్ ను, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించి తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేసి భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా చేస్తున్న డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజు, డిటి అన్సారీ, ఆర్ అండ్ బి, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

## అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు



**మిర్యాలగూడ, ఆగస్టు 5 (జనంసాక్షి) :** మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రి లో దివ్యాంగుల గుర్తింపు కార్డు ల జారీ కేంద్రం ప్రారంభిచిన కలెక్టర్లి జనంసాక్షి, మిర్యాలగూడ : జిల్లాలో అర్హులైన ప్రతి 6దివ్యాంగుడికి గుర్తిపు కార్డు జారీ చేసి తద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందిచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నాడు మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రిలో వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి, వారికీ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వారివెంట ఆర్డివో రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషా నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి, డిఎం ఎచ్ ఓ, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్,కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాలరెడ్డి,హాస్పిటల్ డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యం

● జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**మిర్యాలగూడ, ఆగస్టు 5 (జనంసాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యం అని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. బుధవారం నాడు మిర్యాలగూడ లో తరుచు ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్. హెచ్ 02,ఎన్. హెచ్ 167లో గల తరచూ ప్రమాదాలు జరుగు బ్లాక్ స్పాట్స్ అయినా వెల్కమ్ టూ మిర్యాలగూడ జంక్షన్, నందిపాడు ఎక్స్ రోడ్డు, చిల్లాపురం క్రాస్ రోడ్డు, చింతపల్లి క్రాస్ రోడ్డు, జంకుతాడా రోడ్డు, మిర్యాలగూడ అప్రోచ్ రోడ్డు ప్రాంతాలను సందర్శించి అక్కడ తరచూ ప్రమాదాలు జరగడానికి గల కారణాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి ప్రధాన కారణాలు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ప్రమాదకర ఓవర్టేకింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, రహదారి కూడళ్ల వద్ద స్పష్టమైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం, రోడ్ మార్కింగ్లు చెరిగిపోవడం, అక్రమ పార్కింగ్, రాత్రి వేళల్లో తగిన వెలుతురు లేకపోవడం, రహదారులపై అనధికారిక ప్రవేశాలు వంటి అంశాలని ఎస్పీ గుర్తించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఎస్పీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, జీబ్రా క్రాసింగ్లు, సెంటర్ లైన్లు, రోడ్ మార్కింగ్లకు రీ-పెయింటింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, బారికేడింగ్, రిఫ్లెక్టివ్ హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు, క్యాట్ ఐస్ ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో వారితో పాటు మిర్యాలగూడ ఇంచార్జ్ డిఎస్పీ



రవి,సీఐ లు పి. ఎన్. డి ప్రసాద్, సోమనర్సయ్య, నాగభూషణ్,నాగరాజు, రూరల్ ఎస్.ఐ లక్ష్మయ్య,డి.టి.ఆర్.బి ఇంచార్జ్ రిటైర్డ్ సీఐ అంజయ్య, సంబంధిత రోడ్డు భద్రత అధికారులు ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ ,ఎక్సైజ్,ట్రాన్స్ ఫోర్ట్అధికారులు,మరియు స్థానిక ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రెపో యథాతథం

## మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగింపు

- వరుసగా నాలుగోసారి 5.25 శాతం వద్దే రెపో రేటు
- 152 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. స్వల్పంగా ఎగిసిన నిఫ్టీ
- 2026-27 జీడీపీ వృద్ధి అంచనా 6.7 శాతానికి పెంపు
- ద్రవ్యోల్బణ అంచనా 5 శాతానికి తగ్గింపు




**ముంబై, ఆగస్టు 5 (జనంసాక్షి):** భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రెపో రేటును వరుసగా నాలుగోసారి 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదల మదుపర్లను అప్రమత్తం చేసినప్పటికీ, చివర్లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభాల్లో నిలిచాయి. ఉదయం 79,055.38 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ట్రేడింగ్ మధ్యలో 78,285.74 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయి, చివరికి 152.05 పాయింట్లు లాభపడి 78,581 వద్ద ముగిసింది. నిఫ్టీ 9.75 పాయింట్లు పెరిగి 24,624.65 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.13 వద్ద కొనసాగింది. సెన్సెక్స్‌లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడగా.. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బీఈఎల్, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించినప్పటికీ ఆటో, సిమెంట్ రంగాల కొనుగోళ్లు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని ప్రకటించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 6.7 శాతానికి పెంచినట్లు తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 5.1 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధిలో నౌకాయానానికి ఏర్పడుతున్న అంతరాయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లుగా మారుతున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. అయినప్పటికీ దేశీయ వినియోగ డిమాండ్ బలంగా ఉండటం భారత ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇస్తోందన్నారు. చమురు, ఆహారధాన్యాల ధరల ప్రభావంతో ద్రవ్యోల్బణం తాత్కాలికంగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, ఆ తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశముందని ఆర్‌బీఐ అంచనా వేసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 80.69 డాలర్ల వద్ద, బంగారం ఔన్స్ ధర 4,152.30 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి. తదుపరి ఆర్థిక సంకేతాలు, అంతర్జాతీయ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

## రుణ వడ్డీ నిబంధనల్లో ఆర్‌బీఐ సంస్కరణలు

- వడ్డీ లెక్కింపు విధానంలో ఏకరూపతకు ప్రతిపాదనలు
- బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఒకే నిబంధనలు
- ఈఎంఐ మార్పులపై రుణగ్రహీతలకు స్పష్టత
- త్వరలో ముసాయిదా మార్గదర్శకాలు విడుదల

**ముంబై, ఆగస్టు 5 (జనంసాక్షి):** రుణాలపై వడ్డీ రేట్ల నిర్ణయంలో పారదర్శకత, ఏకరూపత తీసుకురావడా నికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక ప్రతిపాదనలు ప్రకటించింది. ఆగస్టు ద్రవ్య విధాన సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ ప్రతిపాదనలను వెల్లడించారు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) రుణాలపై వడ్డీ లెక్కింపు, వడ్డీ రేట్ల సవరణలో ఒకే విధానాన్ని అనుసరించేలా త్వరలో ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకులు వడ్డీ లెక్కించడానికి వేర్వేరు రోజుల గణన విధానాలను అనుసరిస్తుండటంతో రుణ వ్యయం బ్యాంకు నుంచి బ్యాంకుకు మారుతోంది. ఈ వ్యత్యాసాలను తొలగించేందుకు వడ్డీ లెక్కింపు విధానాన్ని ప్రామాణీకరించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. అలాగే ఫ్లోటింగ్ వడ్డీ రేట్లను కొన్ని బ్యాంకులు నెలకొకసారి, మరికొన్ని మూడు నెలలు, ఆరు నెలలు లేదా ఏడాదికోసారి సవరిస్తుండటంతో ఏకరూపత లేకపోతోందని గుర్తించింది.
కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే ఆర్‌బీఐ రెపో రేటులో మార్పులు చేసిన వెంటనే రుణాల ఈఎంఐలు ఎప్పుడు మారతాయో రుణగ్రహీతలకు స్పష్టత లభిస్తుంది. అన్ని బ్యాంకులు ఒకే విధానాన్ని అనుసరించడం వల్ల వేర్వేరు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలపై వడ్డీ రేట్ల మార్పులు కూడా సమాన కాలవ్యవధిలో అమలయ్యే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు పాత గృహ, వాహన, ఎంఎస్ఎంఈ రుణాలు ప్రధానంగా మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్) విధానంలో కొనసాగుతుండగా, 2019 నుంచి కొత్త రుణాలను బాహ్య ప్రమాణ రుణ రేటు (ఈబీఎల్ఆర్)తో అనుసంధానించాలని ఆర్‌బీఐ సూచించింది. అయితే రెండు విధానాలు అమల్లో ఉండటంతో ఏర్పడిన అసమానతలను తొలగించి, రెపో రేటు తగ్గింపు ప్రయోజనం రుణగ్రహీతలకు వేగంగా చేరేలా తాజా ప్రతిపాదనలు రూపొందించింది. ఈ మార్పులు అమల్లోకి వస్తే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల రుణ నిబంధనల్లో ఏకరూపత ఏర్పడటంతో పాటు రుణగ్రహీతలు వివిధ బ్యాంకుల రుణ ఆఫర్లను సులభంగా పోల్చుకునే అవకాశం లభిస్తుంది. రుణాల ఎంపికలో పారదర్శకత పెరగడంతో వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆర్థిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 530 | ₹ 63.60 |
| వరంగల్ | ₹ 532 | ₹63.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,43,990 | ₹1,31,990 |
| చెన్నై | ₹1,44,000 | ₹1,35,974 |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,24,900

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..!?

- డిజిటల్ చెల్లింపుల నిర్వహణకు ఖర్చు తప్పదన్న గవర్నర్
- ప్రస్తుతం ప్రభుత్వ సబ్సిడీలతో ఉచిత యూపీఐ సేవలు
- రూ.2 వేలకుపైగా వ్యాపార లావాదేవీలపై స్వల్ప ఎమ్‌డీఆర్‌కు అవకాశం
- వ్యక్తిగత యూపీఐ నగదు బదిలీలపై ప్రభావం ఉండదు



**ముంబై, ఆగస్టు 5 (జనంసాక్షి)::** యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో ఛార్జీలు విధించే అవకాశాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను దీర్ఘకాలం సమర్థవంతంగా కొనసాగించాలంటే దానికి అయ్యే వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ సబ్సిడీల కారణంగా వినియోగదారులకు యూపీఐ సేవలు ఎలాంటి ఛార్జీలు లేకుండా అందుతున్నాయని తెలిపారు.
డిజిటల్ చెల్లింపుల మౌలిక వసతుల ఏర్పాటు, సాంకేతిక నిర్వహణ, భద్రతా వ్యవస్థల నిర్వహణకు గణనీయమైన వ్యయం అవుతుందని, ఆ వ్యయానికి స్థిరమైన పరిష్కారం అవసరమని గవర్నర్ పేర్కొన్నారు. అయితే యూపీఐ వినియోగదారులపై ఛార్జీల అంశంపై ఇప్పుడే తుది నిర్ణయం తీసుకున్నట్లు భావించాల్సిన అవసరం లేదని, దీనిపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇదిలా ఉండగా, చెల్లింపులు మరియు సెటిల్‌మెంట్ వ్యవస్థలకు సంబంధించిన చట్టంలో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో వ్యాపార సంస్థలు స్వీకరించే కొన్ని యూపీఐ చెల్లింపులపై వ్యాపారి రాయితీ రుసుము (ఎమ్‌డీఆర్) విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రూ.2 వేలకుపైగా జరిగే వ్యాపార లావాదేవీలపైనే స్వల్ప రుసుము విధించే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే వ్యక్తుల మధ్య జరిగే సాధారణ యూపీఐ నగదు బదిలీలపై ఎలాంటి ప్రభావం ఉండదని, వినియోగదారుల ఉచిత లావాదేవీల విధానంలో తక్షణ మార్పులు ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. డిజిటల్ చెల్లింపుల విస్తరణకు భంగం కలగకుండా, వ్యవస్థ ఆర్థికంగా నిలకడగా ఉండేలా ప్రభుత్వం, ఆర్బీఐ సమతుల్య విధానంపై దృష్టి సారిస్తున్నాయి.

## కొత్త అవతార్‌లో మహీంద్రా స్కార్పియో ఎన్

- ప్రారంభ ధర రూ.13.69 లక్షలు
- అత్యాధునిక ఫీచర్లతో కొత్త వెర్షన్
- పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఎంపికలు
- వెనుక చక్రాల, నాలుగు చక్రాల డ్రైవ్ సౌకర్యం



ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా నవీకరించిన స్కార్పియో ఎన్ మోడల్‌ను దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. ఈ వాహనం ప్రారంభ ధరను రూ.13.69 లక్షలు (ఎక్స్‌షో రూమ్)గా నిర్ణయించగా, అత్యున్నత వేరియంట్ ధర రూ.25.49 లక్షలుగా ప్రకటించింది. కొత్త మోడల్ లో విశాలమైన గాజు పైకప్పు (పనోరమిక్ సన్‌రూఫ్), పెద్ద సమాచార–వినోద తెర, పూర్తి డిజిటల్ పరికరాల ప్రదర్శన ప్యానెల్, చుట్టూ దృశ్యాన్ని చూపించే కెమెరా వ్యవస్థ వంటి ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. బాహ్య రూపకల్పనలో పెద్దగా మార్పులు లేకపోయినా, 18 అంగుళాల మిశ్రమ లోహ చక్రాలు, రెండు రంగుల ముగింపుతో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. లోపల 12.29 అంగుళాల సమాచార–వినోద ప్రదర్శన తెర, 10.24 అంగుళాల పూర్తి డిజిటల్ పరికరాల ప్యానెల్ను ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యాలు థార్ రాక్స్ మోడల్‌లో కూడా ఉన్నాయి. కొత్త స్కార్పియో ఎన్‌లో అంధ ప్రాంతాల పర్యవేక్షణ వ్యవస్థతో కూడిన 540 డిగ్రీల కెమెరా, 12 స్పీకర్ల సోనీ ధ్వని వ్యవస్థ, గాలి ప్రసరణ సీట్లు, స్వయంచాలకంగా కాంతి తగ్గే లోపలి అద్దం, విద్యుత్ ఆధారిత పార్కింగ్ బ్రేక్, టైప్–సి ఛార్జింగ్ పోర్టు, ఆరు గాలి భద్రతా సంచులు, ఎలక్ట్రానిక్ స్థిరత్వ నియంత్రణ వ్యవస్థ, రెండో స్థాయి ఆధునిక డ్రైవర్ సహాయక భద్రతా వ్యవస్థ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ ఎస్‌యూవీ 2.0 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్, 2.2 లీటర్ల ఎమ్‌హాక్ డీజిల్ ఇంజిన్ ఎంపికలతో లభిస్తుంది. ఆరు వేగాల మాన్యువల్ లేదా ఆరు వేగాల స్వయంచాలక గేర్‌బాక్స్ ఎంపికలు ఉన్నాయి. వేరియంట్‌ను బట్టి వెనుక చక్రాల డ్రైవ్ లేదా నాలుగు చక్రాల డ్రైవ్ సదుపాయాన్ని వినియోగదారులు ఎంచుకోవచ్చు.

## దేశంలో అత్యంత ఆకర్షణీయ ఎంప్లాయర్‌గా గూగుల్

**న్యూఢిల్లీ:** దేశంలో అత్యంత ఆకర్షణీయమైన ఉద్యోగ సంస్థగా గూగుల్ నిలిచింది. మానవ వనరుల సేవల సంస్థ రాండ్‌స్టాడ్ విడుదల చేసిన ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్–2026 నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో టాటా గ్రూప్ రెండో స్థానాన్ని, అమెజాన్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. సర్వే ప్రకారం ఉద్యోగులు సంస్థను ఎంపిక చేసుకునేటప్పుడు వేతనాలతో పాటు పని–వ్యక్తిగత జీవిత సమతుల్యత, సమాన అవకాశాలు, ఉద్యోగ భద్రత, సానుకూల కార్యాలయ వాతావరణం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా యువ ఉద్యోగుల్లో ఈ ధోరణి మరింత పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది.

## మీడియా ముందుకు షేక్ హసీనా

- ఢిల్లీలో వర్చువల్ మీడియా సమావేశానికి సిద్ధం
- స్వదేశానికి తిరుగు ప్రయాణంపై ప్రకటన చేసే అవకాశం
- హసీనా ప్రసంగాలపై బంగ్లాదేశ్ ఆంక్షలు
- సమావేశంతో తమకు సంబంధం లేదన్న భారత్



**న్యూఢిల్లీ:** భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా త్వరలో మీడియా ముందుకు రానున్నారు. ఢిల్లీలో బుధవారం జరగనున్న విలేకరుల సమావేశంలో ఆమె వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించనున్నట్లు సమాచారం. స్వదేశానికి తిరిగి వెళ్లే అంశంతో పాటు భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై కీలక ప్రకటనలు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. హసీనా మీడియా సమావేశంపై బంగ్లాదేశ్ ప్రభుత్వం స్పందించింది. భారత్‌తో తమకు ఉన్న స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతినకూడదని కోరుకుంటున్నామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబేద్ తెలిపారు. భారత్ తమ ఆందోళనలను అర్థం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌లో ఉంటూ హసీనా, అవామీ లీగ్ నాయకులు రాజకీయ ప్రకటనలు చేయడంపై ఇప్పటికే పలుమార్లు తమ అభ్యంతరాలను భారత్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. మరోవైపు షేక్ హసీనా ప్రసంగాలు, ఇంటర్వ్యూలు, ఆడియో, వీడియో సందేశాలను ప్రచురించడం లేదా ప్రసారం చేయడాన్ని నిషేధిస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించే మీడియా సంస్థలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విద్యార్థుల ఉద్యమం అనంతరం అధికారాన్ని కోల్పోయి భారత్‌కు వచ్చిన తర్వాత షేక్ హసీనా మీడియాను ఉద్దేశించి మాట్లాడటం ఇదే తొలిసారి కానుంది. ఈ సమావేశంలో ఆమె కుమారుడు సాజీబ్ వాజెద్‌తో పాటు అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. అయితే ఈ మీడియా సమావేశంతో తమకు ఎలాంటి సంబంధం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇది ఒక ప్రైవేటు మీడియా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమమని, ప్రభుత్వానికి ఇందులో ఎలాంటి పాత్ర లేదని తెలిపింది.

## వీసాలో భారీ ఉద్యోగాల కోత

### ప్రపంచవ్యాప్తంగా 7 శాతం మంది ఉద్యోగుల తొలగింపు

- సుమారు 2,600 మందిపై లేఆఫ్ ప్రభావం
- కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలపై సంస్థ దృష్టి
- భారత్‌లో ప్రభావంపై స్పష్టత ఇవ్వని వీసా




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** డిజిటల్ చెల్లింపుల రంగంలోని ప్రముఖ సంస్థ వీసా ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో ఉద్యోగుల కోత చేపట్టింది. సంస్థ మొత్తం ఉద్యోగుల్లో సుమారు 7 శాతం మందిని, అంటే దాదాపు 2,600 మందిని తొలగించినట్లు సమాచారం. అయితే ఈ లేఆఫ్‌ల ప్రభావంతో భారత్‌లో ఎంత మంది ఉద్యోగులు సేవలు కోల్పోయారనే అంశంపై సంస్థ అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. భారత్‌లోని బెంగళూరు, ముంబై, చెన్నై, హైదరాబాద్ కేంద్రాల్లో వీసాకు 3,500 మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. అంతర్గత సమాచారం ప్రకారం, కొన్ని విభాగాల్లో పూర్తి బృందాలనే పునర్వ్యవస్థీకరించినట్లు తెలుస్తోంది. ఒక విభాగంలో 28 మంది సభ్యుల బృందంలో 10 మందిని ఒకేసారి తొలగించినట్లు సమాచారం. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పాటు రెండు దశాబ్దాలకు పైగా సేవలందించిన సీనియర్ డైరెక్టర్లు, మేనేజర్లు కూడా ఉన్నారు.
జులై 29 తెల్లవారుజామున ఉద్యోగులకు లేఆఫ్ ఈ–మెయిల్స్ పంపినట్లు తెలిసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారికి 15 నుంచి 30 రోజుల నోటీసు గడువుతో పాటు సేవరెన్స్ ప్యాకేజీలు అందించినట్లు సమాచారం. ఈ భారీ ఉద్యోగాల కోతకు కృత్రిమ మేధ సాంకేతికత వినియోగం ప్రధాన కారణంగా భావిస్తున్నారు. సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి ర్యాన్ మెక్‌ఇనెర్నీ మాట్లాడుతూ, సంస్థ వ్యూహంలో కృత్రిమ మేధ కీలక భాగంగా మారిందని తెలిపారు. మానవ పర్యవేక్షణతో స్వయంచాలకంగా పనులు నిర్వహించే ఏజెంటిక్ కృత్రిమ మేధ వ్యవస్థల వినియోగాన్ని విస్తరించడంపై సంస్థ దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ ప్రభావం ఉద్యోగ విపణిపై మరింత స్పష్టంగా కనిపిస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 20 ఏళ్లు పూర్తి చేసుకున్న ఇండిగో..


- 20 వేల ఉచిత టికెట్ల ప్రకటన
- వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఆఫర్
- అర్హులకు రూ.10 వేల వరకు టికెట్ చార్జీ రీఫండ్
- ఆగస్టు 4 నుంచి 6 వరకు చేసిన బుకింగ్‌లకు అవకాశం
- దేశ విమానయాన రంగంలో 51 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రస్థానం




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో తన వాణిజ్య కార్యకలాపాలకు 20 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రయాణికులకు ప్రత్యేక బహుమతి ప్రకటించింది. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా దేశీయ ప్రయాణికుల కోసం 20 వేల ఉచిత టికెట్లను అందించే ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించింది. 'ఇండిగో ఫ్రీ' పేరుతో తీసుకొచ్చిన ఈ ఆఫర్ ద్వారా అర్హులైన ప్రయాణికులకు టికెట్ చార్జీని గరిష్ఠంగా రూ.10 వేల వరకు తిరిగి చెల్లించనుంది.
ఇండిగో 2006 ఆగస్టు 4న ఢిల్లీ నుంచి గౌహతి మీదుగా ఇంఫాల్‌కు తొలి వాణిజ్య విమాన సర్వీసును ప్రారంభించింది. ఒకే మార్గంతో సేవలు ప్రారంభించిన సంస్థ ప్రస్తుతం దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో విస్తృత సేవలు అందిస్తూ దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థగా ఎదిగింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 12.3 కోట్లకు పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన ఇండిగో ప్రస్తుతం దేశ విమానయాన సామర్థ్యంలో సుమారు 51 శాతం వాటాను కలిగి ఉంది. ముఖ్యంగా మెట్రో నగరాలతో పాటు చిన్న పట్టణాలకు విమాన సేవలను విస్తరించడంలో కీలక పాత్ర పోషించింది.
ఈ ప్రత్యేక ఆఫర్ ఆగస్టు 4 నుంచి 6 వరకు ఇండిగో అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్, కృత్రిమ మేధ ఆధారిత వర్చువల్ సహాయక సేవ ద్వారా చేసే దేశీయ విమాన బుకింగ్‌లకు వర్తిస్తుంది. ఆఫర్ కాలంలో బుకింగ్ చేసిన వారిలో అర్హులను యాదృచ్ఛికంగా ఎంపిక చేసి ఈ–మెయిల్, వాట్సాప్ ద్వారా సమాచారం అందజేస్తారు. అనంతరం ఒక సాధారణ ప్రశ్నకు సరైన సమాధానం ఇచ్చిన వారికి గరిష్ఠంగా రూ.10 వేల వరకు టికెట్ చార్జీని రీఫండ్ చేస్తారు. ఈ ఆఫర్ వన్‌వే, రాకపోక ప్రయాణాలతో పాటు దేశీయ సాధారణ తరగతి, ప్రీమియం తరగతి బుకింగ్‌లకు కూడా వర్తిస్తుంది. ఎంపికైన ప్రయాణికులకు రీఫండ్ మొత్తాన్ని మూడు నుంచి ఐదు పనిదినాల్లో జమ చేస్తామని ఇండిగో తెలిపింది.

## వాట్సాప్ గ్రూపులకు కొత్త ఫీచర్లు

- పోల్స్‌కు సమయ పరిమితి సదుపాయం
- గ్రూప్ సభ్యులందరికీ ఒకేసారి ఏఆల్ ట్యాగ్
- ఒక్క క్లిక్‌తో కొత్త గ్రూప్ సృష్టించే అవకాశం
- వినియోగదారుల గోప్యతకు మరింత ప్రాధాన్యం




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** ప్రముఖ సందేశాల యాప్ వాట్సాప్ గ్రూప్ వినియోగదారుల కోసం పలు కొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రూప్ నిర్వహణను మరింత సులభతరం చేయడంతో పాటు పోల్స్, నోటిఫికేషన్లు, కొత్త గ్రూపుల సృష్టిలో వినియోగదారులకు మెరుగైన అనుభవం కల్పించేలా ఈ నవీకరణలను రూపొందించింది. ఇప్పటికే ఈ ఫీచర్లు దశలవారీగా వినియోగదారులకు అందుబాటులోకి వస్తున్నాయి.
కొత్త అప్‌డేట్‌లో భాగంగా గ్రూప్‌లో నిర్వహించే పోల్స్‌కు ముగింపు సమయాన్ని ముందుగానే నిర్ణయించుకునే అవకాశం కల్పించింది. నిర్ణయించిన సమయం పూర్తికాగానే ఓటింగ్ స్వయంచాలకంగా నిలిచిపోతుంది. అలాగే పోల్స్‌కు ఎవరు ఓటు వేశారనే వివరాలు, ఎంత మంది స్పందించారనే సమాచారం ఇకపై పోల్ రూపొందించిన వ్యక్తికి మాత్రమే కనిపించేలా గోప్యతా సదుపాయం కల్పించింది. దీంతో సభ్యులు తమ అభిప్రాయాలను మరింత స్వేచ్ఛగా వెల్లడించగలుగుతారు. అదనంగా, పోల్ సృష్టించిన తర్వాత 15 నిమిషాల లోపు దాన్ని సవరించే అవకాశం కూడా ఇచ్చింది.
గ్రూప్‌లోని సభ్యులందరికీ ఒకేసారి సమాచారం చేరేలా ఏఆల్ అనే కొత్త ట్యాగ్ ఫీచర్‌ను కూడా ప్రవేశపెట్టింది. ఈ ట్యాగ్‌ను ఉపయోగిస్తే గ్రూప్ సభ్యులందరికీ ఒకేసారి నోటిఫికేషన్ అందుతుంది. ప్రస్తుతం ఈ సదుపాయం 32 మందికి పైగా సభ్యులు ఉన్న గ్రూపుల్లో అందుబాటులో ఉండగా, దీనిని గ్రూప్ నిర్వాహకులు (అడ్మిన్లు) మాత్రమే వినియోగించగలరు. గ్రూప్‌ను మ్యూట్ చేసినా ఏఆల్ ట్యాగ్‌తో వచ్చిన నోటిఫికేషన్ కనిపిస్తుంది. అవసరమైతే ఈ అలర్ట్‌లను కూడా ప్రత్యేకంగా మ్యూట్ చేసే అవకాశం ఉంది. మరో ముఖ్యమైన ఫీచర్‌గా, ఇప్పటికే ఉన్న గ్రూప్‌లోని కొంతమంది సభ్యులతో ఒక్క ట్యాప్‌తో కొత్త గ్రూప్‌ను సృష్టించే సదుపాయాన్ని తీసుకొచ్చింది. ఒక్కో సభ్యుడిని విడివిడిగా ఎంపిక చేయాల్సిన అవసరం లేకుండా, కావాల్సిన సభ్యులను ఒకేసారి ఎంపిక చేసి కొత్త గ్రూప్ రూపొందించవచ్చు. పుట్టినరోజులు, ప్రత్యేక కార్యక్రమాలు లేదా సర్‌ప్రైజ్ ప్రణాళికలు వంటి సందర్భాల్లో ఈ ఫీచర్ వినియోగదారులకు ఎంతో ఉపయోగపడనుంది.

## ఇరాన్‌కు ట్రంప్ మరో హెచ్చరిక

- హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవాలని అల్టిమేటం
- చర్చల నుంచి వెనక్కి తగ్గితే తీవ్ర పరిణామాల హెచ్చరిక
- అణ్వాయుధాలకు అవకాశం లేదన్న అమెరికా అధ్యక్షుడు

**వాషింగ్టన్, ఆగస్టు 5 (జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన సైనిక చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నప్పటికీ, వాటిని టెహ్రాన్ బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ట్రంప్ మాట్లాడుతూ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత భారీ స్థాయి సైనిక చర్యలకు అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ చర్చలకు ముందుకొచ్చిందని పేర్కొన్నారు. ఇరాన్‌పై తీసుకోబోయే తదుపరి చర్యలపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలను కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకల అంశంపై ఇరాన్, ఒమన్‌తో కలిసి చర్చలు జరుగుతున్నాయని అమెరికా ప్రకటించింది. ఒకటి లేదా రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వెల్లడించారు. అయితే అమెరికా ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో జరుగుతున్న చర్చల్లో అమెరికాకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేసింది. తమ సార్వభౌమాధికారం, జాతీయ భద్రతా ప్రయోజనాలను పరిరక్షించే కొత్త సముద్ర రవాణా విధానంపై మాత్రమే చర్చలు సాగుతున్నాయని తెలిపింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హోర్ముజ్ జలసంధి అంశం మళ్లీ ఉద్రిక్తంగా మారడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు ఎటు దారితీస్తాయన్న దానిపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

## మూడో దేశం ముసుగులో పాక్ ఖర్జూరాల దిగుమతి యత్నం భగ్నం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** పాకిస్తాన్‌పై భారత్ విధించిన దిగుమతి నిషేధాన్ని మూడో దేశం ద్వారా తప్పించుకునే ప్రయత్నాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) భగ్నం చేసింది. గుజరాత్‌లోని కాండ్లా పోర్టులో పాకిస్తాన్ మూలానికి చెందిన 364 మెట్రిక్ టన్నుల ఎండు ఖర్జూరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.3 కోట్లుగా అంచనా వేశారు. నిర్దిష్ట సమాచారంతో తనిఖీలు చేపట్టిన డీఆర్ఐ అధికారులు కాండ్లా పోర్టుకు చేరుకున్న 13 కంటైనర్లను పరిశీలించారు. దిగుమతి పత్రాల్లో ఈ సరుకును యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి వచ్చినదిగా పేర్కొన్నప్పటికీ, విచారణలో అసలు మూల దేశం పాకిస్తాన్ అని తేలింది. పాకిస్తాన్ నుంచి సరుకును తొలుత దుబాయ్‌కు తరలించి, అక్కడ మరో కంటైనర్లలోకి మార్చి భారతదేశానికి పంపినట్లు అధికారులు గుర్తించారు. ఇదే తరహా అక్రమ దిగుమతి ప్రయత్నాన్ని ఇటీవల తమిళనాడు లోని తూత్తుకుడి పోర్టులో కూడా డీఆర్ఐ వెలుగులోకి తెచ్చింది. సుమారు రూ.1.4 కోట్ల విలువైన ఈ సరుకును స్వాధీనం చేసుకున్న అధికారులు ఇద్దరిని అరెస్టు చేశారు.



# చేప పిల్లల పంపిణీకి రూ.116 కోట్ల విడుదల

### స్వాగతించిన మత్స్యకారులు

**కమాన్‌పూర్, ఆగస్టు 05 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని జలాశయాలు, చెరువుల్లో చేప పిల్లలు, రొయ్య పిల్లల నిల్వ (స్టాకింగ్) కోసం అదనంగా రూ.116 కోట్లు విడుదల చేయడాన్ని మంథని నియోజకవర్గ మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ సందర్భంగా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆది వరాహస్వామి ఆలయ ప్రాంగణంలో కమాన్‌పూర్ మత్స్యకార సంఘం,మంథని నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మత్స్యకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ చేప పిల్లల పంపిణీకి భారీ నిధులు విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఈ పథకం ద్వారా వేలాది మత్స్యకార కుటుంబాలకు స్థిరమైన ఉపాధి, ఆదాయం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కమాన్‌పూర్ మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు గడప కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చెరువుల్లో సకాలంలో నాణ్యమైన చేప పిల్లలను వదిలితే మత్స్య ఉత్పత్తి పెరిగి మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నిధులను పారదర్శకంగా వినియోగించాలని అధికారులను కోరారు. ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్య సంపద పెరగడంతో పాటు మత్స్యకారుల జీవనోపాధి మరింత బలోపేతం అవుతుందని సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. విడుదలైన నిధులతో జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో చేప పిల్లలను సకాలంలో వదిలి, పథకం ప్రయోజనాలు ప్రతి మత్స్యకార కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్ణయం మత్స్య రంగ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షులు అనవేని సదానందం,పిడుగు భీమలింగు, అనవేని సదయ్య, గోగుల శ్రీను, చుంచు శ్రీను, రాసకొండ మొగిలి, కారుపాకల రవితేజ, అనవేని అనిల్, చొప్పరి వీరయ్య, గోగుల లక్ష్మీరాజం, రాసకొండ పెద్ద లక్ష్మీరాజం, రాసకొండ సమ్మయ్య, అనవేని లక్ష్మీరాజం, పిల్లి రమేష్, మబ్బు నరసయ్య, మబ్బు శంకర్, పిల్లి శంకర్, గడప సారయ్య, పెద్దపల్లి కుమార్, చొప్పరి సదయ్య, కందుల నర్సింగం, పిడుగు మల్లేష్, కమాన్‌పూర్ మత్స్యకార సంఘం, మంథని నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు, మత్స్యకారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి అభివృద్ధికి భారీ నిధులు

### మంత్రి సీతక్కకు కాంగ్రెస్ నాయకులతో సన్మానం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 (జనంసాక్షి) :** కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి భారీ నిధులు సాధించడంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కీలక పాత్ర పోషిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆయన నిరంతర కృషి ఫలితంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.75.19 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ నిధుల మంజూరుకు కృతజ్ఞతగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆధ్వ ర్యంలో కామారెడ్డి కాంగ్రెస్ నాయకులు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ రహదారుల అభి వృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిన ఆర్‌డబీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షబ్బీర్ మాట్లాడుతూ, కామారెడ్డి అభివృద్ధే లక్ష్యంగా మరిన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురావడానికి కృషి కొనసాగిస్తున్నామని తెలిపారు. త్వరలో ఎఫ్‌డీఏ కింద రూ.45 కోట్లు, సీఆర్ఆర్ కింద రూ.32 కోట్ల అదనపు నిధులు కూడా మంజూరు కానున్నాయని వెల్లడించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీటి వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో కామారెడ్డిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగు తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేస్తున్న కృషిని అభినందించారు.

# ఎగువ మానేరు పరిసర ప్రాంతాలవారు అప్రమత్తంగా ఉండాలి

### ఎగువ మా ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితె



**గంభీరావుపేట, ఆగస్టు 05 (జనం సాక్షి) :** ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం, ఎగువ నుంచి వరద తదితర అంశాలపై జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి ప్రస్తుతం కూడవెల్లి, పాల్వంచ వాగుల నుంచి ఇన్ ఫ్లో లేదని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 1. 6 టీఎంసీల నీరు ఉందని నీటి పారుదల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి వరద చేరి పూర్తి స్థాయి నీరు నిండే అవకాశం ఉందని, నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి మట్టాన్ని పరిశీలిస్తూ.. ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ మత్తడి పారితే పోలీస్, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి.. రాకపోకలను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, ప్రశాంత్, తహసీల్దార్ మారుతిరెడ్డి సర్పంచ్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరంలో ఉద్రిక్తత

### కులం పేరుతో దూషణపై అట్రాసిటీ కేసులు నమోదు

**గన్నేరువరం (జనంసాక్షి):** గన్నేరువరం మండల కేంద్రంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. కులం పేరుతో దూషించారన్న బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. గన్నేరువరం గ్రామానికి చెందిన కుర్ర మనీషా, ఆమె భర్త హరీష్, కుటుంబ సభ్యులను అదే గ్రామానికి చెందిన బోయిని కుమార్, టేకు అనిల్ అనే వ్యక్తులు తీవ్రంగా కులం పేరుతో దూషించారు. ఈ ఘటనపై తీవ్ర మనస్తాపానికి గురైన బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై నరేందర్ రెడ్డి బాధితుల ఫిర్యాదును స్వీకరించి, నిందితులపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టంతో పాటు పలు బిఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.



# అన్ని రైల్ మిల్లులలో విజిలెన్స్ దాడులు జరగాలి

### సియంఆర్ బియ్యం అమ్ముకున్న వారిపైన పిడి యాక్ట్ పెట్టాలి : గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 5 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాల అధికారులు పెద్దఎత్తున అక్రమాలు చేసిన వారిని వదిలి, చిన్న రైస్ మిల్లుల మీద దాడులు చేసి కేసులు పెట్టి, పెద్దవారిని వదిలి పెడుతున్నారని బుధవారం రోజు జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం పెద్దలు నిర్వహించిన సమీక్ష సమావేశంలో సివిల్ సప్లయ్ వ్యవస్థకు తూట్లు పొడిచిన వారిని, అనేక అక్రమాలకు అన్యాయాలకు పాల్పడిన వారిని పక్కన కూర్చోబెట్టుకుని సమీక్ష చేయడంలో అర్థం ఏమిటని వారన్నారు. కరీంనగర్ జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు, కొందరు బడా రైస్ మిల్లర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్న తీరును ప్రతిపక్ష పార్టీ కూడ మూగబోయయని ఇంతా పెద్దఎత్తున సియంఆర్ బియ్యం గల్లంతు కావడం అంటే దీనికి పూర్తి బాధ్యత అధికారులదేనని వారు అన్నారు. ఏసీకే బకాయిదారులు టెండర్ నిబంధనల ఉల్లంఘన చేసి జిల్లాలో వందల ఏసీకే బకాయిలు ఉన్నప్పటికీ, 2022-23 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం వేలంలో బకాయి డబ్బులు చెల్లించని వారికి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలలో ధాన్యం నిల్వలేనట్లు తేలిన 25% పెనాల్టీ చెల్లించాలన్న, నాటి సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూన్న వ్యక్తులకు మళ్లీ మళ్ళీ ధాన్యాన్ని కట్టబెట్టడంలో మతులాబు ఏమిటని వారు అన్నారు. చిన్న మిల్లర్ల పై కక్షసాధింపు చర్యలు, బడా మిల్లర్లకు నిబంధనలకు విరుద్ధంగా లాభం చేకురుస్తూ, సామాన్య, చిన్న రైస్ మిల్లర్లపైన మాత్రం కావాలనే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం కేవలం 10 శాతం బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని స్పష్టమైన సర్క్యులర్ జారీ చేసినప్పటికీ జిల్లాలో ఆనిబంధనను పక్కనపెట్టి అధికారుల అలసత్వం ప్రదర్శించడం వెనుక భారీ కుట్ర కోణం దాగి ఉందని వారన్నారు. కొన్ని రైస్ మిల్లులలో స్టాక్ లేకుండానే అక్రమ షిఫ్టింగ్ కొంతమంది బడా రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వ లేకపోయినా, ఉన్నట్లు చూపించి 25% పెనాల్టీ పడకుండా పెద్ద ఎత్తున షిఫ్టింగ్ చేస్తూ, ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారుల పైన త్వరలోనే ఆధారాలతో సహా పిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఈ అంశం పై ప్రత్యేక దృష్టి సారించి, సమగ్ర విచారణ జరిపించి, ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై, మిల్లర్లపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, జిల్లా నాయకులు రంగరవేణి లక్ష్మణ్, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, గర్షకుర్తి విద్యాసాగర్, నూతి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఏడుగురికి కారుణ్య నియామక పత్రాలు

### అందించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 5 (జనంసాక్షి) :** జిల్లాలోని వివిధ శాఖల్లో కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగాలు కల్పించినట్లు బుధవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. వివిధ శాఖల్లో ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరినీ ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. వారికి కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కలెక్టర్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఉద్యోగం పొందిన వారు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ, తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి పాల్గొన్నారు.

**కారుణ్య నియామకాలు పొందిన వారి వివరాలు :** వినేష్ ఆఫీస్ సబార్డినేట్ (పశుసంవర్ధక శాఖ), అభిలాష్ ఆఫీస్ సబార్డినేట్ (ట్రెజరీ), వేల్పుల సుమలత జూనియర్ అసిస్టెంట్ (సీపీఓ ఆఫీస్), వకులాభరణం విషంత జూనియర్ అసిస్టెంట్ (వర్క్స్ అకౌంట్స్), రేహ ఫాతిమా జూనియర్ అసిస్టెంట్ (కరీంనగర్ జీజీహెచ్), కొల్ల రాజు జూనియర్ అసిస్టెంట్ (కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం), శ్రీలక్ష్మి జూనియర్ అసిస్టెంట్ (కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం)లో నియమకాలు జరిగినవి.

# జేఎంఈటీ ఉద్యోగులకు ఓవర్‌మెన్ గ్రేడ్-బి ప్రమోషన్లు కల్పించాలి

### యాజమాన్యానికి బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి సంస్థలో 2016, 2017 సంవత్సరాల్లో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీస్ గా నియమితులై ప్రస్తుతం డీజీఎంఎస్ నిర్వహించిన ఓవర్‌మెన్ కంపిటెన్సీ సర్టిఫికెట్ సాధించి షార్ట్ ఫైర్ మరియు మైనింగ్ సర్దార్ గ్రేడ్-సి లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే ఓవర్‌మెన్ గ్రేడ్-బి ప్రమోషన్లు కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) యాజమాన్యాన్ని కోరింది. ఈ మేరకు సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్ (ఐ ఆర్ అండ్ పి యం)లకు యూనియన్ అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో వినతిపత్రం పంపించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం సీనియర్ మైనింగ్ సర్దార్ (ఓ ఎం హెచ్) గ్రేడ్-బి నుంచి ఓవర్‌మెన్ గ్రేడ్-బికి ప్రమోషన్లు ఇస్తున్నప్పటికీ, అదే అర్హత కలిగిన జె ఎం ఈ టి ఉద్యోగులను పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. సింగరేణిలో అధిక సంఖ్యలో జూనియర్ మైనింగ్ సర్దార్ పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు భవిష్యత్తులో మరిన్ని ఖాళీలు ఏర్పడే అవకాశం ఉన్నందున, అర్హత సాధించిన జే ఎం ఈ టి ఉద్యోగులకు ఓవర్‌మెన్ గ్రేడ్-బి ప్రమోషన్లు కల్పించడం వల్ల సంస్థకు అనుభవజ్ఞులైన సాంకేతిక సిబ్బంది అందుబాటులోకి వస్తారని తెలిపారు. సంస్థలో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ఓవర్‌మెన్ పోస్టుల కొరత ఉందని, అర్హులైన జేఎంఈటి ఉద్యోగులను ప్రమోట్ చేయడం ద్వారా ఉత్పాదకత పెరగడమే కాకుండా భద్రతా ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు. అందువల్ల, సింగరేణి యాజమాన్యం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, 2016, 2017 జెఎంఈటి బ్యాచ్ ఉద్యోగులకు వెంటనే ఓవర్‌మెన్ గ్రేడ్-బి ప్రమోషన్లు కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బలంగా డిమాండ్ చేస్తుంది.



# "కరీంనగర్ మెడికవర్"లో అత్యంత అరుదైన పాంక్రియాస్ సర్జరీ

### మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 5 (జనంసాక్షి) :** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అత్యంత అరుదైన పాంక్రియాస్ (క్లోమగ్రంధి) డక్ట్‌లో ఏర్పడిన రాళ్లను తొలగించే లాటరల్ పాంక్రియాటికోజెజునోస్టమీ అనే క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ దిలీప్‌రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ తాహా తెలిపారు. హైదరాబాద్‌ను మినహాయిస్తే కరీంనగర్‌లో తొలిసారిగా ఈ సర్జరీ చేసిన ఘనత మెడికవర్‌కు దక్కిందన్నారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం మాట్లాడుతూ... ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 24 ఏళ్ల శ్రీకాంత్ అనే యువకుడు గత కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ, పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. మెడికవర్ ఆసుపత్రిని ఆశ్రయించగా రోగి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించగా పాంక్రియాస్ డక్ట్‌లో రాళ్లు ఏర్పడి ఇన్‌ఫెక్షన్ సోకి వ్యాధి తీవ్రత పెరిగినట్లు గుర్తించామని తెలిపారు. దీనికి అత్యంత నైపుణ్యంతో కూడిన లాటరల్ పాంక్రియాటికోజెజునోస్టమీ శస్త్రచికిత్స ద్వారా పాంక్రియాస్ డక్ట్‌లో ఉన్న రాళ్లను పూర్తిగా తొలగించి, ప్యాంక్రియాస్ నుంచి జీర్ణరసాలు సక్రమంగా ప్రవహించేలా మార్గాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉండడమే కాకుండా సాధారణ జీవితం గడుపుతున్నాడని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక సాంకేతిక పరికరాలు, సమర్థవంతమైన శస్త్రచికిత్స బృందం సమన్వయంతో ఈ విజయాన్ని సాధించామని వెల్లడించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆసుపత్రి అనస్థీషియా వైద్యులు డాక్టర్ వినయ్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**చందుర్తి (జనంసాక్షి) :** మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో మహిళా సమైక్య భవనాన్ని, మూడు లక్షలతో ఏర్పాటుచేసిన మంచినీటి శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించి అనంతరం అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపడుతున్నారన్నారు. గతంలో మహిళా సంఘాల సమావేశాలకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు నిర్మించి వారి కార్యకలాపాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో వడ్డీ రాయితీలు, రూ.20 లక్షల వరకు రుణాలు, బ్యాంకుల ద్వారా భారీ స్థాయిలో రుణ సదుపాయాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 57 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అందజేస్తున్నారని మహిళా సమాఖ్యలు ముందుకు వస్తే రైస్ మిల్లులు, సోలార్ పవర్ ప్రాజెక్టులు, బస్సుల నిర్వహణ వంటి ఆదాయ వనరులు కూడా కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే చర్యల్లో భాగంగా నాణ్యమైన బతుకమ్మ చీరలను అందిస్తోందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలు నేసిన చీరలను మహిళలకు పంపిణీ చేస్తున్నారని, రెండో విడత చీరల తయారీ కూడా కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలతో మహిళలు, రైతులు, పేదలకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతోందని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, పేదలకు సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. మర్రిగడ్డ గ్రామంలో స్కూల్ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తారని హామీ ఇచ్చారు. పల్లె దవాఖాన, బోరు బావి, మహిళా సంఘానికి మరో భవన నిర్మాణం వంటి అంశాలను కూడా అధికారులు పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరువు రావాలని గత పది సంవత్సరాలు పరిపాలన చేసిన వారు కోరుకుంటున్నారని విమర్శించారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి రాజన్న ఆలయ అభివృద్ధి, రహదారుల విస్తరణ, వంతెనల నిర్మాణం తదితర పనులకు భారీ నిధులు తీసుకొచ్చారని, రాబోయే రోజుల్లో కూడా గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చి ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూది మనీషా శ్రీనివాస్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ లు పొద్దు పొడుపు లింగారెడ్డి,నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొట్టె ప్రభాకర్, నాయకులు చింతపంటి రామస్వామి, శ్రీనివాస్, మధు, బాలు, ఆదిత్య,అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

**మల్యాల ఆగస్టు 5 (జనం సాక్షి)**



మల్యాల గ్రామానికి చెందిన చొప్పదండి మనోహర్ తండ్రి మల్లేశం ఒక మైనర్ బాలిక పట్ల అసబ్యాకరంగా ప్రవర్తిస్తూ వేదిస్తూ,అత్యాచారానికి పాల్పడిన విషయంలో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు కాగా సీఐ దర్యాప్తు చేపట్టి నిందితుడైన మనోహర్ ను ఆగస్టు 5వ తేదీ రోజున అరెస్టు చేసి కోర్ట్ ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లుగా ఎస్సై సందీప్ తెలిపారు.

ఎవరైనా మైనర్ బాలికల పట్ల,మహిళల పట్ల అసభ్యంగా,దురుసుగా ప్రవర్తించినచో వారిపట్ల చట్టపర పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ మాదాసు రాజ్ కుమార్ తెలిపారు.

# హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

**వీణవంక ఆగస్టు 5 (జనం సాక్షి)** వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నేదునూరి అనిల్ తేది 20.10.2020 సంవత్సరంలో ఇదే గ్రామానికి చెందిన నరుకుడు ప్రణయ్ ను హత్య చేయగా బుధవారం రోజు కరీంనగర్ సెషన్స్ కోర్ట్ నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధించారని వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

# చికిత్స పొందుతూ యువకుడు మృతి

**మల్యాల ఆగస్టు 5 (జనం సాక్షి)**

గొర్రెగుండం గ్రామానికి చెందిన ఎడ్ల మనోహర్ (18), జూలై 12వ తేదీ తమ వ్యవసాయ పొలంలో క్రిమిసంహారక మందు పిచికారీ చేసే సమయంలో ప్రమాదవశాత్తు మందు నోటిలోకి వెళ్లి అస్వస్థతకు గురవడంతో మనోహర్‌కు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించి హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో ఆగస్టు 5వ తేదీ ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని మృతుడి తండ్రి లచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు.

## కెమికల్ లీకేజి ప్రమాదం
# ఎంపీ డీకే అరుణ దిగ్భ్రాంతి
### మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 5(జనం సాక్షి):** రాష్ట్ర సరిహద్దు కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా కడెచుర్ - బడియాల్ పారిశ్రామిక ప్రాంతంలోని సి ఐ ఎల్ ల్యాబరేటరీస్ ప్రైవేట్ కంపెనీలో జరిగిన కెమికల్ లీకేజీ ప్రమాదం పై ఎంపీ డీకే అరుణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో తెలంగాణకు చెందిన గణేష్, మధ్యప్రదేశ్ కు చెందిన విక్రమ్ సింగ్, సంజయ్ సింగ్ లు మరణిం చడం బాధాకరమని మృతుల కుటుంబాలకు ఎంపీ డీకే అరుణ సానుభూ తి తెలిపారు.ప్రమాదంలో మరణించిన మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధి లోని నారాయణపేట జిల్లా కృష్ణా మండలం అలంపల్లి గ్రామ వాసి కట్ల గణేష్, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో ఇద్దరు విక్రమ్ సింగ్, సంజయ్ సింగ్ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆంధ్రప్రదేశ్ కి చెందిన మరో ఇద్దరు యువ కులకు మెరుగైన వైద్యం అందించాలని



కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా కలెక్టర్, ఎస్పీ లతో మహ బూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఫోన్లో మాట్లాడారు.ప్రమాదంలో మరణించి కుటుంబాలకు, గాయప డిన వారికి కంపెనీ యాజ మాన్యం అండగా నిలబడి నష్టపరిహారం అందించాల ని, కార్మిక భీమాతో పాటు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎక్స్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## బాధితులకు న్యాయం చేస్తాం : మంత్రి శరణాప్రకాష్ పాటిల్

**కృష్ణ, ఆగస్టు 5 (జనం సాక్షి ):** రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక కడేచూరు సిఐఎల్, ల్యాబ్ లెటరి, కంపెనీలో గ్యాస్ లీక్ అయ్యి ముగ్గురు మృతి చెందిన ఘటనపై స్పందించిన కర్ణాటక రాష్ట్ర వైద్య, విద్యా శాఖ మంత్రి
డాక్టర్ శరణ ప్రకాష్ పాటిల్,స్థానిక ఎమ్మెల్యే కందుకూరి శరణ గౌడ బుధవారం సీల్ కంపెనీని సందర్శించారు, యువకులు చనిపోవడంతో అవేదన వ్యక్తం చేశారు, ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు, బాధితులకు న్యాయం చేస్తామని ,కంపెనీ పై కఠిన చర్యలు తీసుకుంటామని కంపెనీని సిజ్ చేస్తామని



తెలిపారు.మంత్రి,ఎమ్మెల్యేలను కలిసి బిఆర్ ఎస్ నాయకుడు గురుజాల్ శివరాజ్ పాటిల్ బాధితులకు సరైన న్యాయం చేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని,చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# నల్లమల్లలో చెంచు గిరిజనుల జీవన పరిస్థితులపై ఆరా

### తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ క్షేత్రస్థాయి పరిశీలన
### విద్య, వైద్యం, సంక్షేమం, జీవనోపాధి, మౌలిక వసతులపై సమీక్ష

**అచ్చంపేట ఆగస్టు 5 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలు, విద్య, వైద్య సేవలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ బుధవారం క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలోని నల్లమల్ల ప్రాంతాన్ని సందర్శించిన ఆయన చెంచు గిరిజనుల వాస్తవ జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, ప్రభుత్వ శాఖల పనితీరుపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అడవిలోని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఎంతవరకు చేరుతున్నాయో స్వయంగా తెలుసుకునేందుకు ఆయన వివిధ గ్రామాలను సందర్శించారు.

ఉదయం బ్రహ్మగిరి,విష్ణుగిరిలోని కృష్ణవేణి గెస్ట్ హౌస్‌లో గిరిజన సంక్షేమ, విద్య, వైద్య ఆరోగ్య, అటవీ, ఐటీడీఏ, పంచాయతీరాజ్, పోలీస్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నల్లమల్ల ప్రాంతంలోని చెంచు గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, విద్యా స్థితిగతులు, వైద్య సేవలు, మౌలిక వసతులు, అటవీ ప్రాంత విస్తీర్ణం, రవాణా సమస్యలు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారుల నుంచి సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. చెంచు గిరిజనుల జీవన విధానం, సంప్రదాయ జీవన నైపుణ్యాలు, ఉపాధి వనరులు, ఆదాయ మార్గాలు, ప్రభుత్వ ఆర్థిక సహాయ కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలపై అధికారులు చేపడుతున్న చర్యలను వివరించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా ప్రత్యేక కార్యాచరణ ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై జస్టిస్ షమీమ్



అక్తర్ ప్రత్యేకంగా సమీక్షించారు. విద్యార్థుల నమోదు, హాజరు శాతం, ఉపాధ్యాయుల నియామకాలు, విద్యా నాణ్యత, మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో అందిస్తున్న సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థుల భద్రత తదితర అంశాలపై అధికారులను ప్రశ్నించారు. తదుపరి వట్టువర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జస్టిస్ షమీమ్ అక్తర్ అక్కడి వైద్య సేవలను పరిశీలించారు. వైద్యుల హాజరు, సిబ్బంది అందుబాటు, మందుల నిల్వలు, అత్యవసర సేవలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, అంబులెన్స్ సేవలు, అడవి ప్రాంతాల నుంచి రోగులను తరలించే విధానంపై అధికారులను ప్రశ్నించారు. ప్రత్యేకంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనులకు వైద్య సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుతున్నాయా, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి, దూర ప్రాంతాల్లో మొబైల్ వైద్య సేవలు అందుతున్నాయా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి చెంచు కుటుంబానికి నాణ్యమైన ఆరోగ్య సేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మల్లయ్యపెంట గ్రామాన్ని సందర్శించిన కమిషన్ చైర్మన్ చెంచు గిరిజన విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, భోజనం, వసతి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో చెంచు గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడిన ఆయన వారి రోజువారీ జీవన విధానం, అటవీపై ఆధారపడిన జీవనం, ఉపాధి అవకాశాలు, కుటుంబ ఆదాయం, పిల్లల విద్య, ఆరోగ్య పరిస్థితులు, పోషకాహారం, తాగునీరు, విద్యుత్, గృహాలు, రహదారులు, రేషన్ సరఫరా, పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అడవి ఉత్పత్తుల సేకరణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెంచు మహిళలు, వృద్ధులు, యువకులు తమ సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, ప్రతి సమస్యను ఓపికగా విన్న ఆయన సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనులు అభివృద్ధి ఫలాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని జస్టిస్ షమీమ్ అక్తర్ అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం, పోషకాహారం, గృహ వసతి, తాగునీరు, విద్యుత్, రవాణా, జీవనోపాధి వంటి ప్రాథమిక అవసరాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచించారు. చెంచు గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు ఇంచార్జ్ పిఓఐటీడీఏ , అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, అచ్చంపేట డిఎస్పి శ్రీనివాసులు, విద్యా వైద్య ఆరోగ్య, అటవీ శాఖ అధికారులు తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### 15 ఏళ్లుగా ఎదురుచూపులే..
# రాధికనగర్‌కు రోడ్లు ఎప్పుడొస్తాయి..?
### పన్నులు కడుతున్నాం... రోడ్లు మాత్రం కనిపించడం లేదు..!

**బోడుప్పల్-జనంసాక్షి**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచర్ల రాధిక నగర్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. దాదాపు 15 ఏళ్ల క్రితం సొంత ఇళ్లు కొనుగోలు చేసి స్థిరపడిన కుటుంబాలకు ఇప్పటికీ కనీస మౌలిక వసతులు అందలేదు. చిన్నపాటి వర్షం పడితే చాలు... కాలనీ రహదారులు బురదమయంగా మారి ప్రజల నిత్యజీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. రోడ్లు లేవు... తాగునీటి సమస్య వెంటాడుతోంది... దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఒకప్పుడు ప్రశాంతంగా జీవించాలని ఆశించి రాధిక నగర్‌లో ఇళ్లు కొనుగోలు చేసిన కుటుంబాలు, నేడు కనీస సౌకర్యాల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. కాలం గడుస్తున్నా సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని అంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రాధిక నగర్ వీధులు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయి. అడుగు బయట పెట్టాలంటే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు బురదలో నడుస్తూ



పడిపోతున్నారని, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం నిత్యకృత్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల సమస్యతో పాటు తాగునీటి కొరత కూడా కాలనీ వాసులను వేధిస్తోంది. మరోవైపు దోమల బెడద అధికమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా సమస్యల పరిష్కారానికి చర్యలు కనిపించలేదని ఆరోపిస్తున్నారు.

## గద్వాల రహదారిపై వీయూపీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అనంతరం ఎంపీ డీకే అరుణ వెల్లడి

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 (జనం సాక్షి)** ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ భేటీ



అయ్యారు.ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా గట్టు – రాయపురం పరిసర గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను ఆమె కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్మిస్తున్న సోలాపూర్–కర్నూలు–చెన్నై గ్రీన్‌ఫీల్డ్ హైవే కారణంగా గట్టు–గద్వాల ప్రధాన రహదారి కిలోమీటర్ 214o100 వద్ద మూసివేయబడిందని ఎంపీ వివరించారు. ప్రస్తుతం ప్రధాన రహదారిపై వెహికల్ అండర్‌పాస్ వీయూపీ లేకుండా, కేవలం ఒక గ్రామీణ రహదారిపై మాత్రమే అండర్‌పాస్ నిర్మించారు. దీంతో భారీ వాహనాలు, ఇతర ట్రాఫిక్ 200 మీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామీణ రహదారి గుండా వెళ్లాల్సి వస్తోంది,స్థానిక ప్రజలు, వందలాది మంది రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు అదనంగా 300 మీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించాల్సి వస్తోంది,గట్టు, రాయపురం మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడిందిగట్టు–గద్వాల ప్రధాన రహదారిపై వెంటనే వెహికల్ అండర్‌పాస్ వీయూపీని ర్మించాలని ఎంపీ డీకే అరుణ కేంద్ర మంత్రిని కోరారు. ఎంపీ గారు వివరించిన సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారు సానుకూలంగా స్పందించారు. రాయపురం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రధాన రహదారిపై వీయూపీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం వల్ల గద్వాల జిల్లా ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీ డీకే అరుణ తెలిపారు.

## అక్రమ ఎల్పీజీ గ్యాస్ రవాణా గుట్టురట్టు
### ఘట్‌కేసర్‌లో ఇద్దరు అరెస్టు.. 44 సిలిండర్లు, ఆటో ట్రాలీ స్వాధీనం

**ఘట్‌కేసర్, ఆగస్టు 5 (జనంసాక్షి) :** ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నంబర్--9 వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మొత్తం 44 ఎల్పీజీ సిలిండర్లతో పాటు ఒక సుజుకి ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో



స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) సిబ్బంది అనుమానాస్పదంగా ఎల్పీజీ సిలిండర్లను ఆటో ట్రాలీలోకి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి ఘట్‌కేసర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో పూసా రామ్ (43), గ్యాస్ సరఫరాదారుగా పనిచేస్తుండగా, అతని సహాయకుడు ఓం ప్రకాష్ (32)తో కలిసి సబ్సిడీపై లభించే గృహోపయోగ ఎల్పీజీ సిలిండర్లను లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి, వాటిని టీ స్టాళ్లు, హోటళ్లు తదితర వాణిజ్య సంస్థలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. అలాగే గృహోపయోగ సిలిండర్లలోని గ్యాస్‌ను వాణిజ్య సిలిండర్లలోకి అక్రమంగా బదిలీ చేస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఐదు గృహోపయోగ ఎల్పీజీ సిలిండర్లు, మూడు వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లు, 36 చిన్న ఎల్పీజీ సిలిండర్లు, ఒక సుజుకి ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. సబ్సిడీపై అందించే గృహోపయోగ ఎల్పీజీ సిలిండర్లను అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం లేదా వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్టవిరుద్ధమని, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్‌కేసర్ పోలీసులు హెచ్చరించారు.


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో
# నాణ్యతతో పాటు వేగానికి ప్రాధాన్యత ఇవ్వాలి
### రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్

**వనపర్తి బ్యూరో ఆగస్టు 5 జనంసాక్షి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిమితులకు లోబడి, నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతమ్ ఆదేశించారు.బుధవారం వనపర్తి జిల్లా వనపర్తి మండలం రాజపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మేనేజింగ్ డైరెక్టర్ పరిశీలించారు. ఈ



సందర్భంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎండి ఆరా తీయగా.. గ్రామంలో మంజూరైన 34 ఇందిరమ్మ ఇళ్లకు 34 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు, ఇండ్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు హౌసింగ్ పీడీ వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎక్కువ ఎత్తుతో కూడిన బేస్మెంట్ నిర్మించుకోవడం, పరిమితికి మించి స్లాబ్ సైజు పెంచుకోవడం వంటివి చేయవద్దని సూచించారు. అలా చేస్తే నిర్మాణ ఖర్చు భారీగా పెరుగుతుందని సూచించారు. కాబట్టి లబ్ధిదారులు పరిమితులకు లోబడే నిర్మాణం చేపట్టాలని తెలియజేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం లబ్ధిదారులు గంధం నాగమ్మతో పాటు మరో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను సందర్శించి, పరిశీలించి వారితో నేరుగా మాట్లాడారు. నిర్మాణ వ్యయం, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే ప్రస్తుతం మార్కెట్లో సిమెంట్ బస్తాలు, ఇనుప సామగ్రి ధరలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వం రాయితీ ధరలకు లబ్దిదారులకి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై లబ్ధిదారుల అభిప్రాయాలను కూడా తెలుసుకుని నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ విటోభా, ఇతర అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్టైఫండ్ పెంపు డిమాండ్‌తో ఉధృతమైన వైద్య విద్యార్థుల ఆందోళన
### రెండో రోజుకు చేరిన నిరసన
### రామంతాపూర్ హోమియోపతి ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల బైఠాయింపు



**ఉప్పల్/రామంతాపూర్, ఆగస్టు 5 (జనం సాక్షి):** స్టైఫండ్ పెంపు డిమాండ్‌తో రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిలో హౌస్ సర్జన్లు, పీజీ వైద్య విద్యార్థులు చేపట్టిన నిరసన ఉద్యమం రెండో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకునే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేస్తూ విద్యార్థులు ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నిరసన కొనసాగిస్తున్నారు. స్టైఫండ్ పెంపు అంశంపై ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడంతో విధులను బహిష్కరించిన హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో నినాదాలు చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. తమకు న్యాయమైన స్టైఫండ్ ఇవ్వాలని, వైద్య విద్యార్థుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వైద్య విద్యార్థుల విధుల బహిష్కరణ కారణంగా ఆస్పత్రిలో బయటి రోగుల (ఓపీ) సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రతిరోజూ చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చే అనేక మంది రోగులు వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు నిరాశతో వెనుదిరిగిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైద్య విద్యార్థులు మాట్లాడుతూ, పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా స్టైఫండ్‌లో పెంపు అవసరమని పేర్కొన్నారు. తమ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, న్యాయమైన స్టైఫండ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లేదా నిర్ణయం వెలువడే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఆస్పత్రిలో సాధారణ వైద్య సేవలపై ఈ ఆందోళన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం త్వరితగతిన జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మరోవైపు ప్రభుత్వం స్పందించే వరకు తమ నిరసనను విరమించే ప్రసక్తే లేదని హౌస్ సర్జన్లు, పీజీ వైద్య విద్యార్థులు తేల్చి చెప్పారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

**అల్వాల్, ఆగస్టు 5 (జనంసాక్షి):** డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన ముగ్గురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జూలై 31న లయోలా కళాశాల సమీపంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో జవహర్‌నగర్‌కు చెందిన ఎ. రాకేష్ (21), షామీర్‌పేట్‌కు చెందిన కె. శ్రీనివాస్ (41), ఉత్తరప్రదేశ్‌కు చెందిన అవినేష్ కుమార్ (30) మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసి చలాన్లు జారీ చేశారు. బుధవారం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి జరిమానాతో పాటు రాకేష్‌కు రెండు రోజుల, శ్రీనివాస్, అవినేష్ కుమార్‌లకు నాలుగు రోజుల కారాగార శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర రహదారి వినియోగదారుల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.



## ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం
### తోటి ఆర్టీసీ డ్రైవర్లకు మానవత్వం లేకపాయే

**రాజాపూర్, ఆగస్టు 5(జనంసాక్షీ):** మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారి 44 నుండి బుధవారం మధ్యాహ్నం సమయంలో, భారీ కంటైనర్ పోలేపల్లి సెజ్ కు సబ్ రోడ్డు వైపు అకస్మాత్తుగా మలుపడంతో హైదరాబాద్ వైపు వెలుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్, ప్రమాదాన్ని తప్పించేందుకు చేసిన ప్రయత్నంలో ఎడమవైపు ఇనుప బారికేడును, బోర్డును డికొనగా ముందలి ఎడమ టైరు పగిలి నెమ్మదిగా కంటైనర్ ను ఢీకొట్టింది. దాంతో బస్సులో ప్రయాణం చేస్తున్న దాదాపు 70మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు ఆర్టీసీ డ్రైవర్ చేసిన ప్రయత్నం చూసి మా ప్రాణాలు కాపాడావు అని అన్నారు.

ఒక ఆర్టీసీ డ్రైవర్ ప్రయాణికులను సురక్షితంగా కాపాడితే , జాతీయ రహదారిపై అప్పుడే ప్రమాదం నుండి బయటపడి బిక్కుబిక్కుమంటూ ఎప్పుడూ అక్కడి నుండి, తమ గమ్యాన్ని చేరుకోవాలని చూస్తున్న ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. షాద్ నగర్ డిపో కు చెందిన బస్సు ప్రమాదానికి గురైంది. దాదాపు 70మంది ప్రయాణికుల గుంపు అక్కడ ఉన్నారు. కండక్టర్ బొడ్డుపై నిలబడి కనిపించిన ఆర్టీసీ బస్సు ను ఆపుతున్నాడు. కానీ ఎవరూ కనీసం ఆపి ఏమైంది అని కూడా అడిగే పరిస్థితి కనిపించడం ప్రయాణికులను నిరాశ పరిచింది. ఎందుకంటే షాద్ నగర్ డిపో బస్సు కాబట్టి వేరే డిపోల వారు ఆపడం లేదని తెలిసింది. ఇలా జరగడం ప్రజలకు ఆర్టీసీ పై నమ్మకం లేకుండా చేస్తుంది. ఇకపై ఆర్టీసీ అధికారులు తగిన సూచనలు చేసి డ్రైవర్ లను విధుల్లోకి పంపాలని ప్రజలు కోరుతున్నారు.

# సుప్రీం కోర్టు దక్షిణ ధర్మాసనం హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేయాలి

**పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్**




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (జనంసాక్షి):** సుప్రీం కోర్టులో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించేందుకు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచే సుప్రీం కోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ-2026 బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఆ పార్టీ పార్లమెంటరీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. బుధవారం రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, న్యాయమూర్తుల సంఖ్య పెరగడం వల్ల మరిన్ని ధర్మాసనాలు ఏర్పాటు చేయడంతో పాటు రాజ్యాంగ ధర్మాసనాలను క్రమం తప్పకుండా నిర్వహించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దక్షిణ భారత ప్రజలు ప్రతి ముఖ్యమైన కేసు కోసం ఢిల్లీకి రావాల్సి వస్తోందని, దీనివల్ల ప్రయాణం, వసతి, న్యాయవాదుల ఫీజులతో సాధారణ ప్రజలపై భారీ ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం అందరికీ సమానంగా అందాలంటే న్యాయవ్యవస్థ కూడా ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ భారతదేశానికి శాశ్వత సుప్రీం కోర్టు ధర్మాసనం ఏర్పాటు చేయాలంటే హైదరాబాద్‌కు మించిన అనువైన నగరం మరొకటి లేదని స్పష్టం చేశారు. భౌగోళికంగా దక్షిణాది రాష్ట్రాలకు హైదరాబాద్ కేంద్రంగా ఉండటంతో పాటు రక్షణ, శాస్త్ర-సాంకేతిక, ఐటీ, ఫార్మా, పరిశోధన రంగాల్లో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగిందన్నారు. కాబట్టి న్యాయవ్యవస్థ సంస్కరణల్లో భాగంగా హైదరాబాద్‌లో శాశ్వత సుప్రీం కోర్టు ధర్మాసనం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరపున ఆయన కోరారు.

బుధవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. పార్లమెంట్ అనెక్స్ భవనంలో స్థాయీ సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేశంలోని క్రూడాయిల్, సహజవాయువు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిల్వలు, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, ధరల హెచ్చుతగ్గులు, కల్తీ నివారణ, ప్రమాదాల నియంత్రణ, వ్యర్థాల అరికట్టే చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు ఆయిల్ కంపెనీల అధికారులు క్షేత్రస్థాయిలో మరింత పర్యవేక్షణ చేపట్టాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచించారు. ఇంధన సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు పలు నిర్మాణాత్మక సలహాలు కూడా అందించారు.

# ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి అవసరం లేదు

- మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రజావాణిలు చాలు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అభిప్రాయం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అవసరం లేదని, మండలం, జిల్లా, రాష్ట్రస్థాయి ప్రజావాణిలు మాత్రమే ఉండాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయం అని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయాలు దాదాపుగా కలెక్టరేట్ లోనే ఉంటాయని, లేదంటే చుట్టుపక్కల ఉంటాయని, అలాంటప్పుడు మండలం, జిల్లాస్థాయి ప్రజావాణిల మధ్యలో ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అవసరం లేదని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్లానింగ్ శాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేసి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని చిన్నారెడ్డి సూచించారు.


# కొరియర్ బాయ్‌గా వచ్చి మహిళ మెల్లో గొలుసు చోరీ

- సిసి ఫుటేజి ఆధారంగా దొంగను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, ఆగస్ట్ 5 (జనంసాక్షి) :** మియాపూర్ పరిధిలో కొరియర్ బాయ్‌గా నటిస్తూ ఇంట్లోకి ప్రవేశించిన ఓ యువకుడు మహిళపై పెప్పర్ స్ప్రే చల్లి బంగారు మంగళ సూత్రాన్ని అపహరించిన ఘటన కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కొరియర్ డెలివరీ పేరుతో వచ్చిన నిందితుడు.. మహిళ ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు మంగళ సూత్రాన్ని లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి భర్త మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, బంగారు మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ ఖాజా అర్షద్ (20)గా గుర్తించారు. నిందితుడిపై గతంలో ఏపీలోని కనిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు క్రిమినల్ కేసులు నమోదైనట్లు తెలిపారు.

# భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

- పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్5 (జనంసాక్షి) :** భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్

- సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి
- భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, ఆగస్ట్5 (జనంసాక్షి) :** డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



**హైదరాబాద్, ఆగస్ట్5 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 2024-25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. గత 6-7 ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్సిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తారని భావిస్తే, బ్జడెట్‌లో కేవలం 5.98 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమని అన్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యా లయాలు మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ సమాజం విద్యావంతం కావడం, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యారంగానికి కేటాయింపు లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# రాహుల్ గురించి మాట్లాడే అర్హత లేదు

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై సంపత్ విమర్శలు



**హైదరాబాద్, ఆగస్ట్5 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

# కృష్ణానదికి పెరుగుతున్న వరద ప్రవాహం



**నారాయణపేట, ఆగస్ట్5 (జనంసాక్షి) :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో ప్రవాహం రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుందడడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటి కప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

- తుదిదశకు మూసారాం బాగ్ బ్రిడ్జి పనులు
- పనులను పర్యవేక్షించిన మంత్రులు



**హైదరాబాద్, ఆగస్ట్5 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతిత్వరలోనే ఈ వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొన్నారు.

## గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్ట్5 (జనంసాక్షి) :** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాకలెట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దుండిగల్ తండా-2లో తనిఖీలు చేశారు. నిందితుడి దగ్గరి నుంచి 350 గ్రాముల 71 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కాజీపల్లిలోని కంపెనీలో లేబర్‌గా పనిచేస్తూ దుండిగల్ తండా-2లో నిందితుడు రంజిత్ కుమార్ నివాసం ఉంటునట్లు పోలీసులు వెల్లడించారు. బిహార్‌లోని తన అత్తగారి ఊరి నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలిపారు. తండాలోని స్థానిక కార్మికులకు, లేబర్లకు గంజాయి చాక్లెట్లను అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎయిర్‌పోర్టుకు రోడ్డు ఇవ్వొద్దు

- గ్రామస్తుల ధర్నా



**ఆదిలాబాద్, ఆగస్ట్5 (జనంసాక్షి) :** ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు కోసం తమ గ్రామ రోడ్డును తీసుకుంటే మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని కోరుతూ అనుకుంటా గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి బైఠాయించి నిరసన తెలిపారు.ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న తమ భూములకు రూ.6 కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామస్థులు ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ప్రయాణం చేస్తుండగా రోడ్డు ఎయిర్‌పోర్టులో పోతే 16 కిలోమీటర్లు దూర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డుతో పాటు తమ గ్రామాన్ని మొత్తం తీసుకొని ఇతర ప్రాంతంలో తమకు పునరావసం కల్పించాలని కోరారు.

## కుటుంబ కలహాలతో తండ్రి రాక్షసత్వం

- నాలుగేళ్ల కుమారుడుని బండకేసి కొట్టిన దుర్మార్గుడు

**హైదరాబాద్, ఆగస్ట్5 (జనంసాక్షి) :** నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రి.. నాలుగేళ్ల కుమారుడిపై దారుణంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తండ్రి సల్మాన్.. కొడుకు అర్మాన్‌ను ఓ పిల్లర్‌కు బలంగా కొట్టి నేలపై పడేశాడు. అంతటితో ఆగకుండా బాలుడిని లారీ కిందకు నెట్టేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు బాలుడిని కాపాడారు. తీవ్రంగా గాయపడిన అర్మాన్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని నిందితుడు సల్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సల్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370